# విశాల భారతి

తెలుగు దినపత్రిక

07-08-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ | సంపుటి:4 సంచిక: 213




## మెట్రో రెండవ దశకు రెడ్ సిగ్నలేనా ?

- కేంద్ర మద్దతు లేక రేవంత్ ప్రాజెక్ట్ నిలిచింది
- ఎల్ అండ్ టీకి రూ.15,000 కోట్లు చెల్లించాలి
- ఐఆర్ఎఫ్‌సీ గ్యారెంటీ ఇవ్వక జపాన్ రుణం పోయింది
- మంత్రుల హామీలు నెరవేరలేదు
- ఎస్‌బీఐ క్యాప్స్ పనులు మొదలుపెట్టలేదు
- హైదరాబాద్ మెట్రో విస్తరణ ఆగిపోయింది

02

# రోడ్డునపడ్డ 2 వేల ఔట్ సోర్సింగ్ కుటుంబాలు



## రేవంత్ ప్రభుత్వం 2,000 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగించింది

- రెవెన్యూ 650, భూభారతి 650, రిజిస్ట్రేషన్లు 200, ఇతరులు 500
- 2006 నుంచి పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లను తీసేశారు
- కొత్త నియామకాలు పూర్తయ్యాయని ఉద్యోగాల నుంచి తొలగించారు
- ఉద్యోగాలు తీసేయడమే గాక ఏడాదిగా బకాయిలు చెల్లించలేదు
- 2,000 బాధిత కుటుంబాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు

విశాలభారతి, స్టేట్ బ్యూరో: శాఖల వారీగా లెక్కలు పరిశీలిస్తే ప్రభుత్వ నిర్ణయం వల్ల ఎంతమంది నష్టపోయారో స్పష్టంగా తెలుస్తుంది. రెవిన్యూ శాఖలో టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లుగా సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న 650 మంది ఉద్యోగులను పక్కన పెట్టారు. భూభారతి పోర్టల్ నిర్వహణలో కీలక పాత్ర పోషించిన మరో 650 మంది కంప్యూటర్ ఆపరేటర్ల సేవలను ఆపేసారు. స్టాంప్స్ రిజిస్ట్రేషన్ల శాఖలో బాధ్యతలు నిర్వర్తిస్తున్న 200 మందిని ఉన్నపళంగా తొలగించారు. వేర్వేరు ఇతర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న మరో 500 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందిని విధుల్లోంచి పూర్తిగా తొలగించడం జరిగింది. 4.5 లక్షల కుటుంబాలకు జీతాలు ఇస్తూ ఆదుకుంటున్నామని నిత్యం చెప్పే పాలకులు ఈ 2 వేల మంది ఉద్యోగుల ఆవేదనను ఎందుకు గమనించడం లేదో స్పష్టం చేయడం లేదు. సేవలు అందించిన వ్యవస్థను ఇలా అకస్మాత్తుగా రద్దు చేయడం అత్యంత బాధాకరం. ఉపాధి కోల్పోయిన ఉద్యోగులు తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియక మానసికంగా కుంగిపోతూ రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయాల్సిన ఘోర దుస్థితి ఇక్కడ ప్రత్యక్షంగా కనిపిస్తోంది. ఉద్యోగాలు కోల్పోయిన వారి నేపథ్యాన్ని లోతుగా పరిశీలిస్తే మరింత ఆవేదన కలుగుతుంది. వీళ్లలో అత్యధికులు 2006 సంవత్సరం నుండి ప్రభుత్వ శాఖల్లో కంప్యూటర్ ఆపరేటర్లుగా ఎంతో నమ్మకంతో పని చేస్తున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో నియమితులైన వీరంతా గత 18 ఏళ్లుగా నిరంతరం ప్రభుత్వ సేవల్లో భాగమయ్యారు. తమ యవ్వనాన్ని, శ్రమను ప్రభుత్వం కోసమే ధారపోసిన వీరంతా ఇప్పుడు వయస్సు పైబడిన వేళ అకస్మాత్తుగా దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. గ్రూప్4 పరీక్షల ద్వారా కొత్తగా కంప్యూటర్ ఆపరేటర్లను నియామకం చేసుకున్నాము, కాబట్టి మిగతా 2లో..

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈమధ్య ఏ బహిరంగ సభలో మాట్లాడినా తమ కొత్త పాలనలో ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని చాలా బలంగా చెబుతున్నారు. రెగ్యులర్ సిబ్బందితో పాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ప్రతి నెలా ఒకటో తేదీనే క్రమం తప్పకుండా వేతనాలు చెల్లిస్తున్నామని విరివిగా ప్రకటించుకుంటున్నారు. కాంట్రాక్టర్ల పాత పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తున్నామని చెప్తూ దాదాపు 4.5 లక్షల కుటుంబాలకు మేలు చేస్తున్నట్లు గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారు. పాలకులు తమ స్వయంకృషితో సాధించిన విజయాలను చెప్పకోవడంలో ఎలాంటి తప్పు లేదు. అయితే ఈ ప్రభుత్వ ప్రచార హోరు వెనుక ఒక చేదు నిజం దాగి ఉంది. దాదాపు 2 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం ఉన్నపళంగా విధుల్లోంచి తొలగించింది. మైకుల్లో కనిపిస్తున్న ఉద్యోగ ప్రేమ ఈ బాధితుల వద్దకు వచ్చేసరికి ఎందుకు కనిపించడం లేదో ఎవరికీ అర్థం కావడం లేదు. తీసేసిన రెండు వేల మంది అంటే రెండు వేల నిరుపేద కుటుంబాల జీవితాలు రోడ్డున పడ్డాయి.

## మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు



- హరీశ్‌రావు క్షుద్ర పూజలపై వివరణ ఇవ్వాలని డిమాండ్
- లీగల్ నోటీసులకు భయపడేది లేదు
- సీఎం రేవంత్‌రెడ్డితో ఎలాంటి గ్యాప్ లేదు

02

## బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఉండాల్సిందే




02

- బడ్జెట్‌లోనే బీసీ బిల్లు పాస్ చేయకపోతే ఢిల్లీ ముట్టడిస్తామని హెచ్చరిక
- చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్ల కోసం పోరాటం
- తమిళనాడు తరహాలో రిజర్వేషన్లకు 9వ షెడ్యూల్ రక్షణ కల్పించాలి
- బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వాలి
- రేవంత్, కిషన్ రెడ్డి రాజకీయ లబ్ధి కోసమే పనిచేస్తున్నారని ఆరోపణ
- ట్యాంక్ బండ్‌పై ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం పెట్టాలని డిమాండ్




## యూపీఐపై ఛార్జీలు

- యూపీఐ పై ఛార్జీల బిల్లు ఆమోదం
- లోక్‌సభలో చర్చ లేకుండానే గ్రీన్ సిగ్నల్
- యాక్ట్-2007 సవరణలతో బ్యాంకులకూ అధికారం

03

## రాష్ట్రంలో ఢిల్లీ గులాంగిరి పాలన



- సీఎం రేవంత్ ఢిల్లీకి సామంతుడిలా మారారు
- ఢిల్లీకి తలాడించకుండా స్వీయ అస్తిత్వంతో పాలించాలి
- బీఆర్ఎస్‌కు జయశంకర్, రేవంత్‌కి చంద్రబాబే గురువు
- పుష్కలంగా నీళ్లున్నా పంపులు ఆన్ చేయడం లేదు
- ఏటా 2 లక్షల ఉద్యోగాల హామీని విస్మరించారు
- కాంగ్రెస్ శత్రువు, తెలంగాణ మళ్లీ కేసీఆర్ చేతిలోనే ఉండాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ భవన్‌లో ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్రంలో ప్రస్తుతం సాగుతున్న కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కష్టపడి పోరాడి తెచ్చుకున్న స్వరాష్ట్రంలో మళ్లీ ఢిల్లీ గులాంగిరి పాలన మొదలైందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ముప్పై రెండు నెలల కాలంలో ఏకంగా డెబ్బై ఐదు సార్లు ఢిల్లీ చుట్టూ తిరిగారని ఎద్దేవా చేశారు. అక్కడ ఆయన ఏం యాచిస్తున్నారో ఎవరికీ అర్థం కావడం లేదన్నారు. ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి ఢిల్లీ పెద్దల వద్ద మోకరిల్లడం తెలంగాణ ప్రజలకు తీవ్ర అవమానమని పేర్కొన్నారు. స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే స్వీయ మిగతా 3లో..



## ఆగస్టు 15న కొత్త రేషన్ కార్డులు

### పంద్రాగస్టున కొత్త తెల్ల రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం

- సంగారెడ్డిలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ ప్రారంభం
- పంద్రాగస్టు మధ్యాహ్నం అన్ని నియోజకవర్గాల్లో ఏకకాలంలో కార్డులు పంపిణీ
- రాష్ట్రంలో సుమారు 1.05 కోట్ల కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు
- డెబిట్ కార్డు సైజులో క్యూఆర్ కోడ్‌తో ఉండే పీవీసీ కార్డులు అందజేత
- ఆగస్టు 15 నాటికి ఏర్పాట్లు పూర్తిచేయాలని మంత్రి ఉత్తమ్ స్పష్టం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన పేద కుటుంబాలకు తీపి కబురు అందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక గొప్ప నిర్ణయాన్ని తీసుకుంది. ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కొత్త తెల్ల రేషన్ కార్డుల పంపిణీకి తేదీని అధికారికంగా ఖరారు చేసింది. వచ్చే ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా రాష్ట్రవ్యాప్తంగా నూతన తెల్ల రేషన్ కార్డులను పంపిణీ చేయాలని నిశ్చయించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వం ఈ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ కార్డుల ప్రక్రియను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. గతంలో రేషన్ కార్డులు లేక అనేక ఇబ్బందులు పడుతున్న ప్రతి పేద కుటుంబానికి ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా పాలకులు పనిచేస్తున్నారు. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులకు అవసరమైన అన్ని మార్గదర్శకాలను జారీ చేశారు. అర్హత కలిగిన ఏ ఒక్క కుటుంబం విడిపోకుండా ప్రణాళికలు తయారు చేసి, ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు మిగతా 4లో..



## ప్రజల్లోకి కాక్రోచ్‌లు

- యువత సమస్యలపై సీజేపీ జాతీయ పర్యటన
- నిరుద్యోగాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శ
- 80శాతం గ్రాడ్యుయేట్లకు ఉద్యోగాలు లేవు
- జంతర్ మంతర్ పోరాటంతోనే కేంద్ర మంత్రి రాజీనామా
- రాజ్యాంగబద్ధ, లౌకికవాద విధానమే తమ మార్గం
- గాంధీ, అంబేద్కర్, నెహ్రూల ఆశయాలే పునాది

02

## ఎమ్మెల్యే ఇంట్లో లవ్ బాంబు



- ప్రేమ పెళ్లిపై ప్రకాష్ గౌడ్, కొడుకు సంతోష్ మధ్య వివాదం
- రూపా రెడ్డిని పెళ్లాడతానంటే తండ్రి దాడులు చేయిస్తున్నాడని ఆవేదన
- డయల్-100కి కాల్ చేసినా పోలీసులు స్పందించలేదని ఫిర్యాదు
- "వాడెవడో తెలియదు, సంబంధం లేదు" అని చెప్పిన ప్రకాష్ గౌడ్
- తమను జైలుకు పంపేందుకు కుట్ర చేస్తున్నారని రూపా రెడ్డి ఆరోపణ
- ఈ తండ్రీకొడుకుల రచ్చ ఏ మలుపు తిరుగుతుందోనని ఆసక్తి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రాజేంద్రనగర్ శాసనసభ్యుడు ప్రకాష్ గౌడ్ కుటుంబంలో తలెత్తిన రాజకీయ, ప్రేమ వివాదం ప్రస్తుతం వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు సుదీర్ఘ రాజకీయ అనుభవం, అధికారం, ప్రజాప్రతినిధి హోదా స్పష్టంగా కొనసాగుతుండగా, ఇంకోవైపు మనసు ఇచ్చిన ప్రియురాలి కోసం తండ్రి అధికార శక్తిని నిత్యం ధైర్యంగా ఎదురించేందుకు సిద్ధపడిన కుమారుడి పోరాటం ప్రత్యక్షంగా కనిపిస్తోంది. తాను ప్రాణంగా ఎంతగానో ప్రేమించిన రూపా రెడ్డిని వివాహం చేసుకునేందుకు నిశ్చయించుకున్న ఎమ్మెల్యే కుమారుడు సంతోష్ గౌడ్, తండ్రి వైఖరిని నిరసిస్తూ బహిరంగంగా వార్తా మీడియా ముందుకు ధైర్యంగా రావడం సంచలనం సృష్టించింది. తండ్రీ కొడుకుల నడుమ తలెత్తిన ఈ తీవ్రమైన వైరుధ్యం కేవలం మిగతా 3లో..



## సింగరేణికి చేరిన నైనీ బొగ్గు

- ఒడిశా నైనీ గని నుంచి తొలి బొగ్గు రైలు
- సింగరేణి థర్మల్ కేంద్రానికి చేరిన రేకు
- 1,131 కిలోమీటర్లు ప్రయాణించిన వ్యాగన్లు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చొరవ
- ఏడాదికి కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి
- రాష్ట్ర విద్యుత్ రంగానికి నూతన వెన్నెముక

03

# మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు

**విశాలభారతి, హైదరాబాద్ బ్యూరో:** బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. క్షుద్ర పూజల అంశంపై హరీష్ రావు తక్షణమే ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హరీశ్‌రావు వెళ్లిన ఆలయాలు క్షుద్ర పూజలకు ప్రసిద్ధి చెందినవని, ఆయన అక్కడ ఏ ఉద్దేశంతో పూజలు చేశారో స్పష్టం చేయాలన్నారు. తాను హరీష్ రావుపై ఎలాంటి అబద్ధాలు చెప్పలేదని, తప్పుడు ప్రచారం చేయలేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. హరీష్ రావు పంపిన లీగల్ నోటీసులకు తాము భయపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఈ వివాదంపై ఏ విషయమైనా న్యాయస్థానంలోనే తేల్చుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్రానికి శని ఎవరనేది, దరిద్రం ఎవరనేది ప్రజలు ఇప్పటికే ఎన్నికల్లో స్పష్టంగా తేల్చిచెప్పారన్నారు. కాంగ్రెస్ పార్టీకి మూఢనమ్మకాలు లేవని, పార్టీ చేసిన త్యాగాలను ప్రతిపక్షాలు తెలుసుకోవాలని హితవు పలికారు. రేవంత్‌రెడ్డికి, తనకు మధ్య ఎలాంటి మనస్పర్థలు లేవని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. తమ మధ్య మంచి సఖ్యత ఉందని, ప్రతిరోజూ ఫోన్‌లో మాట్లాడుకుంటామని తెలిపారు. నిన్న కూడా సీఎంతో ఫోన్‌లో మాట్లాడినట్లు చెప్పారు. సమన్వయ కమిటీకి (కోఆర్డినేషన్ కమిటీ) అన్ని విషయాలు ముఖ్యమంత్రి చెప్పాల్సిన అవసరం లేదన్నారు. పార్టీ, ప్రభుత్వం వేర్వేరు కావని.. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ముఖ్యమంత్రి అని, తామంతా ఆయనను గౌరవిస్తామని తెలిపారు. కాంగ్రెస్‌లో దొంగచాటుగా ఫిర్యాదులు చేసుకునే సంస్కృతి లేదని, ఏమున్నా ముఖంపైనే మాట్లాడుకుంటామని స్పష్టం చేశారు. కోఆర్డినేషన్ కమిటీలో పలు కీలక అంశాలపై చర్చ జరిగినట్లు ఆయన వెల్లడించారు. తనకు, సీఎంకు వ్యతిరేకంగా ఆడియోలు, వీడియోలు ఉన్నాయని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదన్నారు. దమ్ముంటే ఆ ఆడియోలు, వీడియోలను బయటపెట్టాలని మహేశ్ గౌడ్ సవాల్ విసిరారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీలపై కూడా ఆయన మండిపడ్డారు. బీజేపీ ఎంపీ అరవింద్ మాటలు కేవలం నీటి మూటలని ఎద్దేవా చేశారు.



# రోడ్డునపడ్డ 2 వేల 'ఔట్ సోర్సింగ్' కుటుంబాలు

**మొదటి పేజీ తరువాయి**

మీ సేవలు అవసరం లేదు అని ఈ ఏడాది మార్చి నెలలో ప్రభుత్వం స్పష్టంగా చెప్పింది. సంవత్సరాల తరబడి చేసిన తమను ఇలా అర్ధాంతరంగా వీధిపాలు చేయడం న్యాయం కాదని వీరు కన్నీరుమున్నీరవుతున్నారు. తమకు న్యాయం చేయాలని ఈ బాధితులు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నపాలు చేసినా ఎలాంటి ప్రయోజనం కనిపించకపోవడం బాధాకరం. ఇప్పుడు వేరే కొత్త ఉద్యోగాలు వెతుక్కునే వయసు దాటిపోయిన పరిస్థితిలో ఈ ఉద్యోగులు చాలా మంది ఉన్నారు. ఇక్కడ గమనించాల్సిన మరో తీవ్రమైన సమస్య ఏమిటంటే తొలగించబడిన ఈ ఉద్యోగుల్లో చాలామందికి సుమారు 12 నెల్ల కాలంగా జీతాలు కూడా చెల్లించలేదు. ఒకవైపు వేళకు జీతాలు ఇస్తున్నామని రేవంత్ ప్రభుత్వం గొప్పగా మైకుల్లో చెప్తుంటే, మరోవైపు ఇన్ని ఏళ్లుగా సేవలందించిన ఉద్యోగులకు నయా పైసా ఇవ్వకుండా తీవ్ర కష్టాల్లోకి నెట్టివేశారు. దాదాపు ఏడాది కాలంగా వేతనాలు అందక వీరంతా ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలను పోషించుకోలేక నరకం చూస్తున్నారు. చేసిన అప్పులు తీర్చలేక, రోజూ గడవడం కష్టమై అనేక వేదనలను అనుభవిస్తున్నారు. ప్రస్తుతం వెలుగులోకి వచ్చింది కేవలం 2 వేల మంది బాధితుల లెక్క మాత్రమే. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మిగిలిన ఇతర శాఖల్లో ఇంకా ఎంతమంది ఉద్యోగులు ఇలా రహస్యంగా ఉద్యోగాలు కోల్పోయారో లోతుగా పరిశీలించాల్సిన బాధ్యత ఉంది. ప్రభుత్వ తీరు వల్ల ఉపాధి లేక నడిరోడ్డున పడ్డ కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలి. వారి బతుకులకు రక్షణ కల్పించాల్సిన కనీస బాధ్యత ఈ రాష్ట్ర పాలక వర్గంపైనే కచ్చితంగా ఉందని భావిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ బాధితుల విషయంలో జోక్యం చేసుకుని తొలగించబడిన 2 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు తగిన న్యాయం చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. కేవలం తమ పాలనా విజయాల ప్రచారానికే పరిమితం కాకుండా, అర్ధాంతరంగా రోడ్డున పడ్డ ఈ పేద కుటుంబాల కన్నీళ్లను తక్షణమే తుడవాలి. ఇన్ని ఏళ్లుగా విశ్వసనీయంగా పనిచేసిన సిబ్బందిని గ్రూప్4 నియామకాల పేరుతో తొలగించడం కాకుండా, వారి అనుభవాన్ని ప్రాతిపదికగా తీసుకుని ఇతర అందుబాటు శాఖల్లో సర్దుబాటు చేయాలి. ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న వారి బకాయి వేతనాలను విడుదల చేసి మానవత్వంతో ఆదుకోవాలి. ప్రజా సంక్షేమం అంటే కేవలం ప్రచార ఉపన్యాసాలు కాదని, బాధితులకు అండగా నిలబడటమే అసలైన ప్రజాపాలన అని ప్రభుత్వం గ్రహించాలి.

# ప్రజల్లోకి కాక్రోచ్‌లు

**విశాలభారతి, జాతీయం:**



కాక్రోచ్ జనతా పార్టీ జాతీయ స్థాయిలో 'క్యా బోల్తీ పబ్లిక్' కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. విద్యార్థి పోరాటాల ద్వారా కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాకు దారితీసిన ఈ సంస్థ, ఇప్పుడు ప్రజా సమస్యలపై నేరుగా పోరాడేందుకు సిద్ధమైంది. దేశంలోని యువత ఆకాంక్షలు, వారి అంచనాలు, ఆందోళనలను ప్రత్యక్షంగా తెలుసుకోవడమే ఈ నూతన ప్రచార ముఖ్య ఉద్దేశం. యువతను వేధిస్తున్న నిరుద్యోగ సమస్యను రాబోయే రోజుల్లో అతిపెద్ద జాతీయ అంశంగా మారుస్తామని సంస్థ నాయకులు స్పష్టం చేశారు. సమాజంలో మార్పు తీసుకురావడానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం. సెప్టెంబర్ నెల నుండి ప్రారంభమయ్యే ఈ జాతీయ పర్యటనల ద్వారా ప్రతి ఒక్కరి భావాలను వేదికపైకి తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. సామాజిక చైతన్యం పెంచడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా రూపాంతరం చెందుతూ, ప్రజా పోరాటాలను మరింత ఉధృతం చేయడానికి సీజేపీ నాయకత్వం పూనుకుంది. రెండు రోజుల పాటు సాగిన సుదీర్ఘ చర్చల అనంతరం సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ పర్యటన వివరాలను అధికారికంగా వెల్లడించారు. సెప్టెంబర్ నుంచి దేశమంతటా విస్తృతంగా పర్యటిస్తూ, ప్రతి ఒక్కరిని కలుస్తామని చెప్పారు. విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయం, ఉపాధి అవకాశాలు తమ ప్రధాన ఎజెండా అని తెలిపారు. దేశ జనాభాలో ముప్పై ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారు ఏకంగా అరవై ఐదు శాతం మంది ఉన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో ఉన్న యువత ఎదుర్కొంటున్న ఆందోళనలను ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తోంది. యువత సమస్యల గురించి గొంతు విప్పేవారు కరువైన ఈ రోజుల్లో, వారి తరపున మాట్లాడేందుకు సీజేపీ నేరుగా ప్రజల వద్దకే వెళ్లాలని గట్టిగా నిశ్చయించుకుంది. యువతరం ఫ్యూచర్ బాగుండాలంటే, వారి ఆకాంక్షలను చట్టసభలకు వినిపించాల్సిన బాధ్యత అందరిపై ఎంతైనా ఉంది. దేశంలో చదువుకున్న యువత తీవ్రమైన ఉద్యోగ రూపంలో ఉన్న సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని దీప్కే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద పెద్ద డిగ్రీలు సాధించినప్పటికీ, దాదాపు ఎనభై శాతం మంది నిరుద్యోగులుగా మిగిలిపోవడం విచారకరం. నాణ్యమైన చదువు పూర్తి చేయని వ్యక్తులు ఈ రోజు పాలకవర్గంలో ఉంటూ నిర్ణయాలు తీసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. యువత భవిష్యత్తును సరిగ్గా అంచనా వేయలేని పరిస్థితిలో ప్రస్తుత ప్రభుత్వం ఉందనేది స్పష్టమవుతోంది. సరైన ఉపాధి కల్పించడంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యారు. నిరుద్యోగ సంక్షోభాన్ని ప్రభుత్వం ఇకపై ఏమాత్రం నిర్లక్ష్యం చేయడానికి వీల్లేకుండా పెద్ద ఎత్తున ఒత్తిడి పెంచుతామని సీజేపీ స్పష్టం చేసింది. ఉన్నత విద్య పూర్తి చేసిన ప్రతి ఒక్కరికీ అర్హతకు తగ్గ ఉద్యోగం లభించినప్పుడే సమాజంలో నిజమైన మార్పు, అభివృద్ధి సాధ్యమవుతాయి. ఉద్యోగాల వేటలో యువత పడుతున్న పాట్లను తొలగించడం అత్యవసరం. న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన భారీ నిరసన ప్రదర్శన, నిరుద్యోగ వ్యతిరేక పోరాటానికి ఒక మైలురాయిగా నిలిచింది. ఆ జెన్ జీ ఉద్యమ తీవ్రత కారణంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. తాము నేరుగా ఎన్నికల రాజకీయాల్లోకి ప్రవేశించకుండా, ఒక బలమైన ఒత్తిడి శక్తిగా మాత్రమే కొనసాగుతామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలను ప్రభుత్వం ముందు ఉంచడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. నిరుద్యోగాన్ని జాతీయ స్థాయిలో ప్రధాన చర్చనీయాంశంగా మార్చి, ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకునేలా పోరాడతామని ప్రకటించారు. దేశంలో ఇటీవల వచ్చిన రాజకీయ చైతన్యానికి విద్యార్థుల నిరసనలే మూలకారణం. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న అణచివేత, నిరంకుశ పోకడలకు చరమగీతం పాడేందుకు యువతరం ముందుకు రావడం ఎంతో ఆశాజనకమైన పరిణామంగా మారింది. సీజేపీ సిద్ధాంతం పూర్తిగా భారత రాజ్యాంగ విలువలపైనే ఆధారపడి పనిచేస్తుందని అభిజీత్ దీప్కే స్పష్టంగా వెల్లడించారు. తాము లౌకికవాదం, ప్రజాస్వామ్య సూత్రాలను విశ్వసిస్తూ, సామాజిక న్యాయం సాధించే దిశగా నిరంతరం శ్రమిస్తామని చెప్పారు. మహాత్మా గాంధీ బోధించిన అహింసా మార్గం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అందించిన సామాజిక దృక్పథం, జవహర్‌లాల్ నెహ్రూ నిర్మించిన ఆధునిక భారత స్వప్నం తమకు నిరంతర స్ఫూర్తినిస్తాయని తెలిపారు. యువతరం తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాల్సిన సమయం వచ్చింది. భవిష్యత్ తరాలకు మెరుగైన అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యంగా పనిచేస్తామని వెల్లడించారు. సమాజంలో ఉన్న అసమానతలను తొలగించి, ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి సీజేపీ కృషి చేస్తుంది. రాజ్యాంగబద్ధమైన హక్కుల పరిరక్షణ కోసం, యువత కలలను నిజం చేయడం కోసం తమ పోరాటాన్ని ఆపకుండా ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.



# శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

- **మంత్రి కోమటిరెడ్డి.. చిన్న కాంట్రాక్టర్లు ఎవరు అధైర్య పడొద్దు**
- **మీ సమస్య మా దృష్టికి తీసుకురండి**

**ఎల్బీ నగర్ విశాలభారతి:** నాగర్ కర్నూల్ జిల్లాకు నచెందిన కాంట్రాక్టర్,వైస్ ఎంపీపీ,సింగిల్ విండో చైర్మన్‌గా ప్రజలకు సేవలందించిన బండారి శ్రీనివాస్ రెడ్డి మృతి తనను తీవ్రంగా బాధించిందని రాష్ట్ర రోడ్లు&భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రివర్యులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. ఎల్బీ నగర్ నియోజకవర్గం వనస్థలిపురంలోని నివాసంలో వారి కుటుంబాన్ని పరామర్శించి,శ్రీనివాస్ రెడ్డి భార్య,కుమారుడికి ధైర్యం చెప్పారు .ఈ సందర్భంగా మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ శ్రీనివాస్ రెడ్డి కేవలం కాంట్రాక్టర్ మాత్రమే కాదని,ప్రజా జీవితంలో చురుకుగా ఉంటూ మంచి పేరు సంపాదించుకున్న నాయకుడని తెలిపారు..చిన్న చిన్న పనులు, క్రషర్ నిర్వహణ ద్వారా సుమారు 200 మందికి ఉపాధి కల్పించారని,నాణ్యమైన పనులు చేసే కాంట్రాక్టర్‌గా ఆయనకు మంచి గుర్తింపు ఉందన్నారు.గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన CRF పనులకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.685 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండగా, శ్రీనివాస్ రెడ్డికి కూడా దాదాపు రూ.5 కోట్ల బకాయిలు ఉన్నాయని మంత్రి తెలిపారు. ఈ బకాయిలను విడుదల చేయించేందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో ప్రత్యేకంగా మాట్లాడి,ఇటీవలే సంబంధిత పెండింగ్ చెక్ విడుదల చేయించినట్లు వెల్లడించారు.

# బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఉండాల్సిందే

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



చట్టసభలలో బీసీ వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లు దక్కే వరకు తన పోరాటం ఆగదని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో జరిగిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభలో ఆమె కీలక ప్రసంగం చేశారు. పుట్టుక ఎవరి చేతిలోనూ లేదని, అయితే ఎవరి మేలు కోసం నిలబడాలో నిర్ణయించుకోవడం మాత్రం తమ సొంత చేతుల్లోనే ఉంటుందని ఆమె గుర్తుచేశారు. ఇప్పటివరకు గ్రామ పంచాయతీ ముఖం కూడా చూడని అత్యంత వెనుకబడిన వర్గాలకు రాజకీయ అధికార ప్రాప్తి కలిగించేలా కృషి చేస్తానని చెప్పారు. ప్రజలలో సామాజిక సాధికారత వచ్చే వరకు తన జీవితాన్ని పూర్తిగా అంకితం చేస్తానని తెలిపారు. సమాజంలో వంద రొట్టెలు ఉంటే కేవలం పది మంది మాత్రమే తొంబై రొట్టెలు తింటూ ఆకలి తీర్చుకోవడం తీవ్రమైన అన్యాయమని, వంద మందికీ సమానంగా లభించడమే అసలైన సమానత్వమని ఆమె గట్టిగా అభిప్రాయపడ్డారు. దేశంలో చరిత్రను తిరగరాసిన విప్లవాత్మక సామాజిక మార్పులు అనేక సందర్భాలలో అగ్రవర్ణాల్లో పుట్టిన గొప్ప ఆలోచనాపరుల పోరాటాల వల్లనే సాధ్యమయ్యాయని కవిత గుర్తుచేశారు. గౌతమ బుద్ధుడు, సాహూ మహారాజ్, విశ్వనాథ్ ప్రతాప్ సింగ్, తమిళనాడులో జయలలిత వంటి వారు ఎందరో తమ అధికారాలను ఉపయోగించి వెనుకబడిన వర్గాలకు అండగా నిలిచారని వెల్లడించారు. భారతదేశంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మండల్ కమిషన్ నివేదికను పక్కన పెడితే వి.పి.సింగ్ దానిని ధైర్యంగా అమలు చేశారని పేర్కొన్నారు. మన రాజ్యాంగం అందించిన హక్కులను పూర్తిస్థాయిలో సాధించుకోలేకపోయామని, అందుకే సమాజంలో ఇప్పటికీ కుల వివక్ష మిగిలే ఉందన్నారు. ధర్మం, న్యాయం ఎప్పుడూ పేద ప్రజల వైపే ఉండాలని, అందరికీ చట్టపరమైన రక్షణతోపాటు సమాజంలో సమతుల్యత కల్పించడమే తమ ముఖ్యమైన ఆశయమని సభా వేదికగా ఆమె వివరించారు. దళితులు, గిరిజనులకు ఇచ్చిన తరహాలోనే నాడే బీసీలకు సైతం సరైన ప్రాతినిధ్యం కల్పించి ఉంటే భారతదేశం అమెరికా లాంటి అగ్రదేశాలతో పోటీపడేదని ఆమె పేర్కొన్నారు. స్వతంత్ర దేశంలో ఇప్పటికీ లక్షలాది ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఉద్యోగ ఖాళీలు భర్తీ కాకుండా మిగిలిపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లింలలో కనీసం సర్పంచ్ స్థానానికి కూడా నోచుకోని ఎందరో పేదలు ఉన్నారని, వారందరికీ చట్టబద్ధమైన హక్కులతో కూడిన రిజర్వేషన్లు తక్షణమే అందాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు బీసీలకు సరిపడా కేటాయింపులు చేయకుండా అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. భాజపా, కాంగ్రెస్ నాయకులు గల్లీలో కుస్తీ పడుతూ ఢిల్లీలో దోస్తీ చేస్తున్నారని విమర్శించారు. బీసీల జనాభాకు తగినట్లుగా యాభై శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టసభలలో తగిన వాటా అందించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సామాజిక న్యాయ ఉద్యమం నేటితో ముగిసేది కాదని, రాబోయే రోజుల్లో ప్రతి గ్రామానికి విస్తరించి సావిత్రీబాయి పూలే జయంతి వరకు నిరంతరంగా కొనసాగుతుందని కవిత వెల్లడించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ముగిసేలోపు బీసీ బిల్లును సభలో ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా హెచ్చరించారు. లేనిపక్షంలో తెలంగాణ పోరాట వీరుల స్ఫూర్తితో 'ఛలో ఢిల్లీ' కార్యక్రమాన్ని చేపట్టి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. చిన్నపిల్లలే ధర్నాలు చేసి ప్రభుత్వ యంత్రాంగంలో కదలిక తెస్తున్నప్పుడు, ప్రజలంతా ఒకటై పోరాడితే సామాజిక మార్పు సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది ఆగస్టు ఆరో తేదీ నాటికి తమ పోరాట ఫలితాలను పునఃసమీక్షించుకుంటామని సభలో ప్రకటించారు. సమన్యాయం సాధించేందుకు వీలుగా ప్రజాస్వామ్యవాదులు అందరూ తమతో కలసి రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో ఆచార్య జయశంకర్ సార్ చెప్పిన మాటలను ఈ సందర్భంగా కవిత గుర్తుచేసుకున్నారు. రాష్ట్ర సాధన ఉద్యమం ఒక ఎత్తయితే, దానితో పాటు సామాజిక తెలంగాణ సాధన ఉద్యమాన్ని ఒకేసారి నడపలేమని ఆయన చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. కొత్త రాష్ట్రం ఏర్పడిన తర్వాతే పవిత్రమైన సామాజిక న్యాయ ఉద్యమాన్ని నిర్మించుకోవాలని ఆయన మార్గనిర్దేశం చేశారన్నారు. జయశంకర్ కన్న కలలను నెరవేర్చేందుకు తాము సంపూర్ణంగా కృషి చేస్తామని మాటిచ్చారు. తెలంగాణ భావజాల వ్యాప్తికి కారణమైన జయశంకర్ సార్ విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద గౌరవంగా ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ బద్ధమైన హక్కుల సాధన కోసం, సమాజంలో వెనుకబడిన వర్గాల భవిష్యత్తును మార్చేందుకు తమ పోరాటం నిరంతరం సాగుతుందని ఈ సభ ద్వారా కవిత తెగేసి చెప్పారు.

# ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి

**అశ్వాపురం, విశాల భారతి :**

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. శేషుబాబు మాట్లాడుతూ..ప్రొఫెసర్ జయశంకర్ సార్ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన చేసిన విశిష్ట సేవలు, విద్యారంగానికి అందించిన అమూల్యమైన సేవలను విద్యార్థులకు వివరించారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం ప్రభుత్వం విద్యార్థులకు సరఫరా చేసిన నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# మెట్రో రెండవ దశకు రెడ్ సిగ్నలేనా ?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



హైదరాబాద్ నగరాన్ని ప్రపంచస్థాయిలో ముందుకు తీసుకెళ్లాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మెట్రో రెండోదశ ప్రాజెక్టును వేగంగా ప్రారంభించాలని భావించారు. అయితే ఈ ప్రతిష్టాత్మక కల ఇప్పట్లో నెరవేరే సూచనలు కనిపించడం లేదు. మొదటిదశకు సంబంధించిన ఆర్థిక భారాలు, రెండోదశ నిర్మాణానికి అవసరమైన ఫైనాన్స్ విషయంలో కేంద్రప్రభుత్వం వెనకడుగు వేయడమే దీనికి ప్రధాన కారణం. గతంలో తెలంగాణలో పర్యటించినప్పుడు, సమావేశాల్లో కలిసినప్పుడు మెట్రో విస్తరణకు కేంద్రం నుంచి అన్నివిధాలా పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చిన కేంద్రమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్వనీ వైష్ణవ్ ఇప్పుడు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిరాశకు గురవుతోంది. హైదరాబాద్ వాసుల రవాణా కష్టాలు తీర్చేందుకు రూపొందించిన ప్రణాళికలు గాల్లో దీపాల్లా మారడంతో నగర ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. కేంద్రం మద్దతు లేకుండా ఈ బృహత్తర ప్రాజెక్టు ముందుకు సాగడం అసాధ్యంగా మారింది. మెట్రో రెండవ దశ ప్రాజెక్ట్ వేగవంతం చేయడానికి రేవంత్ రెడ్డి ఎంత ఆరాటపడుతుంటే, కేంద్ర ప్రభుత్వం అంతకంటే ఎక్కువగా సమస్యలను ముందుకు నెడుతోంది. మొదటిదశ ప్రాజెక్టును ప్రభుత్వం పూర్తిగా తన పరిధిలోకి తీసుకోవాలంటే, దానిని ప్రారంభించి నడుపుతున్న ఎల్ అండ్ టీ సంస్థకు సుమారు రూ. 15,000 కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇందులో భాగంగా ఆ సంస్థకు ఉన్న అప్పులు రూ. 13,600 కోట్లను తీర్చి, అదనంగా మరో రూ. 2,000 కోట్లను సంస్థకు చెల్లించడానికి ప్రాథమిక అంగీకారం కుదిరింది. ఈ భారీ అప్పులను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జపాన్ బ్యాంక్‌తో ముందస్తు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్రక్రియలో ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ గ్యారెంటీ ఇస్తే రుణం మంజూరు చేస్తామని జపాన్ బ్యాంకు స్పష్టంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇవన్నీ సజావుగా సాగితే మెట్రో సమస్య పరిష్కారమయ్యేది. కానీ అనూహ్యంగా ప్రతిబంధకాలు ఎదురుకావడంతో ప్రాజెక్టు పనులు మూలపడే ప్రమాదం ఏర్పడింది. రెండు నెలల క్రితం ఢిల్లీలో కేంద్ర రైల్వే, పట్టణాభివృద్ధి శాఖల మంత్రులు ఖట్టర్, అశ్వనీ వైష్ణవ్‌లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జరిపిన చర్చలు ఎంతో ఫలప్రదమయ్యాయని అంతా భావించారు. జపాన్ బ్యాంకుకు ఐఆర్ఎఫ్‌సీ ద్వారా గ్యారెంటీ ఇప్పించడానికి వారు సానుకూలంగా స్పందించారు. మెట్రో మొదటి, రెండోదశ పనుల ప్రక్రియను స్పీడప్ చేయడానికి ఎస్‌బీఐ క్యాప్స్ సంస్థను కన్సల్టెంట్‌గా నియమించడానికి అందరూ అంగీకరించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని ఆగస్టు నెలలోగా వేగంగా పూర్తిచేస్తామని ఎస్‌బీఐ క్యాప్స్ అంగీకరించింది. ప్రణాళికల ప్రకారం పనులు శరవేగంగా జరుగుతాయని నగర ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూశారు. తెలంగాణ ప్రభుత్వంతో పాటు వివిధ వర్గాలు కూడా ఈ డెవలప్‌మెంట్ పట్ల ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశాయి. మెట్రో విస్తరణతో భాగ్యనగర రూపురేఖలు మారిపోతాయని, ట్రాఫిక్ సమస్యలు శాశ్వతంగా తీరుతాయని భావించారు. అయితే ఈ సంతోషం ఎక్కువ కాలం నిలవలేదు. అనుకున్న ఒప్పందాల ప్రకారం పనులు సాగాల్సి ఉన్నప్పటికీ, సలహాదారుగా వ్యవహరించాల్సిన ఎస్‌బీఐ క్యాప్స్ సంస్థ తన బాధ్యతలను ఇప్పటివరకు ప్రారంభించకపోవడం అనేక అనుమానాలకు దారితీస్తోంది. మరోవైపు ఐఆర్ఎఫ్‌సీ సంస్థ ముందస్తుగా ఇచ్చిన మాట తప్పి గ్యారెంటీగా ఉండేందుకు అంగీకరించకపోవడంతో జపాన్ నుంచి రావలసిన ఆ భారీ రుణం పూర్తిగా రద్దయిపోయింది. గ్యారెంటీ ఇస్తామని హామీ ఇచ్చిన ఐఆర్ఎఫ్‌సీ చివరి నిమిషంలో ఎందుకు వెనక్కు తగ్గింది? అలాగే ఎస్‌బీఐ కార్ప్స్ కన్సల్టెంట్‌గా వ్యవహరించడానికి ఇంకా ఎందుకు ముందుకు రావడం లేదు? అనే విషయాలు ఎవరికీ అర్థం కావడం లేదు. ఆర్థిక సహకారం అందించాల్సిన సంస్థలు ఇలా ప్రవర్తించడం వెనుక అసలు కారణాలు ఏమిటో స్పష్టత రావడం లేదు. ఈ పరిణామాల వల్ల మెట్రో విస్తరణ పనులకు ఆటంకం కలగడమే కాకుండా, ప్రాజెక్టు భవిష్యత్తుపై పెద్ద ప్రశ్నార్థకం నెలకొంది. దీంతో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కడంపై అనేక సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి.



# దేశవ్యాప్తంగా హోంగార్డుల సమస్యలు పరిష్కారం కావాలి

**కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిని కలిసి కోరిన నేషనల్ హోంగార్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు.**

**ముషీరాబాద్,విశాల భారతి:** దేశవ్యాప్తంగా పనిచేస్తున్న హోంగార్డుల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ హోంగార్డు వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది.హోంగార్డుల సమస్యలు పరిష్కరించే విధంగా చట్టసభల్లో ప్రవేశపెట్టే మోడ్రన్ హోంగార్డు బిల్లు ఉండాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు అసోసియేషన్ చైర్మన్ జలక్ సింగ్ రాథోడ్, జాతీయ ప్రధాన కార్యదర్శి పాకాల రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్ కమలా శర్మ, జాయింట్ సెక్రెటరీ మౌన, దిల్జిత్ సింగ్, రంజిత దాస్ బృందం ఢిల్లీలోని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ని కలిసి హోంగార్డులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా హోంగార్డ్స్ ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. వారు కూడా ఈ విషయాలపై సానుకూలంగా స్పందించారని చెప్పారు. చట్టసభల్లో ప్రవేశపెట్టే మోడ్రన్ హోంగార్డు బిల్లును రూపొందించే సమయంలో నేషనల్ హోంగార్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులను ఆహ్వానించాలని కోరారు. హోంగార్డుల సమస్యలు పరిష్కారాలు, భవిష్యత్తుపై తగిన సలహాలు సూచనలు చేస్తామని తెలిపారు.

# యూపీఐపై ఛార్జీలు

- యూపీఐ పై ఛార్జీల బిల్లు ఆమోదం
- లోక్‌సభలో చర్చ లేకుండానే గ్రీన్ సిగ్నల్
- యాక్ట్-2007 సవరణలతో బ్యాంకులకూ అధికారం
- డిజిటల్ చెల్లింపులపై ఫీజుల వసూలుకు బాట
- మర్చంట్ డిస్కౌంట్ రేట్ విధానంలో మార్పులు
- స్థిరమైన ఆదాయం కల్పనే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం



**విశాలభారతి, జాతీయం:**

భారతదేశంలో ఆర్థిక రంగం వేగంగా మారుతున్న తరుణంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ సహా కొన్ని డిజిటల్ చెల్లింపు విధానాలపై ఛార్జీలు విధించే అవకాశాన్ని కల్పించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్2007లో సవరణలు చేసే ఈ బిల్లు ద్వారా బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలకు కొన్ని ఎలక్ట్రానిక్ చెల్లింపు విధానాలపై రుసుములు వసూలు చేసే అవకాశం కల్పించనున్నారు. ఇప్పటివరకు ఎలాంటి అదనపు భారం లేకుండా సాగిన లావాదేవీల తీరుతెన్నులు మారుతున్నాయి. రాబోయే రోజుల్లో డిజిటల్ సేవలను అందించే ఆర్థిక సంస్థలకు ఇది ఆర్థిక ఊతమిస్తుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. సామాన్య ప్రజలపై పడే ప్రభావం గురించి భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. దేశవ్యాప్తంగా కోట్లాది మంది వినియోగిస్తున్న ఈ సాంకేతికతపై పార్లమెంటులో ఎలాంటి సమగ్ర చర్చ జరగకుండానే ఆమోదం పొందడం గమనార్హం. ప్రజాస్వామ్య పద్ధతుల్లో చర్చలు జరగకపోవడం పట్ల విపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ఆర్థికాభివృద్ధికి డిజిటల్ మార్కెట్ కీలకమని భావిస్తున్న తరుణంలో ఈ చట్ట సవరణ ప్రాధాన్యం సంతరించుకుంది. భవిష్యత్తులో డిజిటల్ లావాదేవీల స్వరూపం పూర్తిగా మారే అవకాశం కనిపిస్తోంది. లోక్‌సభ ఆమోదించిన సవరణ బిల్లు ప్రకారం కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసే కొన్ని ఎలక్ట్రానిక్ చెల్లింపు విధానాలపై బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు ఛార్జీలు వసూలు చేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఎలక్ట్రానిక్ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ వసూలు చేయకుండా ఉన్న నిబంధనలో మార్పులు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. డిజిటల్ మార్కెట్లో బ్యాంకులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి ఈ నిబంధనల సవరణ అవసరమని అధికారులు భావిస్తున్నారు. కోట్లాది రూపాయల నిర్వహణ వ్యభారాన్ని భరించలేక బ్యాంకులు సతమతమవుతున్నాయని అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఉచిత సేవల కారణంగా మౌలిక వసతుల కల్పన భారంగా మారుతోందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం జోక్యం చేసుకుని కొత్త మార్గాలను అన్వేషిస్తోంది. చిన్న మొత్తంలో రుసుములు వసూలు చేయడం ద్వారా వ్యవస్థను బలోపేతం చేయవచ్చని వాదిస్తున్నారు. మరోవైపు చిన్న వ్యాపారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఉచిత సేవలు నిలిచిపోతే వ్యాపార లావాదేవీలపై తీవ్ర ప్రభావం పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయం వల్ల డిజిటల్ వాలెట్లు, ఇతర చెల్లింపుల మార్గాలు కూడా ప్రభావితం కావచ్చు. లావాదేవీల సంఖ్య తగ్గే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను నిర్వహిస్తున్న బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు, మౌలిక సదుపాయాల సంస్థలకు స్థిరమైన ఆదాయ మార్గాన్ని కల్పించడమే ఈ మార్పుల ఉద్దేశమని ప్రభుత్వం చెబుతోంది. వినియోగదారులు, చిన్న వ్యాపారులపై పెద్ద భారం పడకుండా చిన్న మొత్తంలో రుసుములు విధించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా డిజిటల్ లావాదేవీల సంఖ్య విపరీతంగా పెరిగింది. రిజర్వ్ బ్యాంక్ గణాంకాల ప్రకారం రోజువారీ లావాదేవీల విలువ కోట్లాది రూపాయలకు చేరుకుంది. అయితే ఈ భారీ రద్దీని తట్టుకునేందుకు టెక్నాలజీ వ్యవస్థలను మెరుగుపరచడం చాలా ముఖ్యం. సర్వర్ డౌన్ సమస్యలు, సాంకేతిక లోపాలను సరిదిద్దడానికి భారీ పెట్టుబడులు అవసరమవుతాయి. ఉచిత సేవలు కొనసాగితే ఈ పెట్టుబడులు పెట్టడం బ్యాంకింగ్ రంగం వల్ల కాదని నిపుణులు వాదిస్తున్నారు. అందుకే స్థిరమైన ఆదాయం ఉంటేనే సేవలు నిరంతరం కొనసాగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించే క్రమంలో ఈ నిర్ణయం అనివార్యమని సమర్థించుకుంటున్నారు. అయితే సామాన్యులపై ఈ భారం ఏ స్థాయిలో పడుతుందనేది అధికారిక నోటిఫికేషన్ వెలువడిన తర్వాతే స్పష్టమవుతుంది. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని పరిమితులు విధించే అవకాశం ఉంది. లోక్‌సభలో ఈ బిల్లును చర్చ లేకుండానే ఆమోదించారు. ప్రస్తుతం యూపీఐ వంటి డిజిటల్ చెల్లింపు విధానాలపై ఎలాంటి ఛార్జీలు లేవు. అయితే ప్రతిపాదిత చట్ట సవరణలతో కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా నిర్ణయించే కొన్ని ఎలక్ట్రానిక్ చెల్లింపు విధానాలపై ఛార్జీలు విధించే అవకాశం ఉంటుంది. పార్లమెంటు శీతాకాల సమావేశాలు లేదా ప్రత్యేక సందర్భాలలో ఈ బిల్లును ప్రవేశపెట్టిన తీరుపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. దేశ ఆర్థిక వ్యవస్థను శాసించే కీలకమైన చట్టాలపై తగిన చర్చ జరగకపోవడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. ప్రభుత్వం మాత్రం దేశ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. డిజిటల్ ఇండియా నినాదంతో ముందుకు వెళ్తున్న తరుణంలో ఈ మార్పులు ఎలాంటి ప్రభావం చూపుతాయనేది వేచి చూడాలి. లావాదేవీలపై రుసుములు పడితే నగదు రహిత ఆర్థిక వ్యవస్థ వైపు అడుగులు మందగిస్తాయని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆర్థిక క్రమశిక్షణ సాధించడానికి ఈ చర్య దోహదపడుతుందని మరికొందరు బలమైన వాదన వినిపిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ పార్లమెంటు ఆమోదం పొందిన ఈ బిల్లు త్వరలోనే చట్టరూపం దాల్చనుంది. రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శకాలకు అనుగుణంగా తదుపరి విధివిధానాలు ఖరారవుతాయి. దేశ ఆర్థికాభివృద్ధిలో డిజిటల్ చెల్లింపుల పాత్ర అపారమైనది. కోవిడ్ అనంతర కాలంలో చిన్న దుకాణాల నుంచి పెద్ద షాపింగ్ మాల్స్ వరకు అందరూ ఆన్‌లైన్ పేమెంట్స్‌నే ఆశ్రయిస్తున్నారు. చిరు వ్యాపారులు సైతం క్యూఆర్ కోడ్ల ద్వారా చిల్లర సమస్య లేకుండా వ్యాపారం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో యూపీఐ సేవలు పూర్తిగా ఉచితంగా లభించడం వల్ల ప్రజలు ఎక్కువగా ఆకర్షితులయ్యారు. ఇప్పుడు ఈ వ్యవస్థపై ఛార్జీల భారం పడితే ఆదరణ కొంత తగ్గవచ్చు. బ్యాంకింగ్ రంగం లాభాల ఆర్జన వైపు అడుగులు వేస్తున్నదనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ప్రజలకు చేరువైన సాంకేతికతపై రుసుములు విధించడం సముచితం కాదని వినియోగదారుల సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. డిజిటల్ చెల్లింపుల వృద్ధికి ఆటంకం కలగకుండా తగిన రాయితీలు ఇవ్వాలని కోరుతున్నారు. బ్యాంకులు కూడా సామాజిక బాధ్యతగా కొన్ని సేవలను ఉచితంగా కొనసాగించాలని సూచిస్తున్నారు. లేనిపక్షంలో మారుమూల ప్రాంతాలలో డిజిటల్ లావాదేవీలు నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వం విడుదల చేయబోయే మార్గదర్శకాలు ఈ అనుమానాలన్నింటికీ సమాధానం ఇస్తాయి. భారతదేశం డిజిటల్ రంగంలో ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నది. ఈ కీర్తిని కాపాడుకోవడానికి ప్రభుత్వాలు, బ్యాంకింగ్ సంస్థలు సమన్వయంతో పనిచేయాలి. కేవలం లాభాపేక్షతో కాకుండా దేశ ఆర్థిక పురోగతిని దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలి. చిన్న మొత్తంలో ఛార్జీలు విధించినప్పటికీ అది సామాన్యులకు భారంగా మారకూడదు. తద్వారా డిజిటల్ లావాదేవీల సంఖ్య తగ్గకుండా జాగ్రత్త పడవచ్చు. రిజర్వ్ బ్యాంక్ పర్యవేక్షణలో ఈ నిబంధనలు పకడ్బందీగా అమలయ్యేలా చూడాలి. ఎలక్ట్రానిక్ చెల్లింపుల వ్యవస్థ భద్రతను మరింత పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మోసాలు జరగకుండా కఠినమైన నిబంధనలు అమలు చేయాలి. వినియోగదారులకు నమ్మకం కలిగించినప్పుడే డిజిటల్ ఆర్థిక వ్యవస్థ నిలదొక్కుకుంటుంది. పార్లమెంటులో ఆమోదం పొందిన ఈ బిల్లు అమలులోకి వచ్చిన తర్వాత ఎదురయ్యే సవాళ్లను ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షించాలి. ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటూ అవసరమైన సవరణలు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరపడటానికి ఈ సంస్కరణలు ఎంతవరకు ఉపయోగపడతాయో కాలమే నిర్ణయించాలి.

## ఎమ్మెల్యే ఇంట్లో లవ్ బాంబు

**మొదటిపేజీ తరువాయి**



ఒక చిన్న కుటుంబ వ్యవహారంగా ఏమాత్రం మిగిలిపోకుండా, రాజకీయ రంగు పులుముకుని పెద్ద వివాదంగా మారింది. అధికార బలం ముందు తన ప్రేమను గెలిపించుకోవడానికి కొడుకు పడుతున్న తపన, సొంత తండ్రిపైనే చేసిన ఘాటైన ఆరోపణలు, తీవ్ర వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో నిత్యం విస్తృతంగా ప్రచారం పొందుతూ ప్రజల్లో ఆసక్తిని పెంచుతున్నాయని స్పష్టమవుతోంది. నిజమే. తమ ప్రేమ వివాహానికి సొంత తండ్రి అంగీకరించకపోవడమే కాకుండా, ఆస్తి వివాదాలు, అంతర్గత కక్షలను దీనికి ముడిపెడుతూ రౌడీలతో దాడులకు తెగబడుతున్నారని సంతోష్ గౌడ్ తీవ్రంగా ఆరోపిస్తున్నారు. మణికొండలోని ఉన్న తన ప్రియురాలి నివాసంపై కొంతమంది ఆకతాయిలు దాడికి దిగారని, ఆ సమయంలో ప్రాణభయంతో అత్యవసర డయల్ 100 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసినప్పటికీ రక్షణ దొరకలేదని ఆయన వాపోయారు. పోలీసులు అధికార ఒత్తిళ్లకు లొంగిపోయి తమ సమస్యను పట్టించుకోకపోవడంతో విధిలేక ప్రాణాలను పణంగా పెట్టి మీడియా ముందుకు వచ్చి నిజాలను బయటపెట్టాల్సి వచ్చిందని సంతోష్ వివరించారు. తమను ముందస్తు కుట్రతో తప్పుడు కేసుల్లో అనవసరంగా ఇరికించి జైలుకు పంపాలని చూస్తున్నారని సంతోష్ ప్రియురాలు రూపా రెడ్డి కూడా మీడియా ముందు తీవ్ర ఆవేదన వ్యక్తం చేయడం ఈ విచిత్ర కథనంలో మరొక పెద్ద మలుపుగా మారింది. రక్షణ కల్పించాల్సిన అధికారులే ఉపేక్షించడం వల్లనే తాము రోడ్డుపైకి రావాల్సి వచ్చిందని వారు ఇద్దరూ మీడియాకు స్పష్టంగా తెలియజేశారు. ఇది విచారకరమైన విషయం అని వారు పేర్కొన్నారు. కొడుకు చేసిన సంచలన ఆరోపణలపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అత్యంత కఠినంగా స్పందించడం గమనార్హం. పాత సినిమాల్లో కనిపించే కఠినమైన తండ్రి పాత్రలాగా, వాడు ఎవడో నాకు తెలియదు, వాడితో నాకు ఎలాంటి సంబంధం లేదని చెబుతూ విషయాన్ని సింపుల్‌గా కొట్టిపారేశారు. సరైన సమయం వచ్చినప్పుడు ఈ అంశంపై పూర్తిస్థాయిలో మాట్లాడుతానని వ్యాఖ్యానించి ప్రస్తుతానికి ఆ అధ్యాయాన్ని ముగించారు. ప్రజాప్రతినిధిగా ఉన్న నాయకుడు తన సొంత రక్తాన్నే పరాయివాడిగా జమకట్టడం స్థానిక ప్రజల్లో తీవ్ర ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. తండ్రి నుంచి వచ్చిన ఈ సమాధానం లవ్ స్టోరీలోని తీవ్రతను తగ్గించకపోగా మరింత పెంచిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మీడియా ప్రశ్నలకు ఆయన ఇచ్చిన జవాబు అనేక అనుమానాలకు తావిస్తోంది. సమస్యను దాటవేసే ప్రయత్నం జరుగుతోందని పలువురు అనుకుంటున్నారు. కుటుంబ విషయాలను రచ్చకెక్కించడం తగదని అభిమానులు భావిస్తున్నారు. నాయకుడి ప్రతిష్టకు భంగం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు. ఈ పరిణామం రాబోయే రోజుల్లో ఎలాంటి మలుపులు తిరుగుతుందోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రాజకీయం ఎటు దారితీస్తుందో చూడాలని అనుకుంటున్నారు. ఒకవైపు ప్రాణభయంతో రోడ్డెక్కిన కుమారుడి పరిస్థితి, మరొకవైపు నాకు తెలియదు అంటూ సీన్‌లోకి రాకుండానే సులువుగా దాటవేసిన ఎమ్మెల్యే తండ్రి వైఖరి ఈ కథనాన్ని హైలైట్ చేస్తున్నాయి. ప్రేమించిన మనిషి కోసం తండ్రి రాజకీయ పవర్‌నే నెగ్గుకొచ్చేలా ఢీకొట్టిన కొడుకు, సొంత కొడుకునే పరాయివాడిగా ముద్రవేసిన ప్రజా నాయకుడు.. వీరిద్దరి మధ్య జరుగుతున్న ఈ నిజమైన లవ్, పొలిటికల్ డ్రామా ఏ క్లైమాక్స్ వైపు వెళ్తుందోనన్న ఆసక్తి సర్వత్రా వ్యక్తమవుతోంది. సాధారణంగా సినిమాల్లో మాత్రమే కనిపించే ఇలాంటి దృశ్యాలు నిజ జీవితంలో, అదీ ఒక ప్రముఖ నాయకుడి ఇంట్లో జరగడం అందరినీ ఆకర్షిస్తోంది. అధికార యంత్రాంగం కూడా ఈ విషయంలో ఎలా వ్యవహరిస్తుందో చూడాలి. బాధితులకు న్యాయం జరుగుతుందో లేదో వేచి చూడాల్సి ఉంది. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఈ ఉదంతం ప్రధాన అంశంగా మారిపోయింది. ప్రతీ ఒకరూ దీనిపైనే మాట్లాడుకుంటున్నారు. శాంతిభద్రతల సమస్యగా మారకుండా చూడాలని కోరుతున్నారు. ఇరువర్గాల వాదనలు ఎలా ఉన్నప్పటికీ నిజాన్ని నిలదీయడం అవసరమని చెబుతున్నారు. ఈ వ్యవహారం ముగింపుకు చేరాల్సి ఉంది అని భావిస్తున్నారు. అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు కుటుంబ కలహాలను సకాలంలో పరిష్కరించుకోకపోతే అవి సామాజిక సమస్యలుగా మారే ప్రమాదం ఉందనడానికి ఈ సంఘటనే ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తోంది. ప్రేమ, బంధాలు, ఆస్తుల పంపిణీ వంటి వ్యక్తిగత విషయాలు రచ్చకెక్కినప్పుడు చట్టం తన పని తాను చేసుకుపోవాల్సి ఉంటుంది.

## రాష్ట్రంలో ఢిల్లీ గులాంగిరి పాలన



**మొదటిపేజీ తరువాయి**

రాజకీయ నాయకత్వం తెలంగాణకు శ్రీరామరక్ష అని స్పష్టం చేశారు. స్వయం పాలన సాధించుకున్న రాష్ట్రాన్ని మళ్లీ పరాయి పాలకులు శాసించే పరిస్థితి తెచ్చారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని ఢిల్లీ సామంత రాజ్యంగా మార్చారని కేటీఆర్ తీవ్రంగా వ్యాఖ్యానిస్తూ గట్టిగా నిలదీసి చెప్పారు. ఢిల్లీకి ఎప్పుడూ సామంతులుగా ఉండొద్దని స్వతంత్రులుగానే మనగడ సాగించాలని జయశంకర్ సార్ చెప్పిన మాటలను కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ సమస్యలపై కేసీఆర్ లాగా గొంతు విప్పితే సింహంలా గర్జించాలని ఆనాడు జయశంకర్ సూచించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీతో ఎప్పటికీ కలవకూడదని, స్థానిక నాయకుడు ఉన్నప్పుడే ప్రాంతీయ ప్రయోజనాలు నెరవేరుతాయని ఆయన ఆకాంక్షించారని వివరించారు. ఢిల్లీ నాయకులు చెప్పినట్లు తలాడిస్తే రాష్ట్రానికి ఏమాత్రం మేలు జరగదని హెచ్చరించారని పేర్కొన్నారు. యాచించి కాకుండా శాసించి తెలంగాణ సాధించుకోవాలని జయశంకర్ బోధించారని చెప్పారు. తమ పార్టీకి ఆచార్య జయశంకర్ మార్గదర్శక గురువు అయితే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాత్రం పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసలైన గురువు అని కేటీఆర్ తీవ్రమైన చురకలు అంటించారు. కనీసం నోరారా జై తెలంగాణ అని ఉచ్చరించడానికి కూడా ఈ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మనసొప్పడం లేదని ఎద్దేవా చేశారు. ఇటువంటి దౌర్భాగ్యకరమైన పరిస్థితిలో తెలంగాణ ఉండడం బాధాకరమని కేటీఆర్ తన ఆవేదనను వ్యక్తం చేస్తూ వ్యాఖ్యానించడం విశేషంగా నిలిచిపోయింది. రాష్ట్రం నుండి లభించే నిధులను మొత్తం ఢిల్లీ పెద్దలకు అప్పగించి ముఖ్యమంత్రి తిరిగి వస్తున్నారని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. డెబ్బై ఐదు సార్లు ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రానికి సాధించి తెచ్చిందేమిటో ప్రజలకు వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో ప్రస్తుతం బీఆర్ఎస్ ఎంపీల ప్రాతినిధ్యం లేకపోవడం వల్లనే రాష్ట్ర ప్రధాన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని స్పష్టం చేశారు. మరోవైపు రాష్ట్ర □ప్పులపై కాంగ్రెస్ నాయకులు ప్రజలకు పూర్తిగా తప్పుడు లెక్కలు చెబుతున్నారని మండిపడ్డారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదికలు స్పష్టంగా నిజాలు వెల్లడించినా ఈ ప్రభుత్వ పాలకులకు చెవికెక్కడం లేదని విమర్శించారు. ఇటువంటి అబద్ధాలు చెప్పే పాలకులకు ఆచార్య జయశంకర్ సార్ మళ్లీ తిరిగివచ్చి ప్రత్యేకంగా ట్యూషన్ పాఠాలు చెప్తే బాగుంటుందని కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఇక్కడ ఉన్న అజ్ఞాన పాలకులకు సరైన దిశానిర్దేశం చేయడానికి జయశంకర్ లాంటి గొప్ప మేధావుల అవసరం ఎంతైనా ఉందని కేటీఆర్ ఈ సందర్భంగా విలేకరులకు స్పష్టంగా వివరించి నిలదీసి చెప్పారు. జీవితంలో ఎప్పుడూ జై తెలంగాణ అనని జైపాల్ రెడ్డి, కేశవరావులను గొప్ప మేధావులుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పొగుడుతున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. మరి నీ పక్కనే నిలబడిన కోదండరాం పేరును ఎందుకు చెప్పడం లేదని నిలదీశారు. తెలంగాణ ఆర్థికంగా మిగులు రాష్ట్రమని ప్రముఖ ఆర్థికవేత్త బీపీఆర్ విఠల్ 1969, 2001 అధ్యయన నివేదికల్లో చాలా స్పష్టంగా రాశారని కేటీఆర్ గుర్తుచేశారు. మనది నీళ్లు, నిధులు పుష్కలంగా ఉన్న స్వయంసమృద్ధిగల రాష్ట్రమని వ్యాఖ్యానించారు. రిజర్వాయర్లలో పుష్కలంగా నీటి వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రస్తుత ముఖ్యమంత్రి కనీసం పంపులు ఆన్ చేయడం లేదని తీవ్ర విమర్శలు గుప్పించారు. పాలన చేతకాక సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. రైతాంగానికి సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో ఉన్న వనరులను సరిగ్గా వాడుకోకుండా రైతులను నడిసముద్రంలో ముంచేస్తున్నారని తీవ్రంగా ధ్వజమెత్తారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి కేవలం రాజకీయం చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని స్పష్టంగా కుండబద్దలు కొట్టి చెప్పారు. ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువత నిరంతరం పోరాటాలు చేస్తుంటే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని దుయ్యబట్టారు. తమ మాట ప్రకారం ఉద్యోగ నియామకాలు ఎందుకివ్వడం లేదో సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశమంతా వదిలించుకున్న దరిద్రం కాంగ్రెస్ అని, తెలంగాణకు శాశ్వత శత్రువు కాంగ్రెసే అని ఆచార్య జయశంకర్ చెప్పిన మాటలను గుర్తుచేశారు. దాదాపు మూడు తరాలను ముంచిన చరిత్ర కాంగ్రెస్‌దని స్పష్టం చేశారు. జయశంకర్ ఆశయ సాధన కోసం తెలంగాణను మళ్లీ కేసీఆర్ చేతిలో పెట్టడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వరాష్ట్ర అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను తిప్పికొట్టి భవిష్యత్తును బంగారం చేసుకోవాలని హితవు పలికారు. జయశంకర్ కలలను నిజం చేయడానికి పోరాటం ఆపకూడదని స్పష్టంగా చెప్పారు.

## జయశంకర్ ఆశయాలకు జేజేలు

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి :** తెలంగాణ సిద్ధాంతకర్త, మేధావి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి వేడుకలను మన ఆలోచన సాధన సమితి ఆధ్వర్యంలో హయత్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగరావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. ఆయన ఆశయాలు, ఆలోచనలు ప్రతి విద్యార్థికి స్ఫూర్తిగా నిలవాలని, తెలంగాణ అభివృద్ధిలో యువత చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. జయశంకర్ చూపిన మార్గంలో నడవడం ద్వారా సమాజాభివృద్ధికి తోడ్పాటు అందించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి ప్రొఫెసర్ జయశంకర్ అందించిన మేధోబలం, ఆయన చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన వెనుక ఆయన చేసిన కృషిని ప్రతి విద్యార్థి తెలుసుకొని, ఆయన ఆశయ సాధనకు కట్టుబడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఐఏఎస్, మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ వియన్ విష్ణు, జాతీయ బీసీ సంఘం మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, ప్రధాన ఉపన్యాసకులు ప్రొఫెసర్ వద్దానం శ్రీనివాసరావు, తెలంగాణ ఉద్యోగ సంఘం మాజీ అధ్యక్షులు పద్మాచారి, తెలంగాణ లెక్చరర్స్ ఫోరం అధ్యక్షులు రామకృష్ణ యాదవ్, ప్రముఖ రచయిత్రి దానోజు లలిత, ప్రముఖ హైకోర్టు న్యాయవాది రవిశంకర్ నేత, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలచారి, ప్రముఖ న్యాయవాది ప్రభాకరాచారి, ప్రముఖ సామాజికవేత్త రవిచంద్రచారి, రిజర్వేషన్ సమితి నాయకులు గోపి రజక, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్, మిషన్ భగీరథ అడ్వైజర్ మనోహర్ బాబు పాల్గొన్నారు. అనంతరం ఆలోచన సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చిన బోయిన శ్రీనివాస్ యాదవ్, కార్యదర్శులు నిమ్మల సత్యం, గుణగంటి చంద్రశేఖర్ గౌడ్, అధికార ప్రతినిధి మంగలిపల్లి శంకర్, ప్రచార కార్యదర్శులు పెద్దపూరే బ్రహ్మయ్య, కంపోజ్ నరహరిచారి, దువ్వల శ్రీకాంత్, ఆర్గనైజేషన్ సెక్రటరీ పూస రవి, కార్యదర్శులు శ్రీగారి కృష్ణయ్య, మారగోని సత్యనారాయణ గౌడ్, సామ పుదిరాజు ముదిరాజ్, జాయింట్ సెక్రటరీ మారోజు చారి, కార్యవర్గ సభ్యులు దుధిగామ వీరన్న, బంగారుగడ్డం దశరథ్, పిడికిలి రాజు, కేవీ గౌడ్, బొమ్మ రఘురాం నేత తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, మేధావులు, కవులు, కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళులర్పించారు.

## సింగరేణికి చేరిన నైనీ బొగ్గు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర ఇంధన అవసరాలను పూర్తిగా తీర్చే దిశగా సింగరేణి చరిత్రలో అత్యంత అద్భుతమైన చారిత్రాత్మక ఘట్టం అధికారికంగా ఆవిష్కృతమైంది. ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ ప్రజా ప్రభుత్వం రాకతో పాలకుల చిత్తశుద్ధితో విజయవంతంగా కార్యరూపం దాల్చిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంతోషంగా పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న అన్ని శాఖల అధికారులకు డిప్యూటీ సీఎం మనసారా శుభాకాంక్షలు తెలియజేశారు. సింగరేణి చరిత్రలో మరో మైలురాయిగా నిలిచిన నైనీ గని నుంచి తొలి బొగ్గు రైల్వే వ్యాగన్ రాకతో రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ రంగానికి కొత్త ఊపు వచ్చింది. తెలంగాణ రాష్ట్ర ప్రజల నిరంతర విద్యుత్ అవసరాలను తీర్చడమే ముఖ్య లక్ష్యంగా ఒడిశా నుంచి నేరుగా తెలంగాణలోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి తొలి బొగ్గు రైలు ఇవాళ విజయవంతంగా చేరుకుంది. సుమారు వెయ్యి నూట ముప్పై ఒక కిలోమీటర్ల సుదీర్ఘ ప్రయాణంతో సింగరేణి సంస్థకు ఈ తొలి రేకు రావడం విశేషం. ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు గని నుంచి తెలంగాణలోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గు తరలింపు ఒక అత్యంత చారిత్రక అవసరంగా మారింది. రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి రంగంలో అత్యంత కీలకమైన ఈ థర్మల్ కేంద్రానికి నాణ్యమైన బొగ్గును అందించేందుకు తొలి రైలు రేకు ఏకంగా వెయ్యి నూట ముప్పై ఒక కిలోమీటర్లు ప్రయాణించింది. యాభై తొమ్మిది బాక్స్ వ్యాగన్ల ద్వారా నాలుగు వేల టన్నుల అత్యుత్తమ జీ పది గ్రేడ్ బొగ్గు విజయవంతంగా తెలంగాణ గడ్డపైకి చేరుకుంది. నైనీ బ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కావడం వెనుక రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అలాగే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కల కృషి అత్యంత కీలకంగా మారిందని సింగరేణి యాజమాన్యం ప్రత్యేకంగా పేర్కొంది. ఈ ప్రాజెక్టు అనుమతుల సాధనలో గతంలో ఎదురైన ఎన్నో క్లిష్టమైన అడ్డంకులను పటాపంచలు చేస్తూ ప్రజా ప్రభుత్వం ఈ అరుదైన విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ గని రాష్ట్ర విద్యుత్ రంగానికి రాబోయే అనేక దశాబ్దాల పాటు భవిష్యత్తులో ప్రధాన వెన్నెముకలా నిలవనుంది. ఈ ప్రతిష్టాత్మక అనుమతుల సాధన కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్వయంగా రెండుసార్లు ఒడిశా రాష్ట్రానికి అధికారిక పర్యటనకు వెళ్లారు. రెండు వేల ఇరవై నాలుగు జులై నెలలో తొలిసారిగా ఒడిశా వెళ్లిన ఆయన అక్కడి ముఖ్యమంత్రి అలాగే ఉన్నతాధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలతో సానుకూల వాతావరణంలో చర్చలు జరిపారు. ఈ ప్రాజెక్టు యొక్క చారిత్రక ఆవశ్యకతను అందరికీ స్పష్టంగా వివరించి ఒప్పించారు. అనుమతుల ప్రక్రియలో అడ్డంకులన్నీ పూర్తిగా తొలగిపోవడంతో రెండు వేల ఇరవై ఐదు ఏప్రిల్ పదహారవ తేదీన నైనీ గనిలో బొగ్గు ఉత్పత్తిని వర్చువల్ విధానంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్వయంగా ప్రారంభించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చొరవతో ఇవాళ నైనీ గని నుంచి తొలి బొగ్గు రేకు సింగరేణి థర్మల్ కేంద్రానికి చేరుకుని రాష్ట్ర ఇంధన రంగానికి సరికొత్త కళను తీసుకొచ్చింది. కేంద్ర బొగ్గు శాఖ రెండు వేల పదిహేనవ సంవత్సరం ఆగస్టు పదమూడవ తేదీన సింగరేణి సంస్థకు నైనీ బొగ్గు బ్లాక్‌ను అధికారికంగా కేటాయించింది. ఈ బొగ్గు గని సుమారు మూడు వందల నలభై పాయింట్ డెబ్బై ఎనిమిది మిలియన్ టన్నుల భారీ బొగ్గు నిల్వల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఏడాదికి కోటి టన్నులు అంటే సరిగ్గా పది మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ గని సుమారు ముప్పై ఆరు సంవత్సరాల పాటు సుదీర్ఘ జీవితకాలం కలిగి ఉంటుంది. సింగరేణి సంస్థ తన సొంత ఉత్పత్తిని పెంచుకోవడంతో పాటు అనేక రకాల కొత్త బ్లాకులను తెచ్చుకోవడం కోసం చేస్తున్న ప్రయత్నానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా పూర్తి సహాయం చేస్తోంది. ప్రపంచంలోనే అత్యంత అతి పెద్ద మైనింగ్ సంస్థలుగా భవిష్యత్తులో ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా ఆశిస్తోంది. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి తొలి బొగ్గు రైలు ఇవాళ విజయవంతంగా చేరుకున్న సందర్భంగా సింగరేణి కార్మికులకు యాజమాన్యానికి డిప్యూటీ సీఎం ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. కార్మికుల కష్టాధ్యులతోనే ఈ మహత్తర విజయం సాధ్యమైందని ఆయన కొనియాడారు. నైనీ బొగ్గు బ్లాక్ ద్వారా లభించే నాణ్యమైన బొగ్గు రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల పనితీరును మరింత మెరుగుపరుస్తుంది. భవిష్యత్తులో విద్యుత్ కోతల సమస్య లేకుండా నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఈ ప్రాజెక్ట్ ఎంతగానో ఉపయోగపడుతుంది. సింగరేణి సంస్థ గత దశాబ్ద కాలంలో సాధించిన ప్రగతిలో ఈ నైనీ గని ప్రారంభం ఒక మైలురాయిగా చరిత్రలో నిలిచిపోతుంది. ప్రభుత్వ చొరవ కార్మికుల సమన్వయం వల్లనే ఇటువంటి పెద్ద ప్రాజెక్టులు సాధ్యమవుతాయని నిరూపితమైంది. ఒడిశా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈ బొగ్గు రవాణా సులభతరమైంది. భవిష్యత్తులో రవాణా ఖర్చులు తగ్గి విద్యుత్ ఉత్పత్తి మరింత లాభసాటిగా మారుతుంది. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి ఇంధన రంగం బలం చేకూరుస్తుంది. సింగరేణి ఉద్యోగులు ఉత్సాహంతో పని చేసేలా యాజమాన్యం ప్రోత్సహిస్తోంది. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక రంగానికి తక్కువ ధరకే నిరంతరం విద్యుత్ అందించేలా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. నైనీ గని ప్రారంభోత్సవం సందర్భంగా కార్మిక కుటుంబాలలో పండుగ వాతావరణం నెలకొంది. సింగరేణి సంస్థ భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలకు ఈ ప్రాజెక్ట్ ఒక బలమైన పునాదిగా నిలుస్తుంది. దేశంలోనే ప్రముఖ బొగ్గు ఉత్పత్తి సంస్థగా సింగరేణి తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటోంది. పర్యావరణ నిబంధనలను పాటిస్తూ బొగ్గు ఉత్పత్తిని కొనసాగించడమే లక్ష్యంగా యాజమాన్యం చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ పెద్దల దూరదృష్టి కారణంగానే ఈ చారిత్రాత్మక విజయం సాకారమైంది. రాబోయే కాలంలో తెలంగాణ రాష్ట్రం విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధి సాధించడంలో ఈ గని కీలక పాత్ర పోషిస్తుంది. సింగరేణి కీర్తి ప్రతిష్టలు దేశ వ్యాప్తంగా మరింత ఇనుమడించాయి.



# పాల్వంచలో వివాహితపై లైంగిక వేధింపుల ఆరోపణలు

**పోలీసులకు బాధితురాలి విజ్ఞప్తి**

**పాల్వంచ విశాల భారతి:** పాల్వంచ కు చెందిన ఓ వివాహిత మహిళ, బీఆర్ఎస్ పార్టీ నాయకుడిగా పేర్కొన్న బొమ్మిడి రమాకాంత్ తనను తీవ్రంగా లైంగికంగా వేధించాడని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు మీడియా వేదికగా తన ఆవేదనను వ్యక్తం చేస్తూ నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితురాలి కథనం ప్రకారం, బొమ్మిడి రమాకాంత్ తమ షాపుకు తరచూ వచ్చి పరిచయం పెంచుకున్నాడని, ఆ పరిచయాన్ని దుర్వినియోగం చేస్తూ తన పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఆరోపించారు. అవసర నిమిత్తం సాయి అనే వ్యక్తి ద్వారా రూ.60 వేల అప్పు ఇప్పించి, తన వద్ద నుంచి ఖాళీ చెక్, ప్రామిసరీ నోట్ తీసుకున్నారని తెలిపారు. ఒప్పంద గడువు ముగియకముందే తన చెక్కును ఉద్దేశపూర్వకంగా బౌన్స్ అయ్యేలా చేసి, అనంతరం చెక్ బౌన్స్ కేసు పేరుతో బెదిరిస్తూ తనతో శారీరక సంబంధం పెట్టుకోవాలని పలుమార్లు ఒత్తిడి చేశాడని ఆరోపించారు. తాను అందుకు నిరాకరించడంతో ఖాళీ చెక్‌పై రూ.8.50 లక్షలు నమోదు చేసి బెదిరించాడని పేర్కొన్నారు. అంతేకాకుండా, తనకు నగ్నంగా వీడియో కాల్స్ చేస్తూ అసభ్యకరంగా ప్రవర్తించాడని, తన వ్యక్తిగత ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తానని బెదిరించాడని బాధితురాలు ఆరోపించారు. ఈ సంఘటనలతో తీవ్ర మానసిక వేదనకు గురయ్యానని తెలిపారు. ఈ వ్యవహారంపై జూలై 25, 2026న పాల్వంచ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయగా, పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని చెప్పారు. అయితే, ఎఫ్ఐఆర్ నమోదైన తర్వాత కూడా నిందితుడు తనపై కేసులు పెడతానని, రాజకీయ పలుకుబడి ఉందంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆమె ఆరోపించారు. నిందితుడి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని ఫోరెన్సిక్ విచారణ జరిపితే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని బాధితురాలు అభిప్రాయపడ్డారు. అలాగే, గతంలో కూడా ఇతర మహిళల పట్ల ఇలాంటి ఆరోపణలు ఉన్నాయని, సమగ్ర విచారణ చేపడితే మరిన్ని బాధితులు బయటకు వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేసిన బాధితురాలు, నిందితుడిని అదుపులోకి తీసుకుని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, కేసు దర్యాప్తును నిష్పాక్షికంగా నిర్వహించాలని పోలీసులను మీడియా ద్వారా కోరారు.

# నిరుద్యోగ యువతకు బంగారు అవకాశం






**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, యువ నాయకుడు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సిహెచ్ భాస్కర్ చారి తెలిపారు.ఈ కార్యక్రమానికి సంబంధించిన దరఖాస్తులను ఆగస్టు 9వ తేదీ నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు మాత్రమే స్వీకరించనున్నట్లు ఆయన వెల్లడించారు. అలాగే ఆగస్టు 10వ తేదీ నుంచి ఇబ్రహీంపట్నం ప్రజా భవన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

**యువత భవిష్యత్తుకు భరోసా కల్పించే కార్యక్రమం**

ఉపాధి కోసం ఎదురుచూస్తున్న యువతీ యువకులకు నైపుణ్య శిక్షణ అందించి, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరిచే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు భాస్కర్ చారి తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకునేలా అవసరమైన శిక్షణను అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

**అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని అర్హులైన యువతీ యువకులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా తమ దరఖాస్తులను సమర్పించాలని ఆయన కోరారు. గడువు ముగిసిన తర్వాత దరఖాస్తులు స్వీకరించే అవకాశం ఉండదని, అందువల్ల ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**యువత అభివృద్ధే లక్ష్యం**

ప్రజా సంక్షేమంతో పాటు యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, యువ నాయకుడు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి నిరంతరం వినూత్న కార్యక్రమాలను చేపడుతున్నారని భాస్కర్ చారి తెలిపారు. ఈ ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమం ద్వారా అనేక మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ ఈ సువర్ణావకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఆగస్టు 15న కొత్త రేషన్ కార్డులు

**మొదటిపేజీ తరువాయి**

శరవేగంగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలందించడమే ముఖ్యమైన లక్ష్యమని తెలియజేయడం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఆగస్టు 15న సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి పీడీఎస్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుడతారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమాలు మొదలవుతాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని అర్హులైన ప్రజలకు కార్డులు అందజేస్తారు. ఈ బృహత్తర కార్యక్రమం విజయవంతం కావడానికి వీలుగా విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అన్ని నియోజకవర్గాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేస్తున్నారు. పారదర్శకంగా పంపిణీ పూర్తి చేయడానికి సర్వం సిద్ధం చేస్తున్నారు. మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించి పంపిణీ వ్యవస్థను అనుక్షణం పర్యవేక్షించేలా చర్యలు చేపట్టడం కూడా జరుగుతోందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.05 కోట్ల పేద కుటుంబాలకు లామినేటెడ్ రూపంలో తయారు చేసిన నూతన రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నారు. ఈ కొత్త కార్డులు పివిసి రూపంలో అత్యంత నాణ్యతతో రూపుదిద్దుకున్నాయి. వీటిని వాటర్‌ప్రూఫ్‌గా రూపొందించడం వల్ల నీటిలో తడిసినా పాడవకుండా ఉండే అవకాశం ఉంటుంది. డెబిట్, క్రెడిట్ కార్డుల పరిమాణంలో అత్యంత ఆకర్షణీయమైన డిజైన్‌తో రూపొందించిన ఈ స్మార్ట్ రేషన్ కార్డులు పట్టుకోవడానికి చాలా సౌకర్యవంతంగా ఉంటాయి. ప్రతి కార్డుపై క్యూఆర్ కోడ్‌తో పాటు అనేక ఆధునిక భద్రతా ప్రమాణాలను పొందుపరిచారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రూపొందించిన ఈ కార్డులు నకిలీలను అరికట్టడానికి ఉపయోగపడతాయి. ప్రజలు తమ వద్ద




భద్రంగా ఉంచుకోవడానికి అనువుగా వీటిని డిజైన్ చేయడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. ఆధునిక కాలానికి తగినట్లుగా రేషన్ కార్డుల రూపురేఖలను ప్రభుత్వం మార్చివేసింది. కార్డులో ఉన్న సమాచారాన్ని స్కాన్ చేసి సులభంగా తెలుసుకునే వెసులుబాటును కూడా కల్పించడంతో ధాన్య పంపిణీ వ్యవస్థ సమర్థవంతంగా సాగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారని అధికారులు స్పష్టంగా వివరాలు వెల్లడించారు. పేదల ఆహార భద్రతే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ఒక చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకుందని మంత్రి పౌరసరఫరాల వేదికగా తెలిపారు. అర్హత కలిగిన ప్రతీ పేద కుటుంబానికి రేషన్ కార్డు అందించి తీరుతామని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో ఏ ఒక్క పేదవాడు కూడా ఆకలితో అలమటించకూడదనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని ప్రకటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందరికీ నేరుగా చేరడానికి రేషన్ కార్డు ఎంతో కీలకమైన ఆధారంగా నిలుస్తుంది. గత కొన్ని సంవత్సరాలుగా నూతన కార్డులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేలాది మంది అర్హులకు ఈ పంపిణీ ద్వారా ఊరట లభించనుంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నాణ్యమైన బియ్యం, సరుకులు నిరంతరం సరఫరా చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. ఈ నిర్ణయం పేదల జీవితాల్లో ఎంతో సంతోషాన్ని నింపుతుందని ఆశిస్తున్నారు. ఆహార ధాన్యాల పంపిణీ విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా నిఘా వ్యవస్థను కూడా గట్టిగా బలోపేతం చేయడం జరుగుతోందని అధికారులు స్పష్టంగా వెల్లడించారు. నూతన రేషన్ కార్డుల పంపిణీకి సంబంధించిన అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు ఇప్పటికే చివరి దశకు చేరుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాల పరిధిలో తగిన సంఖ్యలో కౌంటర్లు ఏర్పాటు చేసి, సుమారు 1.05 కోట్ల కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రతి గ్రామంలో, పట్టణంలో పంపిణీ సజావుగా సాగేందుకు ప్రత్యేక అధికారుల బృందాలు నిరంతరం శ్రమిస్తున్నాయి. ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి మొదలయ్యే ఈ పంపిణీ మహోత్సవం ప్రజా సంక్షేమ దిశగా వేసిన మరో అడుగు అని ప్రజలు కొనియాడుతున్నారు. భవిష్యత్తులో కూడా ఇదే తరహాలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు చెబుతున్నారు. ఈ పీవీసీ కార్డులు పేదల చేతుల్లోకి చేరడం వల్ల వారందరికీ ఆహార భద్రతతో పాటు సామాజిక రక్షణ పూర్తి స్థాయిలో లభిస్తుంది. ఈ చారిత్రాత్మక ఘట్టం విజయవంతం కావడానికి ప్రజలందరూ సహకరించాలని, పంపిణీ కేంద్రాల వద్ద క్రమశిక్షణ పాటించాలని ప్రభుత్వ వర్గాలు ప్రజలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేయడం ఇక్కడ గమనార్హమైన అంశం.

# ర్యాంకులపై అసత్య ప్రచారం చేస్తున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

- **గడ్డిఅన్నారంలోని ఐఏసీఈ కోచింగ్ సెంటర్**
- **ఎదుట ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల ఆందోళన**
- **సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు**



**ఎల్బీనగర్, విశాల భారతి :** ఫేక్ ర్యాంక్ లు ప్రచురించి,అధిక ఫీజులు వసూలు చేస్తున్న ఐఏసీఈ(IACE) కోచింగ్ ఇనిస్టిట్యూట్ పై చర్యలు తీసుకోవాలని ఓయూ ఐక్య విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు గురువారం గడ్డిఅన్నారం డివిజన్ లోని చైతన్యపురి మెయిన్ రోడ్డుపై ఉన్న ఐఏసీఈ కోచింగ్ సెంటర్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల కన్వీనర్ నోముల శేషు, బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మరబోయిన సైదులు తదితరులు మాట్లాడారు. ఆర్ఆర్ బీలో ఏఎల్ పీ జాబ్స్, కాంపిటీషన్ పరీక్షల్లో టాప్ ర్యాంకులు సాధించిన ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు చైతన్యపురిలోని ఐఏసీఈ కోచింగ్ ఇనిస్టిట్యూట్ లో చదివినట్లు ప్రచురించుకుని, విద్యార్థి, నిరుద్యోగులను మోసం చేసి అత్యధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. ఫేక్ ప్రకటనలు చేసి, మోసపూరితంగా విద్యార్థుల వద్ద అడ్డగోలుగా కోచింగ్ ఫీజు వసూళ్లు చేయడం దుర్మార్గపు చర్య అని తెలిపారు. గడ్డిఅన్నారంలోని ఐఏసీఈ కోచింగ్ సెంటర్ లో సీబీటీ 2 ఫ్రీ పరీక్ష పేరుతో విద్యార్థుల నుంచి రిజిస్టేషన్ నంబర్స్ తీసుకొని మా కోచింగ్ సెంటర్ నుంచి ఆర్ఆర్ బీలో అసిస్టెంట్ లోకో పైలట్ కు అర్హత సాధించారని సోషల్ మీడియాలో ప్రచారం చేశారని ఆరోపించారు. ఇలాంటి నేరపూరితమైన చర్యలను సహించేది లేదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం నియమాల ప్రకారం విద్యార్థుల నుంచి కన్సర్న్ లెటర్ తీసుకోకుండా ప్రకటనలు చేయడం అమాయకమైన విద్యార్థులను మోసం చేయడమేనని ఆరోపించారు. మోసపూరితమైన ప్రకటనలు, ఫలితాలతో విద్యార్థులను మోసం చేస్తున్న ఐఏసీఈ యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సైదులు యాదవ్, డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శేషు, పీడీఎస్ యూ అధ్యక్షుడు వెంకటేశ్, టీఎస్ పీ రాష్ట్ర అధ్యక్షుడు భారీ అశోక్, టీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్, జనసేన విద్యార్థి నాయకులు బండి నరేష్ మాదిగ, దండోరా అధ్యక్షుడు నకిరేకంటి సైదులు మాదిగ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ వీరబోయిన లింగయ్య, విద్యార్థి నాయకులు మామిడాల రవికుమార్, మీసాల మహేష్, ప్రవీణ్, నక్క సుధీర్, చిరంజీవి, వెంబడి గణేశ్, సిద్దు యాదవ్, నరేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల మానసిక ఉల్లాసానికి క్రీడలు ముఖ్యం



**ఉత్సాహంగా ప్రారంభమైన జర్నలిస్టుల క్రీడా పోటీలు.**

**నిజామాబాద్ జిల్లా విశాల భారతి** : తొలి రోజు జర్నలిస్టులకు క్రికెట్ పోటీలు క్రీడా స్ఫూర్తిని చాటిన జర్నలిస్టులు క్రికెట్ విజేతగా నిజామాబాద్ జట్టు, రన్నర్ గా ఇందూరు జట్టు జర్నలిస్టుల మానసిక ఉల్లాసానికి క్రీడలు ముఖ్యమని నిజామాబాద్ ఏసీపి ప్రకాష్ యాదవ్ అన్నారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడ పోటీలు ఉత్సాహంగా గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిజామాబాద్ ఏసిపి ప్రకాష్ యాదవ్ మాట్లాడుతూ ఆగస్టు 15 పురస్కరించుకొని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం క్రీడలు నిర్వహించడం అందులో భాగంగా మొదటి గా క్రికెట్ మ్యాచ్ ను పోలీస్ పరేడ్ మైదానంలో ఇందూరు జట్టు, నిజామాబాద్ జట్టుకు మ్యాచ్ ప్రారంభించడం జరిగిందన్నారు. క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నిర్విరామంగా ప్రతిరోజు వార్తలలో జర్నలిస్టు నిమగ్నమై ఒత్తిడికి గురవుతున్న జర్నలిస్టులకు ఈ పోటీ లు ఉపశమనం కలిగిస్తాయని అన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పంచ రెడ్డి శ్రీకాంత్, వాగ్మారే సుభాష్ మాట్లాడుతూ..ప్రతి సంవత్సరం జనవరి 26, ఆగస్టు 15, జర్నలిస్టులకు నిర్వహించే క్రీడల్లో భాగంగా ఈ సంవత్సరం కూడా యధావిధిగా నిర్వహించామని తెలిపారు. జర్నలిస్టులు నిత్యం వార్తల బిజిలలో ఉంటారని, ఇలా క్రీడలు ఆడడం జర్నలిస్టులకు ఈ పోటీ లు ఉపశమనం కలిగిస్తాయని అన్నారు. క్రికెట్ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. క్రీడాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు. క్రికెట్ మ్యాచ్లను ఆర్గనైజింగ్ చేసిన ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు గోవింద రాజు, ఈ సీ సభ్యుడు జయపాల్ లను అభినందించారు.

**నిజామాబాద్ జట్టు ఘనవిజయం.**

ఇందూరు జట్టు మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేసిన ఇందూరు జట్టు నిర్మిత 15 ఓవర్లలో 112 పరుగులు చేసి ఐదు వికెట్లు కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్ దిగిన నిజామాబాద్ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 14.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేదించి 114 పరుగులు చేసి ఘనవిజయం సాధించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి రాజ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజు ,ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# కొండాపూర్ ఊర చెరువు కట్టను పరిశీలించిన ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి



- **ఎగువన కురిసిన వర్షా లకు తెగిపోయిన ఊర చెరువు కట్ట**
- **ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే**
- **కల్వర్టు మరమ్మతులకు అధికారులకు ఆదేశాలు**
- **చరవాణిలో ఇంచార్జి కలెక్టర్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే**
- **కల్వర్టులను సత్వరమే మరమ్మతులు చేపట్టనున్నట్లు వెల్లడి**
- **నష్టపోయిన పంట పొలాల రైతులకు ఆదుకుంటాం**

**నిజామాబాద్ జిల్లా విశాల భారతి**

ఎగువన కురిసిన భారీ వర్షాల కారణంగా సిరికొండ మండలం కొండాపూర్ ఊర చెరువు కట్ట తెగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి గురువారం కొండాపూర్ చెరువు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. తొలుత కొండాపూర్ సిరికొండ మధ్య గల కల్వర్టును పరిశీలించారు. అనంతరం కొండాపూర్ ఊర చెరువు కట్ట పై కలియతిరుగుతూ.. ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం తూంపల్లికొండాపూర్ మధ్య గల దెబ్బతిన్న కల్వర్టు పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. కొండాపూర్ ఊర చెరువు శిఖం భూములు కబ్జాకు గురి కావడం కారణంగానే కట్ట తెగిపోవడంతో కారణమైందన్నారు. తొలుత దెబ్బతిన్న కల్వర్టులను సాధ్యమైనంత త్వరితగతిన మర్మమతులు చేపట్టాలని సంబంధింత ఇరిగేషన్ అధికారులకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. అటు జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ తో స్వయంగా చరవాణిలో మాట్లాడి.. ప్రస్తుత పరిస్థితులను వివరించారు. పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలిపారు. కబ్జాకు గురైన చెరువు శిఖం భూములను సర్వే చేపట్టి మార్కింగ్ చేయాలని రెవెన్యూ , ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.కబ్జాలో ఎవరు ఉన్న ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. చెరువు కట్ట తెగిపోవడంతో ప్రభావిత ప్రాంతాల్లోని పంట పొలాలు దెబ్బతిన్నాయని పేర్కొన్న ఎమ్మెల్యే .. బాధిత రైతులకు ఆదుకుంటామని వెల్లడించారు. జరిగిన నష్టాన్ని అధికారులతో సర్వే నిర్వహించి నివేదికను ప్రభుత్వానికి సమర్పించి పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ సాయరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గొల్ల ఎర్రన్న, ఉమ్మాజి నరేష్, బాకరం రవి, మునిపల్లి సాయి రెడ్డి, చందర్ నాయక్, కొండాపూర్ సర్పంచ్ జీవన్, ఆయా గ్రామాల సర్పంచ్లు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# చందానగర్‌లో 26 సీసీ కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం

- **నేర నియంత్రణ, ప్రజల భద్రతకు మరింత బలోపేతం**
- **దాత నుంచి రూ.3 లక్షల విరాళ**

**సైబరాబాద్ - విశాల భారతి**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, నేరాల దర్యాప్తును మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 26 ఆధునిక సీసీ కెమెరాల ఏర్పాటుకు అధికారులు గురువారం శ్రీకారం చుట్టారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 1 కెమెరాల ఏర్పాటు పనులను ప్రారంభించారు. చందానగర్ పరిధిలో ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే బీఎస్ఎన్ఎల్ కూడలి, హుడా కాలనీ కూడలి, రైల్వే ఓవర్‌బ్రిడ్జి కూడలి, నల్లగండ్ల అండర్‌పాస్, లింగంపల్లి రైల్వే స్టేషన్ పరిసరాలు, రైతు బజార్, గోపనపల్లి కూడలి తదితర కీలక ప్రాంతాల్లో ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాంతాల్లో వాహనాల రద్దీ, ప్రజల సంచారం ఎక్కువగా ఉండటంతో నేరాల నియంత్రణతో పాటు ట్రాఫిక్ పర్యవేక్షణకు కూడా ఇవి ఉపయోగపడనున్నాయి. అధికారుల ప్రణాళిక ప్రకారం వారం రోజుల్లో కెమెరాల ఏర్పాటు పనులను పూర్తిచేసి వాటిని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురానున్నారు. కెమెరాల ద్వారా అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, వాహనాల రాకపోకలు, నేర ఘటనలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు అవకాశం కలుగుతుందని పోలీసులు తెలిపారు. నేరాలు జరిగిన సందర్భాల్లో దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు నిందితులను త్వరగా గుర్తించడంలో ఈ వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.సీసీ కెమెరాల ఏర్పాటుకు అవసరమైన నిధుల్లో భాగంగా స్థానిక దాత మిర్యాల రాఘవరావు రూ.3 లక్షల చెక్కును చందానగర్ పోలీసులకు అందజేశారు. ప్రజల భద్రత కోసం చేపట్టిన ఈ కార్యక్రమానికి ఆయన అందించిన సహకారాన్ని పోలీసులు అభినందించారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, ప్రతి కాలనీ, అపార్ట్‌మెంట్, వ్యాపార సంస్థ, ఇంటి ముందు రహదారి కనిపించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రజలకు సూచించారు. ప్రజలు, పోలీసుల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల నెట్‌వర్క్‌ను మరింత విస్తరించడం ద్వారా నేరాలను అరికట్టడంతో పాటు సురక్షిత సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని తెలిపారు. ప్రజలంతా పోలీసులకు సహకరించి తమ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్**

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:** ఆగస్టు 15వ తేదీన జరగబోయే భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏర్పాట్లను ఘనంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ స్నేహ శబరిష్ సూచించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, జిల్లా రెవెన్యూ అధికారిని, నాగలక్ష్మి, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, సంబంధిత అన్ని విభాగాల అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రం, జిల్లాలో ప్రతి ప్రభుత్వ కార్యాలయాలలో జాతీయ జెండా ను ఆవిష్కరించి ఘనంగా కార్యక్రమాలను నిర్వహించాలని, జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమంలో జెండా ఆవిష్కరణ, ప్రసంగం, వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల పై స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, సానిటేషన్, పిఎ సిస్టం, స్టేజ్ డెకరేషన్స్, చైర్స్, తదితర అన్ని సౌకర్యాలను సంబంధిత విభాగాల సిబ్బంది ఏర్పాట్లు చేయాలని తెలిపారు, ప్రోటోకాల్ ప్రకారం అందరికీ ఆహ్వానం అందించాలని, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు పరుస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలపై శాఖల వారీగా సాధించిన పురోగతి పై ప్రసంగం కాపీలను సిద్ధం చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, కలెక్టరేట్ పర్యవేక్షకులు పవన్ కుమార్, సూపర్డెంట్ రాజేష్, మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్, స్థానిక తహసిల్దార్ రాజేశ్వర్, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత



**మునుగోడు విశాల భారతి :** పులిపలుపుల గ్రామానికి చెందిన గురువారం యిరిగిదిండ్ల ఇద్దయ్య s/o మారయ్య సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ 60000/ ఐరవై వేల రూ. చెక్ ను బి ఆర్ఎస్ నాయకులు పగిళ్ల రాము ఆధ్వర్యంలో బాధితుడి కి అందించడం జరిగింది.

# వర్షా కాలంలో విష జ్వరాలు తగలకుండా అప్రమత్తంగా ఉండాలి



**మునగాల, విశాలభారతి:** వర్షాకాల ప్రభావం వల్ల దోమల బెడద విపరీతంగా పెరగడంతో, మునగాల గ్రామంలో దోమల నిర్మూలనకై గ్రామ సర్పంచ్ చల్ల గురవయ్య ఆధ్వర్యంలో గురువారం ఫాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చల్ల గురవయ్య మాట్లాడుతూ.. ప్రజలందరూ తమ ఇళ్లు మరియు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. ఇళ్ల పరిసరాలలో మురుగునీరు నిల్వ ఉండేలా చూసుకోవద్దని, ఖాళీ నీటి తొట్లు, పూల కుండీలు, ఇతర పాత సామాగ్రిలో నీరు చేరడం వల్లే దోమలు ఎక్కువగా వృద్ధి చెందుతాయని హెచ్చరించారు. దోమకాటు వల్ల విష జ్వరాలు ప్రబలి ప్రజల ఆరోగ్యం క్షీణించే ప్రమాదం ఉందన్నారు. గ్రామంలో దోమల నివారణకు మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించడంతో పాటు, బ్లీచింగ్ పౌడర్‌ను చల్లిస్తున్నామని సర్పంచ్ తెలిపారు. ప్రజలు కూడా వ్యక్తిగత పరిశుభ్రత పాటించి గ్రామ పంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి పవన్, ఉప సర్పంచ్ వేనేపల్లి శైలజ రమేష్ బాబు, వివిధ వార్డుల సభ్యులు మరియు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# బలపాల గ్రామ శివారులో గొడవ.. నలుగురిపై కేసు నమోదు: కురవి ఎస్సై బి సతీష్



**కురవి, విశాల భారతి:** కురవి మండలం బలపాల గ్రామ శివారులో జరిగిన గొడవ ఘటనకు సంబంధించి నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కురవి ఎస్సై బి. సతీష్ వివరాల ప్రకారం, కురవి మండలం హరియా తండాకు చెందిన భుక్యా వెంకన్న (58) ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 3వ తేదీ మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో బలపాల గ్రామ శివారులోని నర్సరీ ఎదురుగా ఉన్న రోడ్డుపై ఆయన కుమారుడు భుక్యా ప్రేమ్‌కుమార్‌తో లక్ష్మి తండా, బలపాల గ్రామానికి చెందిన బాదావత్ శ్రీను, బాదావత్ విజయ, బాదావత్ స్వామి, బాదావత్ శారద మధ్య గొడవ చోటుచేసుకుంది. ఈ ఘటనలో చిన్న కారణంతో నిందితులు చులకన భాషలో దూషిస్తూ కర్రలతో దాడి చేసి భుక్యా ప్రేమ్‌కుమార్ తలకు, ఎడమ చేతికి, శరీరంలోని ఇతర భాగాలకు గాయపరిచినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం విషయాన్ని ప్రశ్నించిన ఫిర్యాదుదారు భుక్యా వెంకన్నపై కూడా చేతులతో దాడి చేసి, చంపేస్తామని బెదిరించినట్లు ఆరోపించారు. ఫిర్యాదు మేరకు క్రైమ్ నంబర్ 152/2026గా కేసు నమోదు చేసి, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 296, 115(2), 118(1), 351(2)తో పాటు 3(5) కింద నలుగురు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు కురవి ఎస్సై బి. సతీష్ తెలిపారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**సర్పంచ్ చల్ల గురవయ్య**

**మునగాల ,ఆగస్టు 6, విశాల భారతి :** వర్షాకాల ప్రభావం వల్ల దోమల బెడద విపరీతంగా పెరగడంతో గ్రామంలో దోమల నిర్మూలన కి గ్రామ సర్పంచ్ చల్ల గురవయ్య గ్రామంలో ఫాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చల్ల గురవయ్య మాట్లాడుతూ ప్రజలు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఇళ్లల్లో మురుగు నీటి నిలువ ఉండే కాళీ నీటి తొట్లు, పూల కుండీలు, ఇతర ప్రదేశాలలో మురుగునీరు నిలువ ఉండటం వలన దోమలు సంతాన ఉత్పత్తి చేసుకుంటాయని ప్రజలు దోమ కాటుకి గురి కావడం వలన విష జ్వరాలు ప్రభలుతాయని తద్వారా ప్రజల ఆరోగ్యాలు క్షీణిస్తాయని ఉన్నారు. గ్రామంలో దోమల నిర్మూలనకై డ్రైనేజీలనీ శుభ్రం చేయించడంతోపాటు బ్లీచింగ్ పౌడర్ని చల్లిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పవన్, ఉప సర్పంచ్ వేనేపల్లి శైలజ రమేష్ బాబు, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ అధికారులు ప్రజా బాట



**మునగాల, మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలో విద్యుత్ అధికారులు గురువారం ప్రజాబాట కార్యక్రమం నిర్వహించారు, మండల కేంద్రంలోని గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర ఉన్న ట్రాన్స్ఫార్మ్ కి పిచ్చి చెట్ల తీగలను తొలగించారు,ఈ సందర్భంగా ఏఈ వికాస్ మాట్లాడుతూ ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకుని రావాలని కోరారు, విద్యుత్ ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు, డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పించారు, ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్తును అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు, ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, లైన్మెన్ రాఘవాచారి, ఏ ఎల్ ఎం నరేష్, స్థానికులు పాల్గొన్నారు.

# కారంగుల వీరయ్య మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు: కాసర్ల కోటేశ్వరరావు



**మునగాల: విశాల భారతి :** మండల పరిధిలోని తాడువాయి గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు *కారింగుల వీరయ్య పార్థివదేహానికి పూలు వేసి, కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి, నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన మునగాల మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కాసర్ల కోటయ్య .బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చి పాపయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మాతంగి బసవయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేనేపల్లి వీరబాబు, ఉప సర్పంచ్ వట్యావుల సైదులు, మాజీ సర్పంచ్ లక్యా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ దేవరం సుధీర్ రెడ్డి,జిల్లేపల్లి శ్రీనివాస్,సోమపంగు గోపి,వల్లోజ్ శీను,గట్టు ఉపేందర్ రావు, సాయి, పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి.. తండ్రికి తీవ్ర గాయాలు





**మునగాల, విశాలభారతి:** మునగాల మండల పరిధిలోని ముకుందాపురం గ్రామ స్టేజీ సమీప జాతీయ రహదారి పై గురువారం రాత్రి జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదంలో కుమారుడు అక్కడికక్కడే మృతి చెందగా, తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకు పాముల గ్రామానికి చెందిన గౌరారపు లింగయ్య, ఆయన కుమారుడు ఎలమంచి ఇద్దరూ కలిసి మునగాల నుండి ఆకుపాములకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో ముకుందాపురం స్టేజీ వద్దకు రాగానే ప్రమాదం సంభవించి ఎలమంచి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తండ్రి లింగయ్య తీవ్రంగా గాయపడటంతో ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న మునగాల ఎస్సై ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకున్నారు. ప్రమాదం ఏ విధంగా జరిగింది అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఆదివాసీ స్వయం పాలన రాజ్యాధికార హక్కుల కోసం ఉద్యమిద్దాం..!

- పెద్ద చంద్రన్న వర్గానికి గట్టి ఎదురుదెబ్బ..
- ప్రజా సమస్యలపై పోరాటమే నిజమైన రాజకీయమంటూ అశోకన్నా.
- నాయకత్వంపై విశ్వాసం ప్రకటించిన నాయకులు
- జల్–జంగిల్–జమీన్ హక్కుల సాధనే లక్ష్యం..
- ఆగస్టు 9ను ప్రతి గ్రామంలో పోరాట దినంగా నిర్వహించాలని పిలుపు.



**మహబూబాబాద్ జిల్లా విశాలభారతి:**

ఆదివాసీ స్వయం పాలన, రాజ్యాధికార హక్కుల సాధన కోసం గ్రామ గ్రామాన పోరాటాలను ఉధృతం చేయాలని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా పిలుపునిచ్చారు. ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి పోరాట దినంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలనే పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం గురువారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి సనప పొమ్మయ్య అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా ఆదివాసీల హక్కులపై సుదీర్ఘంగా ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు తరతరాలుగా తమ భూమి, అటవీ, సహజ వనరులు మరియు స్వయం పాలన హక్కుల కోసం పోరాటాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆదివాసీల రక్తత్యాగాలు, నిరంతర ఉద్యమాల ఫలితంగానే 1/70 భూబదిలీ నియంత్రణ చట్టం, పెసా చట్టం, అటవీ హక్కుల చట్టం వంటి కీలక చట్టాలు వచ్చాయని గుర్తు చేశారు. అయితే ఈ చట్టాలను ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. షెడ్యూల్ 5 ప్రాంతాల్లో బహుళజాతి కంపెనీలకు మైనింగ్ అనుమతులు ఇవ్వడం ద్వారా ఆదివాసీ ప్రాంతాలపై దాడి జరుగుతోందని ఆయన మండిపడ్డారు. టైగర్ జోన్లు, టైగర్ కారిడార్లు, నేషనల్ పార్కులు, అభయారణ్యాలు, బొగ్గు గనులు, రిజర్వాయర్లు, జాతీయ రహదారుల పేరుతో ఆదివాసీలను వారి స్వస్థలాల నుండి నిర్వాసితులను చేయడం అన్యాయమని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ఈ విధానాలను విరమించుకొని ఆదివాసీల జీవన హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జీవో నంబర్ 3 అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, జల్ జంగిల్ జమీన్ హక్కుల పరిరక్షణ కోసం ఆదివాసీ యువత, ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్వయం పాలన, రాజ్యాధికార సాధన కోసం ఐక్యంగా పోరాడాలని సూచించారు.

**పెద్ద చంద్రన్న పార్టీకి షాక్**

ఈ సభ అనంతరం పాకాల రాజకీయాల్లో సంచలనం రేపిన పరిణామం చోటుచేసుకుంది. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పెద్ద చంద్రన్న పార్టీకి చెందిన సీనియర్ నాయకులు సిద్ధబోయిన జీవన్, శ్రీరాములు నాయకత్వం లో 15 కుటుంబాలు ముకుమ్మడిగా రాజీనామా చేసి సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ అశోకన్నా పార్టీలో చేరారు. రాజీనామా చేసిన నాయకులు మాట్లాడుతూ పెద్ద చంద్రన్న పార్టీ ప్రతిఘటన పోరాటాల పేరుతో కార్యకర్తలను మభ్యపెడుతోందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై ఆచరణాత్మక పోరాటాలు చేయకుండా కేవలం నినాదాలకే పరిమితమైందని విమర్శించారు. ప్రజల సమస్యలను పట్టించుకోని నాయకత్వంతో కొనసాగడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ అశోకన్నా వర్గం ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతోందని, గోదావరి లోయ ప్రాంతంలో ప్రతిఘటన పోరాట రాజకీయాలను బలోపేతం చేస్తోందని భావించి పార్టీలో చేరినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు సిద్ధబోయిన జీవన్, శ్రీరాములు తో సహా సుమారు 15 కుటుంబాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ అశోకన్నా పార్టీలో చేరారు. వారికి రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా పార్టీ కండువాలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి బానోత్ ఉక్లా, పార్టీ జిల్లా నాయకులు ఆరెం కోటమ్మ, పి డి ఎస్ యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్, ఇరుగు నాగన్న, పి ఓ డబ్ల్యు నాయకురాలు గోనే భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

# ప్రజల మనిషి – ప్రజాయుద్ధనౌక గద్దర్‌కు ఘన నివాళులు



- మూడవ వర్ధంతి సందర్భంగా మహబూబాబాద్‌లో స్మారక సభ
- గద్దర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచే మహాకవి : డా. కొమిరె సాకీ

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి)**

ప్రజాకవి, ప్రజావాగ్గేయకారుడు, విప్లవ గాయకుడు గద్దర్ మూడవ వర్ధంతి సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఘన నివాళుల కార్యక్రమం నిర్వహించారు. జంపాల చక్రధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి, గాయకుడు, రచయిత డా. కొమిరె సాకీ ముఖ్య అతిథిగా హాజరై గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డా. కొమిరె సాకీ మాట్లాడుతూ, సమానత్వ సమాజ స్థాపనే గద్దర్ జీవిత లక్ష్యమని పేర్కొన్నారు. కష్టపడే ప్రజలకు వారి శ్రమ ఫలితం దక్కే సమాజం కోసం, దళితులు, ఆదివాసీలు, కార్మికులు, రైతులు, పీడిత వర్గాల హక్కుల కోసం గద్దర్ జీవితాంతం పోరాడారని అన్నారు. సమాజంలోని అసమానతలు, దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా తన గళాన్ని ఆయుధంగా మలుచుకున్న మహోన్నత వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. గద్దర్ కేవలం గాయకుడు మాత్రమే కాదని, ప్రజల బాధలను తన పాటల్లో ప్రతిబింబించిన ప్రజా తాత్వికుడు, ప్రజావాగ్గేయకారుడు, శ్రామిక సంగీత సాధకుడు, ప్రజా సంస్కృతికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రజల కష్టసుఖాలను, వారి ఆవేదనలను, పోరాటాలను ప్రపంచానికి చాటి చెప్పిన అపూర్వ కళాకారుడిగా ఆయన నిలిచిపోయారని అన్నారు. భారతీయ జానపద సాహిత్యం, దళిత సాహిత్యం, ఆదివాసీ సంస్కృతి, శ్రామిక జీవితం, తెలంగాణ పోరాట చరిత్ర—ఈ అన్నింటినీ ఒకే గళంలో కలిపి ప్రపంచానికి వినిపించిన అరుదైన మహాకవి గద్దర్ అని కొనియాడారు. వేమన, కబీర్, వీరబ్రహ్మం, తుకారం వంటి మహనీయుల సంప్రదాయాన్ని ప్రజా ఉద్యమాలతో మేళవించి సజీవ సాహిత్యాన్ని సృష్టించిన మహోన్నత వ్యక్తి గద్దర్ అని తెలిపారు. ప్రజా ఉద్యమాల చరిత్రలో గద్దర్ పాత్ర చిరస్మరణీయమని, శ్రీకాకుళం నుంచి ఇంద్రవెల్లి వరకు, కారంచేడు నుంచి చుండూరు వరకు, తెలంగాణ ఉద్యమం నుంచి దేశవ్యాప్తంగా జరిగిన ప్రజా పోరాటాల వరకు గద్దర్ పాట ప్రజలకు స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు. ఆయన పాటలు పీడిత ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడే శక్తిని నింపాయని అన్నారు. గద్దర్ పేరు తెలుగు సమాజంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలకు ప్రతీకగా నిలిచిందని, ఆయనకు లభించని అవార్డుల కంటే ప్రజల ప్రేమే గొప్ప పురస్కారమని డా. కొమిరె సాకీ అన్నారు. గద్దర్ గానం, భావజాలం, త్యాగం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ సాధన కోసం సామాజిక న్యాయశక్తులు, విప్లవ శక్తులను ఒకే వేదికపైకి తీసుకురావడంలో గద్దర్ విశిష్ట పాత్ర పోషించారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజాఫ్రంట్ తొలి అధ్యక్షుడిగా ప్రజా ఉద్యమాలకు దిశానిర్దేశం చేసిన మహోన్నత నాయకుడికి మూడవ వర్ధంతి సందర్భంగా వినమ్ర నివాళులు అర్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమకారులు చిత్తారి సోమన్న, జెర్రీ, పోతుల వెంకన్న, గుదె విరన్న, నిలేష్ రాయ్, గంధసిరి వేణు, ముంజల రాజేందర్, గండి వీరేందర్, నూనె శ్రీనివాస్, సామెల్, మాదరబోయిన యాకయ్య తదితరులు పాల్గొని గద్దర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

# వైవిధ్య పంటల సాగుతో రైతులకు అధిక లాభాలు సాధ్యం

- ప్రభుత్వ సూచనల మేరకు రైతులను చైతన్యవంతం చేయాలి
- ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి.
- నిషేధిత పురుగుమందుల విక్రయాలపై అప్రమత్తంగా ఉండాలని ఫెర్టిలైజర్ దుకాణాల యజమానులకు సూచన



**మహబూబాబాద్ విశాల భారతి:**

వ్యవసాయ రంగంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు వైవిధ్యంతో కూడిన పంటల సాగు వైపు మళ్లేలా అవగాహన కల్పించాలని ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. సీరోలు మండలం కాంపల్లి రైతు వేదికలో గురువారం నిర్వహించిన ఎరువులు, పురుగుమందుల దుకాణాల యజమానుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా నల్లు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం నిషేధించిన పురుగుమందులను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించకూడదని స్పష్టం చేశారు. రైతుల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను ప్రతి వ్యాపారి తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా కూరగాయలు, నూనెగింజలు, పప్పుధాన్యాలు వంటి వైవిధ్యమైన పంటలను సాగు చేసేలా ప్రోత్సహించాలని కోరారు. అలాగే ప్రభుత్వం సూచించిన ఏడు రకాల వరి సన్నాల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వ్యవసాయ వ్యయాన్ని తగ్గించి దిగుబడులను పెంచేందుకు నానో డీఏపీ, నానో యూరియా వినియోగంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఎరువుల దుకాణాల యజమానులకు సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందిస్తూ శాస్త్రీయ సలహాలు ఇవ్వడం ద్వారా వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి ఛాయారాజ్, ఏఈఓ భరత్, ఎరువుల వ్యాపారులు సుస్మన్ రెడ్డి, బద్రు, వీరన్న, దేవేందర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సర్ కార్యక్రమం పై అఖిలపక్ష సమావేశం



**మునగాల, ఆగస్టు5 విశాల భారతి:** సమగ్ర ఓటర్ సవరణ (ఎస్ఐఆర్) సర్ కార్యక్రమంపై చర్చించేందుకు గురువారం మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం నందు తహసిల్దార్ సరిత అధ్యక్షతన అఖిలపక్ష రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో తహసిల్దార్ సరిత మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సర్ కార్యక్రమంలో భాగంగా 100% పూర్తిస్థాయి పారదర్శకంగా ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పూర్తిచేసి పోలింగ్ బూతుల వారిగా ఓటర్ వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేసే ప్రక్రియ ఆగస్టు3 నాటికి పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. మండలంలోనిసర్ కార్యక్రమంలో తమ యొక్క వివరాలను పొందుపరచడంలో ఏమైనా లోటుపాట్లు జరిగిన లేదా సాంకేతికంగా సమస్యలు తలెత్తి తమ యొక్క వివరాలను సమర్పించని వారు ఎవరైనా ఉన్నట్లయితే వారు తక్షణమే తమ గ్రామంలోనే ఓటు హక్కు కావాలని కోరుకుంటే ఆగస్టు 10వ తారీఖు లోపు తమ యొక్క వివరాలను స్థానిక బిఎల్ఓల ద్వారా నమోదు చేసుకునే చివరిఅవకాశం ఉన్నదని ఆమె తెలిపారు. మండల వ్యాప్తంగా నిర్వహించిన సర్ కార్యక్రమంలో ఒకే వ్యక్తి రెండు ఓట్లు కలిగి ఉన్న లేదా. చనిపోయిన వారు మరియు ఓటు హక్కును ఇతర ప్రాంతానికి మార్చుకునే వారి వివరాలు ఇప్పటికే పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయడం జరిగిందని ఆమె తెలిపారు. మండలంలోసర్ కార్యక్రమం విజయవంతం కోసం కృషిచేసిన అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులకు మరియు బిఎల్ఓ లకు బిఎల్ఎ లకు ఆమె ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల కోటేశ్వరరావు, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, సిపిఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు, సిపిఐ మండల నాయకులు సిహెచ్ సీతారామ్, బిజెపి మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు ఓరుగంటి రవి, సత్యనారాయణ రెడ్డి, దొంగరి శ్రీను, స్వరాజ్యం, కలకోవ సర్పంచ్ మండవ వెంకటాద్రి, ఆర్ఐ రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తి కావాలి

- జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా 92వ జయంతి వేడుకలు
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ నివాళులు



**మహబూబాబాద్ విశాల భారతి:** తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త, మేధావి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి వేడుకలు గురువారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అందించిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ సాధనకు ఆయన చేసిన త్యాగాలు, చూపిన మార్గం, సిద్ధాంతాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు, భావజాలం నేటి యువతకు మాత్రమే కాకుండా భావితరాలకు కూడా స్ఫూర్తిగా నిలుస్తాయని, ఆయన కలలుగన్న సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చేసిన కృషిని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగలక్ష్మి, జిల్లా అధికారులు డాక్టర్ కిరణ్ కుమార్, విజయ్ చంద్ర, శ్రీనివాసరావు, శ్రీమన్నారాయణ రెడ్డి, మరియన్నా, జ్యోతి, విజయ నిర్మల, విజయ, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, కలెక్టరేట్ మరియు బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళులు అర్పించారు.

# ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు కొనసాగించాలి



**అంబర్పేట్, విశాల భారతి:** తొలి దశ మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను కొనసాగిస్తామని బిఆర్ఎస్ ఉద్యమ నాయకుడు మల్లికార్జున్ యాదవ్ పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ని పురస్కరించుకొని ఉద్యమకారుడు మల్లికార్జున్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం అంబర్పేట్ లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్ర వలస పాలకుల కబంధహస్తాల నుండి తెలంగాణ జాతిని విముక్తి చేయడానికి యావత్ తెలంగాణ జాతి ఒక్కటై రోడ్ల మీదకు వచ్చి ఉద్యమం చేస్తే ఆ ఉద్యమం తప్పుదోవ పట్టకుండా ఉద్యమానికి దశాదిశా నిర్దేశించిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు.తెలంగాణ జాతికి గురువు ప్రొఫెసర్ జయశంకర్ అయితే, సీఎం రేవంత్ రెడ్డి మాత్రం తన గురువు చంద్రబాబు గా వ్యవరించడం తెలంగాణ జాతికి జరుగుతున్న అన్యాయమని పేర్కొన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతాలకు అనుగుణంగా పరిపాలన జరిపి ఈ జాతి మహోన్నత్వానికి పాటుపడాలని కోరారు. ఏ ఆంధ్ర వలస పాలకుల అణిచివేతకి వ్యతిరేకంగా తెలంగాణ ఉద్యమ పోరాటం జరిగిందో అదే ఆంధ్ర పాలకుల చేతుల్లో ఆట బొమ్మగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తూనరని విమర్శించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మొహమ్మద్ ఆమీర్, మొహమ్మద్ ఇబ్రహీం, రాహుల్ ముదిరాజ్, అక్షయ్, హరీష్, చేతన్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక తెలంగాణ సాధిస్తాం

- అణగారిన వర్గాలతో కొత్త చరిత్ర లిఖిస్తాం
- గౌతమబుద్ధుడు, సాహు మహారాజ్, పూలేను స్ఫూర్తిగా తీసుకుంటాం
- కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పేదలకు అన్యాయం చేశాయి
- సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిది



**ఎల్బీనగర్, విశాల భారతి :** సామాజిక న్యాయమే లక్ష్యం.. రాజ్యాంగం సంపూర్ణ అమలే మా సంకల్పం "గా సామాజిక తెలంగాణ సాధిస్తామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ప్రకటించారు. ఎల్బీనగర్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో గురువారం సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ నిర్వహించారు. సభలో కల్వకుంట్ల కవిత కీలక ప్రసంగం చేశారు. తన ఆత్మ, మనసు ఒప్పుకోని పని ఎంత పెద్ద లాభం వచ్చినా ఎప్పటికీ చేయనని, విలువలను వదులుకుని ఉంటే నేడు ఈ స్థితిలో ఉండేదాన్ని కాదని స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదం, సహకారంతో తెలంగాణలో ఖచ్చితంగా మంచి మార్పు తెస్తామనే విశ్వాసంతో ఈ ఉద్యమాన్ని ప్రారంభించానన్నారు. సామాజిక న్యాయం అంటే అగ్రవర్ణాలకు వ్యతిరేకం కాదని, ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించడమే అసలైన సామాజిక న్యాయమని చెప్పారు. ఈ సభ కోట్లాది మంది జీవితాల్లో మార్పుకు నాంది పలుకుతుందని, రాజరిక కాలంలో అణగారిన వర్గాలపై జరిగిన అన్యాయాలకు ప్రజాస్వామ్యం ముగింపు పలికిందని పేర్కొన్నారు. 1950లో రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పటికీ అది ఇప్పటికీ సంపూర్ణంగా అమలు కాలేదని, రాజ్యాంగ స్ఫూర్తిని పూర్తిగా అమలు చేయడానికే ఈ సామాజిక న్యాయ పోరాట జైత్రయాత్ర, సంకల్ప సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. సామాజిక న్యాయం అనగానే కొందరు తమ అవకాశాలు పోతాయని భయపడుతున్నారని, అలాంటి అపోహలు వీడాలని సూచించారు. బీసీ రిజర్వేషన్ల అమలులో మాజీ ప్రధాని విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ చూపిన చొరవను, తమిళనాడులో రిజర్వేషన్లను రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్పించి కాపాడిన మాజీ ముఖ్యమంత్రి జయలలితను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అగ్రవర్ణాల యువత, మహిళలు కూడా సామాజిక న్యాయం కోసం ముందుకు రావాలని కోరారు. దేశంలో ఇంకా లక్షలాది ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీల ఆత్మగౌరవం, జీవన ప్రమాణాలు పెంచే విధానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్ వంటి అత్యున్నత పదవుల్లో రాణించేలా అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో సామాజిక న్యాయాన్ని సాధించే వరకు ఈ పోరాటం నిరంతరం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు. తెలంగాణలో సామాజిక న్యాయాన్ని టీఆర్ఎస్ పార్టీ ముందుకు తీసుకెళ్తుందన్నారు. సాహూ మహారాజ్, గౌతమ బుద్ధుడు, పూలే, అంబేద్కర్ వారసులుగా సామాజిక న్యాయం చేసే తెలంగాణ సాధిస్తామని పేర్కొన్నారు. తెలంగాణలో నేటికీ ఇంకా సామాజిక కుల వివక్ష జరుగుతుందని, అందుకే సామాజిక న్యాయం అందరికీ చేరవేసేలా సంకల్పం తీసుకున్నామని చెప్పారు. నేను అగ్రవర్ణంలో పుట్టినా అణగారిన వర్గాల కోసం పోరాటం చేయడానికి ముందుకు వచ్చానని స్పష్టం చేశారు. పుట్టుక నా చేతిలో లేదు... కానీ, సామాజిక న్యాయం ప్రతి ఒక్కరికి అందించేందుకు నా చేతిలో ఉంది ఆ దిశగా ముందుకు వెళుతున్నాని పేర్కొన్నారు. సామాజిక న్యాయ సాధికారతం అందించే వరకు నా జీవితం అంకితం చేస్తున్నట్లు కవిత పేర్కొన్నారు. సామాజిక ధర్మం పోరాటానికి అన్ని వర్గాలు తమ వెంట కలిసి రావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇస్తానన్న 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఎక్కడా అని ప్రశ్నించారు.

## తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఘనంగా నిర్వహింపు

**ఉప్పరగూడెం గ్రామంలో మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు పేర్ల గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పాఠశాల, గ్రామపంచాయతీలో నివాళులు**



**మహబూబాబాద్, విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా ఉప్పరగూడెం గ్రామంలో తెలంగాణ సిద్ధాంత కర్త ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు పేర్ల గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గ్రామ ఉన్నత పాఠశాల మరియు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు ఆచార్య జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. తెలంగాణ ఆత్మగౌరవం, స్వాభిమాన ఉద్యమానికి ఆయన జీవితాన్ని అంకితం చేశారని, నేటి యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణాకర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీలత, గ్రామ ప్రజలు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆచార్య జయశంకర్‌కు ఘన నివాళులర్పించారు. కార్యక్రమం దేశభక్తి, తెలంగాణ ఆత్మగౌరవ నినాదాల మధ్య ఉత్సాహభరితంగా జరిగింది.

## విద్యుత్ ఆపరేటర్ నిర్లక్ష్యం వర్కర్‌కు గాయాలు



**వాజేడు ఆగస్టు 6 విశాల భారతి:** ములుగు జిల్లా వాజేడు మండల ధర్మవరం విద్యుత్ కేంద్రం లో విధులు నిర్వహిస్తున్న ఆట్టం రాజబాబు అనే వ్యక్తి అదే శాఖలో పనిచేస్తున్న విద్యుత్ ఆపరేటర్ నిర్లక్ష్యం వల్ల విద్యుత్ షాక్ ప్రమాదంలో గాయాల పాలయ్యాడు. వివరములు వెళ్లగా.. ధర్మారం విద్యుత్ కేంద్రంలో గత కొన్ని సంవత్సరాలుగా కాంట్రాక్ట్ వర్కర్ గా పనిచేస్తున్న రాజబాబు విధి నిర్వహణలో చంద్రుపట్ల ఫీల్డర్ Lc తీసుకొని విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా అదే విద్యుత్ కేంద్రంలో ఆపరేటర్ గా పనిచేస్తున్న వ్యక్తి అనుకోకుండా లైన్ ఆన్ చేయడంతో రాజబాబు విద్యుత్ షాక్ గురై మంటలు కాలుతుండగా . గమనించిన వ్యక్తులు వెంటనే విద్యుత్ కేంద్రానికి సమాచార ఇవ్వడంతో విద్యుత్ కేంద్రంలో సిబ్బంది కరెంట్ ఆఫ్ చేయడంతో విద్యుత్ స్తంభం పై నుండి క్రిందపడి గాయాల పాలయ్యాడు వెంటనే పేరూరు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రధమ చికిత్స నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాదు పంపించినట్లు సమాచారం.

## ఆచార్య జయశంకర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

**జయంతి వేడుకలో కలెక్టర్ భవేష్ మిశ్రా**

**నిజామాబాద్ జిల్లా విశాల భారతి:** నిజామాబాద్, ఆగస్టు 06 : తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ భవేష్ మిశ్రా ముఖ్య అతిథిగా విచ్చేసి, ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆచార్య జయశంకర్ అందించిన సేవలను కొనియాడారు. తెలంగాణ భావజాలాన్ని ఎంతో గొప్పగా ముందుకు తీసుకెళ్లిన మహనీయుడని ప్రశంసించారు. 1969 ఉద్యమంతో పాటు మలి విడత ఉద్యమం లోనూ ప్రజలను ప్రత్యేకించి విద్యార్థులు, యువతను ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో భాగస్వామ్యం చేశారని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్ర సాధనే ఆశ, శ్వాసగా ఆరు దశాబ్దాల పాటు సుదీర్ఘంగా అలుపెరుగని కృషి చేస్తూ ప్రజలలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. ఆయన సేవలను స్మరించుకునేలా ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహిస్తోందని, వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టారని అన్నారు. ఆ మహనీయుడి ఆశయాల సాధనకు అన్ని వర్గాల వారు సమిష్టిగా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కాగా, అంతకుముందు కంటేశ్వర్ చౌరస్తాలో గల ఆచార్య జయశంకర్ విగ్రహానికి అదనపు కలెక్టర్ వి.భుజంగరావు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల బాధ్యులు ప్రొఫెసర్ జయశంకర్ సేవలను శ్లాఘిస్తూ, జయంతి వేడుకలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డీఆర్ఓ గీత, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ సందీప్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఇంచార్జి అధికారిణి రజిత, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## ప్రమాదానికి చెక్... ప్రజలకు భరోసా



- గ్రీన్ సిటీ కాలనీ అధ్యక్షులు బక్కి బాబుగౌడ్ ఆధ్వర్యంలో అధికారుల చర్యలకు కాలనీ వాసుల కృతజ్ఞతలు
- ప్రధాన రహదారిపై ప్రమాదకర వృక్షాల కొమ్మల తొలగింపు

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాగోల్ సర్కిల్-11, పెద్ద అంబర్‌పేట్ డివిజన్‌లోని గ్రీన్ సిటీ కాలనీ ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా విద్యుత్ తీగలను ఆనుకుని పెరిగిన భారీ వృక్షాల కొమ్మలను తొలగించిన సందర్భంగా కాలనీ అధ్యక్షులు బక్కి బాబుగౌడ్ ఆధ్వర్యంలో కాలనీ వాసులు విద్యుత్ శాఖ, మున్సిపల్ అధికారులకు ఘనంగా కృతజ్ఞతలు తెలిపారు.కాలనీ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న భారీ వృక్షాల కొమ్మలు విద్యుత్ తీగలను తాకుతూ ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనన్న ఆందోళన నెలకొనిందని కాలనీ వాసులు తెలిపారు. అంతేకాకుండా రాత్రి వేళల్లో వీధి దీపాలు సరిగా వెలగకపోవడంతో రహదారి మొత్తం చీకటిమయంగా మారి ప్రజలు, మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాలనీ అధ్యక్షులు బక్కి బాబుగౌడ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.వినతిపై వెంటనే స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు, మున్సిపల్ సిబ్బంది గురువారం సంయుక్తంగా కాలనీని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం విద్యుత్ స్తంభాలు, తీగలకు అడ్డుగా ఉన్న భారీ వృక్షాల కొమ్మలను తొలగించి రహదారిని సురక్షితంగా మార్చారు. దీంతో కాలనీ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు బక్కి బాబుగౌడ్ మాట్లాడుతూ ..ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని తక్షణమే చర్యలు చేపట్టిన విద్యుత్ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులకు గ్రీన్ సిటీ కాలనీ ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు ఇదే విధంగా ప్రజా సమస్యలపై వేగంగా స్పందిస్తూ సేవలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు వల్లి నాగరాజ్ యాదవ్, కళ్యాణ్, గోవింద్, సత్యనారాయణ, వంశీ, మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

## పెట్టుబడుల పేరుతో మోసం – నిందితురాలు అరెస్ట్

**నార్సింగి పోలీసుల దర్యాప్తు వేగవంతం**

**రాజేంద్రనగర్, విశాల భారతి :**



సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నార్సింగి పోలీస్ స్టేషన్‌లో నమోదైన పెట్టుబడి మోసం కేసులో కీలక పురోగతి సాధించబడింది. అధిక లాభాలు వస్తాయని ఆకర్షణీయమైన హామీలతో ప్రజలను నమ్మబలికి, వారి నుంచి భారీ మొత్తంలో డబ్బులు సేకరించి మోసానికి పాల్పడిన పట్లోళ్ల రూపా రెడ్డిని నార్సింగి పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, నిందితురాలు పెట్టుబడులు పెట్టిస్తే తక్కువ సమయంలోనే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మబలికి పలువురు వ్యక్తులను ఆకర్షించింది. ఈ క్రమంలో అనేక మంది బాధితుల నుంచి లక్షల రూపాయల వరకు డబ్బులు సేకరించి, తరువాత వారికి ఎటువంటి లాభాలు ఇవ్వకుండా మోసానికి పాల్పడినట్లు వెల్లడైంది. బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తును వేగవంతం చేశారు. ప్రాథమిక దర్యాప్తులో, నిందితురాలు ఇదే విధంగా మరికొంత మంది వ్యక్తుల నుంచి కూడా డబ్బులు సేకరించినట్లు తేలింది. ఈ కేసులో బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. ఇప్పటివరకు గుర్తించిన బాధితుల వివరాలను సేకరించడంతో పాటు, మోసపోయిన మొత్తాన్ని ఖచ్చితంగా నిర్ధారించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. అదేవిధంగా, నిందితురాలు నిర్వహించిన ఆర్థిక లావాదేవీలపై సవివరంగా విచారణ కొనసాగుతోంది. బ్యాంక్ ఖాతాలు, ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లు, డిజిటల్ రికార్డులు, సంబంధిత పత్రాలను సేకరించి, నిధుల జాడను కనుగొనే దిశగా పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ మోసం వ్యవహారంలో ఇతరులు కూడా భాగస్వాములై ఉన్నారా అనే కోణంలో కూడా విచారణ కొనసాగుతోంది. నిందితురాలు పట్లోళ్ల రూపా రెడ్డిని అరెస్ట్ చేసి పోలీసు కస్టడీలోకి తీసుకుని, అనంతరం గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి: సర్పంచ్ దున్న శ్రీనివాస్



**నడిగూడెం, విశాలభారతి:** ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్న శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా మంజూరు చేసిన నోట్ బుక్స్ ను ఆయన పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. కళాశాల పూర్వ విద్యార్థిగా దీని అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. కళాశాల ప్రహరీ గోడ, సీసీ రోడ్డు, హాస్టల్ సౌకర్యం కల్పించే విషయాలను స్థానిక ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకొని కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డి. విజయ్ నాయక్, అధ్యాపకులు శ్రీధర్, కృష్ణ, మహేష్, ఉపేందర్, శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొండాపూర్ గ్రామ చెరువు కట్ట తెగిన ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీస్ కమిషనర్... సాయి చైతన్య



**నిజామాబాద్ జిల్లా విశాలభారతి :** సిరికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండాపూర్ గ్రామ శివారులో బుధవారం అర్ధరాత్రి సమయంలో ఉన్న చెరువు కట్టకు భారీగా భంగ పడటంతో చెరువు కట్ట తెగిపోయి, చెరువులోని నీరు పూర్తిగా బయటకు వెళ్లిపోయింది.ఈ ఘటనతో పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐపీఎస్ సంఘటన స్థలాన్ని సందర్శించి చెరువు కట్ట పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు. చెరువు కట్ట తెగిపోవడానికి గల కారణాలు,నీటి ప్రవాహం దిశ, జరిగిన నష్టం, సమీప గ్రామాలపై ప్రభావం,ప్రజల భద్రతకు తీసుకుంటున్న చర్యలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఘటన అనంతరం పోలీసులు అప్రమత్తమై స్థానిక అధికారులతో సమన్వయం చేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. ప్రమాదకర ప్రాంతాల వద్ద ప్రజలు సంచరించకుండా తగిన హెచ్చరికలు జారీ చేయాలని , అవసరమైన చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసు పికెట్లను కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని చెరువులు, వాగులు, కాలువలు,వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలకు ప్రజలు వెళ్లరాదని,పిల్లలను నీటి వనరుల వద్దకు పంపవద్దని సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే సంబంధిత పోలీసులకు లేదా డయల్ 112 కు సంబంధిత సమాచారం అందించాలని కోరారు.ఈ సందర్భంగా ధర్పల్లి సి.ఐ బిక్షపతి,సిరికొండ ఎస్.ఐ జె. రామకృష్ణ, ధర్పల్లి ఎస్.ఐ జి. సందీప్,గ్రామ సర్పంచ్ మానస శ్రీధర్ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఏర్పాటులో ప్రొఫెసర్ జయశంకర్ సేవలు మరువలేనివి

**మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్**



**కోదాడ, విశాలభారతి:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని ధారపోసిన మహనీయుడు, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్ కొనియాడారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ 92వ జయంతిని పురస్కరించుకొని గురువారం కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమానికి జయశంకర్ సార్ దిక్సూచిగా నిలిచారని గుర్తుచేశారు. స్వరాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన మేధోమథనం, ఊరూరా తిరిగి ప్రజల్లో తెచ్చిన చైతన్యం వల్లే నేడు ప్రత్యేక రాష్ట్రం సాకారమైందని అన్నారు. తెలంగాణ నీళ్లు, నిధులు, నియామకాల నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లిన గొప్ప నాయకుడు జయశంకర్ సార్ అని ప్రశంసించారు. ఆయన చూపిన బాటలో నడుస్తూ, బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. మార్కెట్ కమిటీ పరిధిలోని రైతులు, వ్యాపారుల సంక్షేమానికి జయశంకర్ సార్ ఆశయాలకు అనుగుణంగా కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తమనేబోయిన వీరబాబు, మణెమ్మలతో పాటు మార్కెట్ కమిటీ అధికారులు, కార్యాలయ సిబ్బంది, స్థానిక ఆటో యూనియన్ నాయకులు, కార్మికులు మరియు వివిధ పార్టీల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయశంకర్ సార్‌కు ఘన నివాళులు అర్పించారు.

## ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్లో వైభవంగా బోనాల వేడుకలు



**కోదాడ, విశాలభారతి:** కోదాడ పట్టణంలోని ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్లో బోనాల వేడుకలను జోనల్ ఇంచార్జ్ స్నేహలత ఆధ్వర్యంలో గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ ఇంచార్జ్ స్నేహలత స్వయంగా తలపై బోనం ఎత్తుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలు బాగా పండాలని, విద్యార్థులందరికీ ఉజ్వల భవిష్యత్తు కలగాలని ప్రార్థించినట్లు తెలిపారు. నేటితరం విద్యార్థులకు మన సంస్కృతి, సాంప్రదాయ విలువలను తెలియజేయడం ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు.పాఠశాల ప్రిన్సిపల్ పుల్లయ్య మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. భారతీయ పండుగలు మానవతా విలువలను, ఉన్నతమైన జీవన విధానాన్ని నేర్పుతాయని చెప్పారు. వేడుకల్లో భాగంగా విద్యార్థుల సాంప్రదాయ వేషధారణలు, నృత్యాలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# రెండు అంగుళాల స్థలం కోసం పేదోడిపై ఆగ్రహం

**రంగంలోకి దిగిన ఓ ప్రజా ప్రతినిధి**

**అశ్వాపురం, విశాల భారతి :** ఆయనకు నిరుపేద దర్జీ... నాలుగు పదుల కాలం నుండి చిన్న షాపును నిర్మించుకొని గుడ్డలు కుట్టుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఏమైందో తెలియదు గానీ ఈ నిరుపేద దర్జీ పైన పెద్దలకు కోపం వచ్చినట్లుంది. అశ్వాపురం మండల కేంద్రానికి చెందిన తాళ్ల హరిప్రసాద్ అనే టైలర్ కు ఆయుర్వేదిక్ వైద్యశాల సమీపంలోని మూలమలుపు వద్ద చిన్న టైలర్ షాపు ఉన్నది. అయితే ఇటీవల ఆర్ అండ్ బి చేపడుతున్న రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు పక్కన ఉన్న ఈయన షాపు మెట్లు ఓ రెండంగలాలు రోడ్డుకు సైడ్ బర్మ్ పోయాల్సిన వద్దకు వారి కొలతల ప్రకారం వచ్చింది. ఇది సాధారణంగా ఆలోచిస్తే చిన్న విషయమే కానీ కొందరు పెద్దలు పట్టు పట్టి ఆయన షాపును తొలగించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఓ నిరుపేద దర్జీ బతుకుతెరువు కోసమే 40 ఏళ్ల నుండి జీవనాన్ని కొనసాగించే ఆ షాపు మూలమలుపు వద్ద ఉన్న కారణంగా ప్రమాదాలు జరుగుతాయన్న నెపంతో రెండు అంగుళాల స్థలం కోసం ఓ ప్రజా ప్రతినిధిని రంగంలోకి దించారు. పిచ్చుకపై బ్రహ్మాస్త్రం ఉన్నట్టుగా సదరు ప్రజాప్రతినిధి ఆయన విలువైన కాలాన్ని ఈ దర్జీ మెట్లు తొలగించేందుకు ఉపయోగించడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. నిరుపేదకు సహకరించాల్సింది పోయి ప్రజాప్రతినిధులే ఇలా వ్యవహరించడం ఏంటని మండల ప్రజలు గుసగుసలాడుతున్నారు.



# జయశంకర్ జయంతి సందర్భంగా రూ.50 వేల స్పోర్ట్స్ యూనిఫాంల పంపిణీ



**చౌటుప్పల్,విశాల భారతి:** విద్యార్థుల అభ్యున్నతి, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తిని ప్రోత్సహించాలనే సంకల్పంతో లింగోజిగూడెం జడ్పీహెచ్ఎస్ మాజీ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కూరెళ్ళ శ్రీనివాస్-శైలజ దంపతులు ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా పాఠశాల విద్యార్థులకు రూ.50 వేల విలువైన స్పోర్ట్స్ యూనిఫాంలను అందజేశారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోమటిరెడ్డి మాధవరెడ్డి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదవీ విరమణ అనంతరం కూడా పాఠశాలను మరువకుండా విద్యార్థుల సంక్షేమం కోసం నిరంతరం సహకరిస్తున్న కూరెళ్ళ శ్రీనివాస్ గారి సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. విద్యార్థులపై ఉన్న ప్రేమ, ఆప్యాయతకు గుర్తుగా స్పోర్ట్స్ యూనిఫాంలను అందించడం అభినందనీయమని పేర్కొంటూ పాఠశాల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్కూల్ కాంప్లెక్స్ పంతంగి ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ మాట్లాడుతూ, రిటైర్మెంట్ తర్వాత కూడా పాఠశాలతో అనుబంధాన్ని కొనసాగిస్తూ విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడుతున్న శ్రీనివాస్ గారు ప్రతి ఉపాధ్యాయుడికి ఆదర్శమని అన్నారు. విద్యార్థుల క్రమశిక్షణ, ప్రతిభను గుర్తించి యూనిఫాంలను బహూకరించడం ఎంతో గొప్ప విషయమని కొనియాడుతూ స్కూల్ కాంప్లెక్స్ తరపున అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్ గారిని ఘనంగా సన్మానించి, భవిష్యత్తులో కూడా ఇదే విధంగా పాఠశాల అభివృద్ధికి తమ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ప్రధానోపాధ్యాయులు కూరెళ్ళ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు కోమటిరెడ్డి మాధవరెడ్డి, అరుణ, పురుషోత్తమ చారి, విజయలక్ష్మి, రమేష్ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, దేవేందర్, రూప తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి

**తెలంగాణ సర్పంచ్‌ల సంఘం నుంచి ఘన నివాళి**



**చౌటుప్పల్ విశాల భారతి:** తెలంగాణ స్వప్నాన్ని నిజం చేసిన సిద్ధాంతకర్త, స్వయం పాలన స్వాప్నికుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జయశంకర్ సార్ తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం చేసిన అవిరళ కృషిని, త్యాగాలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు. "రాష్ట్ర సాధనే లక్ష్యంగా కేసీఆర్ గారు పార్టీ పెట్టి ఉద్యమం మొదలు పెట్టినప్పుడు, జయశంకర్ సార్ తన అమూల్యమైన సలహాలు, సూచనలతో అండగా నిలిచారు. ఉద్యమానికి దిశానిర్దేశం చేశారు" అని యాదయ్యగౌడ్ గుర్తు చేసుకున్నారు.తన కుటుంబ జీవితాన్ని సైతం పక్కనపెట్టి, సైద్ధాంతిక నిబద్ధతతో తెలంగాణ ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుడు జయశంకర్ సార్ అని కొనియాడారు. నాటి ఆయన 'అస్తిత్వ' ఆలోచనలు నేటికీ తెలంగాణ ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని అన్నారు.ప్రొఫెసర్ జయశంకర్ సేవలను గుర్తించి, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం నూతన జిల్లాల ఏర్పాటులో భూపాలపల్లి జిల్లాకు ఆయన పేరు పెట్టడం ఎంతో గర్వకారణమని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవ పోరాటానికి ప్రతీక అయిన జయశంకర్ సార్ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సుర్వి యాదయ్యగౌడ్ పిలుపునిచ్చారు.

# నేతాజీ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులకు ఘన విజయం

**18 మందికి ప్రముఖ ఫార్మా కంపెనీల్లో ఉద్యోగాలు**



**చౌటుప్పల్ విశాల భారతి:** మండలంలోని తూఫ్రాన్ పేట్ గ్రామంలో నేతాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ ప్లేస్‌మెంట్స్‌లో మన కళాశాలకు చెందిన మొత్తం 18 మంది విద్యార్థులు దేశంలోని ప్రముఖ ఔషధ సంస్థల్లో ఉద్యోగాలు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచారు.ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ "మా విద్యార్థులు కష్టపడి సాధించిన ఈ విజయం మాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. వారి భవిష్యత్తు ఇంకా ప్రకాశవంతంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం" అని అన్నారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అధ్యాపకులు పూలమాలలతో సత్కరించి అభినందించారు.ప్రిన్సిపాల్ డా. రాజు బత్తుల మాట్లాడుతూ.. "విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే కాదు, వారికి అత్యుత్తమ ఉపాధి అవకాశాలు కల్పించడం మా కళాశాల ప్రధాన లక్ష్యం. పరిశ్రమలతో భాగస్వామ్యం ద్వారా విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందిస్తున్నాం. పోటీ ప్రపంచానికి వారిని సిద్ధం చేస్తున్నాం" అని తెలిపారు.విద్యార్థుల వృత్తి నైపుణ్యాల అభివృద్ధికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు, అలాగే వివిధ పరిశ్రమల ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలు, ఉద్యోగ బాధ్యతలపై అవగాహన సెమినార్లు కూడా త్వరలో 1నిర్వహించనున్నట్లు యాజమాన్యం ప్రకటించింది.ఈ కార్యక్రమం చివర్లో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు మరియు పలు ఫార్మా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్, గద్దర్‌లకు ఘన నివాళులు



**కోదాడ, విశాలభారతి:** కోదాడ పట్టణంలోని ఎమ్మెస్ విద్యా సంస్థలలో ప్రజా చైతన్య వేదిక ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి మరియు ప్రజా యుద్ధనౌక గద్దర్ ప్రథమ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా చైతన్య వేదిక కన్వీనర్ రాయపూడి చిన్ని, ఎమ్మెస్ విద్యా సంస్థల చైర్మన్ పందిరి నాగిరెడ్డి, సీఈఓ ఎస్.ఎస్. రావు మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన మేధోమథనం, తన విప్లవాత్మక పాటలతో ప్రజల్లో ఉద్యమ చైతన్యాన్ని రగిల్చిన గద్దర్ సేవలు ఎప్పటికీ అమూల్యమైనవని కొనియాడారు. అమరుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా చైతన్య వేదిక సభ్యులు జి.ఎల్.ఎన్. రెడ్డి, పి. రాఘవరెడ్డి, ఎన్. హరికిషన్, అప్పిరెడ్డి, నరసింహారావు, బాబు, ఉదయగిరి, రామనర్సయ్య, బానోతు బాబు నాయక్, గోపి రాథోడ్, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ సీపీ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళి



**సైబరాబాద్, విశాల భారతి:** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో గురువారం ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ జయశంకర్ ఆశయాలు, తెలంగాణ కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం అన్ని చర్యలు

**విశాలభారతి పెద్దపల్లి :**



ఓదెల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం రోజున నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ అస్తిత్వాన్ని అక్షరాల్లో ఆవిష్కరించిన వ్యక్తి తెలంగాణ భావజాలాన్ని ప్రజ్వలింపజేసిన చైతన్య దీప్తి తొలి, మలి దశ తెలంగాణ పోరాట చరిత్రకు దిక్సూచి ప్రొ. కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా వారికి ప్రభుత్వ విప్ విజయరమణ రావు స్థానిక నాయకులతో కలిసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ... గ్రామాల్లో ఉన్న సమస్యలు పరిష్కారం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు అవసరానికి మించి యూరియా, డీఏపీ ఎరువులను వినియోగించడం వల్ల భూముల సారవంతత క్రమంగా తగ్గిపోతుందని అన్నారు. గతంలో ఎకరానికి అర బస్తా యూరియా కూడా వినియోగించేవారు కాదని, ప్రస్తుతం అధిక దిగుబడుల ఆశతో విచక్షణారహితంగా ఎరువులు వాడడం భవిష్యత్తులో ప్రమాదకర పరిస్థితులకు దారితీస్తుందని తెలిపారు.గ్రామాల్లో సర్పంచులు, వ్యవసాయ అధికారులు రైతులకు సమతుల్య ఎరువుల వినియోగం, భూసార పరిరక్షణపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.సేంద్రియ వ్యవసాయ పద్ధతులను రైతులు మరింతగా అనుసరించాలని ప్రభుత్వ విప్ కోరారు. రైతు వేదికల ద్వారా ఆధునిక సాగు విధానాలు, ప్రత్యామ్నాయ పంటల సాగు, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై వ్యవసాయ శాస్త్రవేత్తలతో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.గత యాసంగి సీజన్‌లో యాప్ ఆధారిత యూరియా సరఫరా విధానం అమలు చేయడంతో ఎరువుల వినియోగం క్రమబద్ధీకరించబడిందని, భూముల సారం మెరుగుపడి ఎకరానికి 30 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి నమోదైందని గుర్తు చేశారు.ప్రస్తుతం కరువు పరిస్థితులు ఉన్నప్పటికీ ఎస్సారెస్పీకి నీరు క్రమంగా చేరుతోందని తెలిపారు. మహారాష్ట్రలోని ప్రాజెక్టులు ఇప్పటికే 80 శాతానికి పైగా నిండాయని, తెలంగాణకు సాగునీటి విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి త్వరలోనే ఎస్సారెస్పీ కాలువల్లో నీటి విడుదల జరిగేలా చర్యలు తీసుకుంటామని, ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందేలా తాను ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఎస్సారెస్పీ ప్రధాన, ఉప కాలువల్లో నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా అన్ని కాలువలకు వెంటనే బుష్‌క్లియరెన్స్ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నీటి విడుదలకు ముందే కాలువలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని సూచించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత అని ప్రభుత్వ విప్ విజయరమణ రావు గారు స్పష్టం చేశారు. వ్యవసాయ అధికారులు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండి అవసరమైన సలహాలు, సేవలు అందించాలని సూచించారు.ఈ సమావేశంలో ఓదెల ఎంపీడీవో, తహసిల్దార్, మండల పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచులు సింగిల్ విండో చైర్మన్లు, మండల స్థాయి అధికారులు సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల సాధనకు ఉద్యోగులు, విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలి: టాసా



**రాజేంద్రనగర్, విశాల భారతి :**

ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ అసోసియేషన్ (టాసా) ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టాసా ప్రతినిధులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలైన న్యాయం, సమానత్వం, స్వాభిమానం స్ఫూర్తితో విశ్వవిద్యాలయం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న బోధన, పరిశోధన మరియు ఇతర ఉద్యోగుల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని టాసా నాయకులు విజ్ఞప్తి చేశారు. నాణ్యమైన విద్య, పరిశోధన, విస్తరణ కార్యక్రమాల బలోపేతానికి నియామకాలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. అలాగే పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు అందిస్తున్న స్టైపెండ్‌ను కాలానుగుణంగా పెంచి సవరించాలని కోరారు. దీంతో వ్యవసాయ విద్య, పరిశోధనల వైపు యువతను మరింతగా ఆకర్షించవచ్చని అభిప్రాయపడ్డారు. బోధనా సిబ్బందికి చెల్లించాల్సిన పెండింగ్ ఏరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని టాసా ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో అందించడం వారి మనోబలాన్ని పెంపొందించడమే కాకుండా విశ్వవిద్యాలయ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని విశ్వవిద్యాలయ ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితిని 65 సంవత్సరాలకు పెంచాలని కూడా టాసా కోరింది. దీనివల్ల అనుభవజ్ఞులైన అధ్యాపకులు, శాస్త్రవేత్తల సేవలను మరింత కాలం వినియోగించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలకు నిజమైన నివాళి అంటే విశ్వవిద్యాలయంలో విద్య, పరిశోధన, ఉద్యోగుల సంక్షేమం, విద్యార్థుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ సమగ్ర అభివృద్ధి దిశగా అడుగులు వేయడమేనని టాసా ప్రధాన కార్యదర్శి డాక్టర్ సల్లా సౌజన్య అభిప్రాయపడ్డారు.

# జైల్ భరో కార్యక్రమం జయప్రదం చేయండి



**వ్యకాస జిల్లా అధ్యక్షులు పి అంజయ్య ప్రజలకు పిలుపు**

**విశాలభారతి ఇబ్రహీంపట్నం :** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10 తేదీన జరిగే జైల్ బరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యాచారం మండల పరిధిలోని తమ్మాలోని గూడా గ్రామంలో సీనియర్ నాయకులు జంగారెడ్డి, ఏఐఏ డబ్ల్యూయు మాజీ మండల అధ్యక్షులు కె జంగయ్య తో కలిసి కరపత్ర ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పి అంజయ్య మాట్లాడుతూ

**క్విట్ ఇండియా స్ఫూర్తితో**

ఆగస్టు 10 న కలెక్టర్ వద్ద జరిగే జైల్ భరో కార్యక్రమం జయప్రదం చేయాలని,కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఉపాధి కార్మిక, రైతు, చట్టాలను కార్పొరేట్ శక్తులకు అప్పచెప్పే ప్రయత్నం చేస్తుందని , ఎందరో ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న దేశ స్వతంత్రాన్ని విదేశీ సంస్థలకు తాకట్టు పెడుతుందని, ఎర్ర జండాతో పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసే విదంగా మార్పులు చేసింది 2 సార్లు ఫొటో విధానం వచ్చింది. చట్టానికి వున్నా మహాత్మ గాంధీ పేరు తీసివేసి జి రాంజీ 2026 చట్టం తెచ్చి కరువులో కూలీలకు పని లేకుండా చేసి కూలీల నోట్లో మట్టి కొడుతుందని,పాత ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని అన్నారు.బ్రిటిష్ కాలం నాటి కన్నా ముందు కార్మికులకు అండగా వున్నా 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోర్డులు తెచ్చింది. కార్మికులకు హక్కులు లేకుండా చేస్తుందని కార్మికులకు కనీస వేతన 26000 జీతం అమలు చెయడం లేదుని,నూతన వ్యవసాయ చట్టాన్ని తీసుక వచ్చి కార్పొరేట్ శక్తులకు అప్ప చెప్పి తన భూములో తానే కూలి పని చేసుకునే పరిస్థితి వస్తుందని రైతుకు కనీస మద్దతు ధర ఇవ్వడం లేదు. చట్టాల రక్షణ కోసం ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జి లింగం, సత్తయ్య, వెంకటయ్య, రమాదేవి, సత్తమ్మ, రజిని, పాపయ్య పోషయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు నార్సింగిలో ఘనంగా నిర్వహణ



**రాజేంద్రనగర్, విశాల భారతి :**

నార్సింగి సర్కిల్ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి ఆయన సేవలను స్మరించుకున్నారు. జయశంకర్ ఆలోచనలు, సిద్ధాంతాలు తెలంగాణ సమాజంపై చూపిన ప్రభావాన్ని అధికారులు ప్రస్తావించారు. నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జి. లక్ష్మారెడ్డి ప్రొఫెసర్ జయశంకర్ గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన చేసిన అపారమైన కృషిని గుర్తు చేస్తూ, సమాజంలో ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆయన చూపిన మార్గంలో యువత నడిస్తే రాష్ట్ర అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. అనంతరం సర్కిల్ అధికారులు, సిబ్బంది కలిసి జయశంకర్ గారి సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు ఆయన వ్యక్తిత్వం, త్యాగస్ఫూర్తి గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమం గౌరవప్రదంగా, గంభీర వాతావరణంలో నిర్వహించబడింది.

# ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన ఎమ్మెల్యే



**విశాలభారతి హైదరాబాద్ :** రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఐఏఎస్ ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఎమ్మెల్యే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించారు. నియోజకవర్గంలో ప్రతిపాదిత 1×800 మెగావాట్ల పవర్ ప్లాంట్ నిర్మాణం, ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు, రైల్వేలకు సంబంధించిన రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ROBలు) నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం మరియు కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు త్వరితగతిన మంజూరై పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రస్తావించిన అంశాలను సానుకూలంగా పరిశీలించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి అభివృద్ధి పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఒడిశా–నల్గొండ గంజాయి స్మగ్లింగ్ గుట్టురట్టు

- **మరిపెడ పోలీసుల మెరుపు దాడిలో ఐదుగురు అరెస్ట్**
- **రూ.1.12 లక్షల విలువైన 2.240 కిలోల గంజాయి స్వాధీనం**
- **బాలేనో కారు, 4 సెల్‌ఫోన్లు, నగదు జప్తు**



**మరిపెడ, విశాలభారతి:** ఒడిశా నుంచి నల్గొండకు గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ముఠా ఆటను మరిపెడ పోలీసులు భగ్నం చేశారు. పోలీసులను చూసి కారుతో వేగంగా పరారయ్యేందుకు ప్రయత్నించిన ఐదుగురు యువకులను చాకచక్యంగా అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.1.12 లక్షల విలువైన 2.240 కిలోల ఎండు గంజాయి, మారుతీ సుజుకీ బాలేనో కారు, 4 సెల్‌ఫోన్లు, రూ.1,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎల్. పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఐ గండ్రాతి సతీష్ తన సిబ్బంది ఇస్లావత్ రవీందర్, రమేష్, వెంకన్న, డబ్ల్యూపీసీ శాంతతో కలిసి పురుషోత్తమగూడెం బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వేగంగా వచ్చిన బాలేనో కారును ఆపారు. తనిఖీలో డ్రైవర్ సీటు కింద దాచిన 2.240 కిలోల గంజాయి బయటపడింది. అరెస్టైన నిందితులు * గండికోట వంశీ (24), చిత్రం రాకేష్ (22), చింతల తిరుమలేష్ (24), కంచి మహేష్ (25), మాదాసు మహేష్ (26). వీరంతా నల్గొండ జిల్లా కనగల్ మండలానికి చెందినవారని పోలీసులు తెలిపారు. నల్గొండలో సెల్ఫ్ డ్రైవ్‌కు కారు అద్దెకు తీసుకుని ఒడిశాకు వెళ్లి గంజాయి కొనుగోలు చేసి, నల్గొండలో విక్రయించేందుకు తీసుకొస్తుండగా మరిపెడ పోలీసులు వారి అక్రమ రవాణాకు చెక్ పెట్టారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం. గంజాయి విక్రయాలు, రవాణాపై సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడమే కాకుండా తగిన పారితోషికం కూడా అందజేస్తాం" అని సీఐ ఎల్. పవన్ కుమార్ స్పష్టం చేశారు.

# ధర్పల్లిలో అటవీ శాఖ ఆకస్మిక తనిఖీలు



**నిజామాబాద్ జిల్లా విశాల భారతి :** ధర్పల్లి మండలంలోని ధర్పల్లి గ్రామం వడ్డెర కాలనీ, ఆదర్శ్‌నగర్ కాలనీతో పాటు గోవింద్‌పల్లి, సీతాయిపేట్ గ్రామాల్లో ఇందల్వాయి రేంజ్ పరిధిలో డిప్యూటీ రేంజ్ అధికారి తుకారాం రాథోడ్ ఆధ్వర్యంలో అటవీ శాఖ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లను పరిశీలించి అటవీ ఉత్పత్తులు, అని వన్యప్రాణులకు సంబంధించిన అక్రమ నిల్వలు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు లేవని నిర్ధారించేందుకు తనిఖీలు చేపట్టారు. ప్రజలు అటవీ చట్టాలను పాటించాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే అటవీ శాఖకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు.

# సీఐ గూడూరు ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ప్రమాదకర ప్రాంతాల పరిశీలన

**ప్రమాదాల నివారణకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం**



**విశాల భారతి గూడూరు :** గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని భూపతిపేట గ్రామం నుండి బొదుగొండ గ్రామం వరకు జాతీయ రహదారిపై తరచూ చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు నేడు సీఐ గూడూరు ఆధ్వర్యంలో, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (MVI) మరియు డిప్యూటీ ఇంజనీర్, నేషనల్ హైవేస్ సంయుక్తంగా ప్రమాదకర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రమాదాలు అధికంగా సంభవిస్తున్న ప్రాంతాలను గుర్తించి, వాటికి గల కారణాలను విశ్లేషించారు. ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు, స్పీడ్ నియంత్రణ చర్యలు, రోడ్డు భద్రతా మార్కింగ్‌లు, రిఫ్లెక్టర్లు, అవసరమైన ఇంజనీరింగ్ మార్పులు తదితర అంశాలపై సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని కార్యాచరణ ప్రణాళిక (Action Plan) సిద్ధం చేయాలని నిర్ణయించారు. అదేవిధంగా గూడూరు సెంటర్‌లో ట్రాఫిక్ పరిస్థితిని పరిశీలించి, ట్రాఫిక్ రద్దీని తగ్గించి రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రౌండబౌట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించి, సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల సమన్వయంతో సమర్థవంతమైన చర్యలు చేపట్టి ప్రజలకు సురక్షిత ప్రయాణ వాతావరణం కల్పించేందుకు గూడూరు పోలీసులు కట్టుబడి ఉన్నారని సీఐ గూడూరు తెలిపారు.

# ఆగస్టు 10లోగా ఎస్ఐఆర్ పూర్తి చేయండి

- **శేరిలింగంపల్లిలో ఈఆర్వో నారాయణ్ అమిత్ ఆధ్వర్యంలో అఖిల పక్ష సమావేశం**
- **రాజకీయ పార్టీల సూచనల మేరకు పారదర్శక చర్యలు**

**శేరిలింగంపల్లి-విశాల భారతి**



ప్రత్యేక ఓటర్ల ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఆగస్టు 10లోగా పూర్తి చేయాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్వో), జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి జోన్ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం నిర్వహించిన సర్వపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని అసిస్టెంట్ ఎన్నికల నమోదు అధికారులు (ఏఈఆర్వోలు)తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు.కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక ఓటర్ల ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం ఈనెల 10వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో ఇప్పటివరకు నమోదైన పురోగతిని సమీక్షించారు. తుది గడువు సమీపిస్తున్నందున కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణలు, మార్పులుచేర్పుల ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటర్ల జాబితాలో నమోదు చేయాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన పలు సూచనలు, అభిప్రాయాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై స్పందించిన ఈఆర్వో నారాయణ్ అమిత్, రాజకీయ పార్టీల సూచనలను సానుకూలంగా పరిగణించి, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా తదుపరి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించడంలో అధికారులు, రాజకీయ పార్టీలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా అందరూ బాధ్యతాయుతంగా సహకరించాలని సూచించారు.

## కవిత సభకు శేరిలింగంపల్లి నుంచి భారీగా తరలిన శ్రేణులు

**వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో వెయ్యి మందితో ర్యాలీ**



**శేరిలింగంపల్లి విశాల భారతి:** సామాజిక తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా టీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సామాజిక తెలంగాణ సంకల్ప సభ ' గురువారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగింది. పార్టీ నాయకురాలు కల్వకుంట్ల కవిత పిలుపు మేరకు చేపట్టిన ఈ సభకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి పార్టీ ఇంచార్జ్ వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ నేతృత్వంలో సుమారు వెయ్యి మంది ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు.సభలో ప్రసంగించిన కవిత బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు, అగ్రవర్ణ పేదలకు సామాజిక న్యాయం అందించడమే టీఆర్ఎస్ లక్ష్యమని చెప్పారు. తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా సామాజిక న్యాయ ఉద్యమాన్ని విస్తరిస్తామని ప్రకటించారు. ప్రతి జిల్లాలో సామాజిక తెలంగాణపై సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అస్లాం, దయానంద్, కుమార్, విష్ణు, మురుగేసన్, ప్రవీణ్, సూర్యప్రకాష్, యాదగిరి, రాంభూపాల్ రెడ్డి, స్వామి గౌడ్, వలి, చందు, అసిఫ్, లక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే పిల్లలకు మొదటి టీకా సిడిపిఓ వినీత దేవి తులసి



**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** యాచారం మండల పరిధిలోని తాడిపర్తి గ్రామంలో గురువారం తల్లి పాలు వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిడిపిఓ వినిత దేవి, ఐ సి డి ఎస్ సూపర్వైజర్ తులసి గ్రామ సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్ హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలే పిల్లలకు మొదటి టీకా అని గుర్తు చేశారు. తల్లిపాల వారోత్సవాలు ఆగస్టు ఒకటి నుండి ఏడవ తారీకు వరకు నిర్వహిస్తామని అన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు తొలి ఆరు నెలలు తల్లిపాలు శిశువులకు ఉత్తమ ఆహారమని తెలిపారు. శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదల నిరోధక శక్తిని పెంపొందించేందుకు తల్లి శిశువు అనుబంధాన్ని బలోపేతం చేయడానికి తల్లిపాలే శిశువుకు మొదటి టీకా, సంపూర్ణ ఆహారమని మహిళలకు వీటి పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు వెంకటమ్మ, అంగన్వాడీ టీచర్స్, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలి

**మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్**



**సికింద్రాబాద్, విశాల భారతి :** ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా అంబర్ నగర్ సీతారామ ఆలయం నుండి అమ్మవారి ఘటాల ఊరేగింపును అత్యంత భక్తి శ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. ప్రమోద్ ఆధ్వర్యంలో బయలుదేరిన ఘటాల ఊరేగింపు బస్తీలోని ప్రధాన వీధుల గుండా సాగింది. మహిళలు సంప్రదాయ దుస్తులలో బోనాలు, ఘటాలు తలపై పెట్టుకొని, భజనలు, డప్పు చప్పుళ్ల మధ్య అమ్మవారికి జైజైలు పలుకుతూ ఊరేగించారు.ఈ ఊరేగింపులో మాజీ కార్పొరేటర్ శ్రీమతి స్వరూప గౌడ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరూప గౌడ్ మాట్లాడుతూ, "ఆషాడ మాసం అంటే బోనాల పండుగ, అమ్మవారి జాతర. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ఇలాంటి ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకోవాలని స్వరూప గౌడ్ న్నారు.

## ఘనంగా జాతీయ ప్రజా సంబంధాల విద్యా దినోత్సవ వేడుకలు



**హైదరాబాద్, విశాలభారతి:** చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్‌లో 'జాతీయ ప్రజా సంబంధాల విద్యా దినోత్సవం' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇన్స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో పీఆర్ విద్య ప్రాముఖ్యతపై ప్రత్యేక సెమినార్, అతిథి ఉపన్యాస కార్యక్రమం చేపట్టారు. ఐఐసీ వింగ్ సలహాదారు ప్రొఫెసర్ వి. బార్లా కన్వీనర్‌గా, సీబీఐటీ పీఆర్ఓ డా. జి. ఎన్. ఆర్. ప్రసాద్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమానికి పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు డా. అజిత్ పాఠక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి డిజిటల్ యుగంలో పీఆర్ విద్య అత్యంత కీలకమని, ఇది కేవలం మీడియా నిర్వహణే కాకుండా సంస్థ ప్రతిష్ఠను, విశ్వసనీయతను పెంపొందించే వ్యూహాత్మక రంగమని తెలిపారు. విద్యార్థులు కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. పీఆర్ఎస్ఐ ఎడిటర్ శ్రీ బాబ్జీ ముఖ్యోపన్యాసం చేస్తూ.. కృత్రిమ మేధస్సు , డిజిటల్ మీడియా వంటి ఆధునిక సాంకేతికతలను పీఆర్ రంగంలో సమర్థవంతంగా వాడాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ , ప్రభుత్వ, విద్యా రంగాల్లో పీఆర్ నిపుణులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని చెప్పారు. సీబీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. వి. నరసింహులు మాట్లాడుతూ.. సమర్థవంతమైన కమ్యూనికేషన్, పారదర్శకతే విద్యాసంస్థల ప్రతిష్ఠకు బలమైన పునాదులని పేర్కొన్నారు. సెమినార్‌లో పాల్గొన్న విద్యార్థులు వక్తలతో చర్చలు జరిపి పీఆర్ రంగంలోని తాజా పోకడలు, ఉపాధి అవకాశాలపై అవగాహన పొందారు. యువతలో బాధ్యతాయుతమైన సమాచార ప్రసారంపై చైతన్యం తెచ్చేలా సాగిన ఈ కార్యక్రమం అధ్యాపకులు, విద్యార్థుల విశేష స్పందనతో విజయవంతంగా ముగిసింది.

## సరికొత్త చరిత్ర సృష్టించిన చీర్స్ గ్రూప్

**అంతర్జాతీయ స్థాయిలో 400 అవార్డుల మైలురాయిని దాటిన గోవా విస్కీ బ్రాండ్**




**విశాలభారతి:** విశ్వవ్యాప్తంగా భారతీయ లగ్జరీ స్పిరిట్స్ రంగంలో గోవాకు చెందిన ప్రముఖ 'చీర్స్ గ్రూప్' సరికొత్త చరిత్ర సృష్టించింది. ప్రపంచ స్థాయి విలాసవంతమైన స్వచ్ఛమైన సింగిల్ మాల్ట్ విస్కీలు మరియు బ్లెండెడ్ విస్కీలను ఉత్పత్తి చేస్తూ ఈ సంస్థ తాజాగా 400కు పైగా జాతీయ, అంతర్జాతీయ అవార్డుల మైలురాయిని విజయవంతంగా అధిగమించింది. డాక్టర్ మోహన్ కృష్ణ బలివాడ స్థాపించిన ఈ సంస్థకు, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం మాజీ విద్యార్థి అశ్విన్ బలివాడ సీఈఓగా వ్యవహరిస్తూ అద్భుతమైన వృద్ధిని సాధిస్తున్నారు. గోవా వేదికగా అత్యంత అధునాతన డిస్టిలేషన్, మెచ్యూరేషన్ కార్యకలాపాలను నిర్వహిస్తున్న ఈ గ్రూప్.. ఎలాంటి కృత్రిమ ఫ్లేవర్ సంకలితాలు కలపకుండా, కేవలం ఏజ్డ్ మాల్ట్ స్పిరిట్‌స్‌ను ఎక్స్‌ట్రా న్యూట్రల్ గ్రెయిన్ స్పిరిట్‌స్‌లో మాత్రమే జోడించి నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తోంది. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో (ఏప్రిల్ జూన్) చీర్స్ గ్రూప్ అసాధారణ ప్రతిభ కనబరిచింది. ఈ ఒక్క త్రైమాసికంలోనే ఏకంగా 34 అవార్డులను కైవసం చేసుకుంది. చికాగో బార్టెండర్ స్పిరిట్స్ అవార్డ్స్ 2026లో కదంబ సింగిల్‌మాల్ట్, త్రీ మంకీస్ సింగిల్‌మాల్ట్, మాల్టేజ్ ఏజ్డ్ మాల్ట్ విస్కీ, డోబర్‌మాన్ ప్రీమియం విస్కీలు స్వర్ణ పతకాలను సాధించి ప్రపంచంలోని అత్యుత్తమ భారతీయ విస్కీలుగా నిలిచాయి. అలాగే ప్రముఖ జాన్ బార్లీకార్న్ అవార్డ్స్ లో ప్రధాన బ్రాండ్ అయిన 'కదంబ సింగిల్ మాల్ట్' డబుల్ గోల్డ్ గెలుచుకోవడంతో పాటు "బెస్ట్ వరల్డ్ విస్కీ"గా ఎంపికైంది. దీంతో పాటు IWSC స్పిరిట్స్ అవార్డ్స్‌లో 6, చికాగో పోటీలో 11, లండన్ స్పిరిట్స్ అవార్డ్స్‌లో 10, ఇంటర్నేషనల్ స్పిరిట్స్ ఛాలెంజ్‌లో 4, అమెరికన్ కౌన్సిల్, శాన్ ఫ్రాన్సిస్కో వేదికలపై ఒక్కో పతకంతో పాటు 2026 మోండే సెలెక్షన్ గోల్డ్ క్వాలిటీ అవార్డును సొంతం చేసుకుంది. గోవా తీరప్రాంత ప్రత్యేక వాతావరణం, హ్యూమిడిటీ ఏజింగ్ పద్ధతిలో తయారవుతున్న కదంబ విస్కీ సిరీస్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేలాది ఎంట్రీలను వెనక్కి నెట్టి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. "వినియోగదారులకు షెల్ఫ్‌లో వివిధ బ్రాండ్లు కనిపిస్తున్న తరుణంలో, విశ్వసనీయ వేదికల నుండి లభించే అవార్డులు మరియు పతకాలు వారికి నమ్మకమైన మార్గదర్శిగా నిలుస్తాయి" అని చీర్స్ గ్రూప్ సీఈఓ అశ్విన్ బలివాడ పేర్కొన్నారు. ఆవిష్కరణలు, నాణ్యత, నైపుణ్యంపై అచంచలమైన నిబద్ధత చూపుతున్న చీర్స్ గ్రూప్.. ఈ మైలురాళ్లతో భారత దేశ లగ్జరీ స్పిరిట్స్ మార్కెట్‌లో తన ఆధిపత్యాన్ని మరింత బలోపేతం చేసుకుంది.

## విద్యుత్ సిబ్బంది భద్రతకు పెద్దపీట.. సేఫ్టీ కిట్ల పంపిణీ




- **సీఎంసీ కమిషనర్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ చేతుల మీదుగా పంపిణీ**
- **ప్రజా సేవల్లో సిబ్బంది భద్రతే తొలి ప్రాధాన్యమని వెల్లడి**


**సైబరాబాద్ - విశాల భారతి**

ప్రజలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సేవలు అందిస్తున్న ఫీల్డ్ సిబ్బంది భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ సీఎంసీ ఆధ్వర్యంలో విద్యుత్ విభాగం సిబ్బందికి సేఫ్టీ కిట్లను పంపిణీ చేశారు. పిఎసి చైర్మన్ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, సీఎంసీ కమిషనర్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ సంయుక్తంగా ఈ కార్యక్రమంలో పాల్గొని సిబ్బందికి భద్రతా కిట్లను అందజేశారు.ఈ సందర్భంగా పిఎసి చైర్మన్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ ప్రజలకు విద్యుత్ సేవలను అందించడంలో ఫీల్డ్ సిబ్బంది కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. వర్షం, ఎండ, రాత్రి, పగలు అనే తేడా లేకుండా అత్యవసర పరిస్థితుల్లోనూ విధులు నిర్వహించే ఉద్యోగుల భద్రతను కాపాడటం ప్రతి సంస్థ బాధ్యత అని పేర్కొన్నారు. సిబ్బంది సురక్షితంగా విధులు నిర్వహించేందుకు అవసరమైన అన్ని రకాల భద్రతా పరికరాలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.సీఎంసీ కమిషనర్ గుమ్మల శ్రీజన మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమంతో పాటు వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఫీల్డ్‌లో విద్యుత్ మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టే సమయంలో ప్రమాదాలను తగ్గించేందుకు ఈ సేఫ్టీ కిట్లు ఉపయోగపడతాయని చెప్పారు. వ్యక్తిగత రక్షణ పరికరాలను తప్పనిసరిగా వినియోగిస్తూ భద్రతా నిబంధనలను పాటించాలని సిబ్బందికి సూచించారు.శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే ముందుగా ఉద్యోగులు సురక్షితంగా ఉండాలని అన్నారు. ఈ సేఫ్టీ కిట్లు ఫీల్డ్ సిబ్బందిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు ప్రమాదాలను నివారించడంలో కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ భద్రతా కిట్లలో విద్యుత్ పనులకు అవసరమైన వ్యక్తిగత రక్షణ సామగ్రి ఉండటంతో ఫీల్డ్ సిబ్బంది మరింత భద్రంగా, సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు వీలు కలుగుతుందని అధికారులు తెలిపారు. ప్రజలకు అత్యవసర సేవలను వేగంగా, నాణ్యంగా అందించడమే లక్ష్యంగా ఇలాంటి ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సీఎంసీ విద్యుత్ విభాగం అధికారులు, ఇంజినీర్లు, సూపర్‌వైజర్లు, ఫీల్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి పీర్జాదిగూడ స్మశాన వాటికలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి: తుంగతుర్తి రవి

**మేడిపల్లి విశాల భారతి**

మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్‌ల పరిధిలోని స్మశాన వాటికల్లో పరిశుభ్రతతో పాటు తాగునీరు, విద్యుత్, లైటింగ్ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని కోరుతూ గురువారం మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్‌వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి వినతిపత్రం అందజేశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా స్మశాన వాటికల నిర్వహణను మరింత మెరుగుపరచాలని, ఈ సమస్యలపై అధికారులు తక్షణ చర్యలు తీసుకుని మెరుగైన సేవలు అందించాలని తుంగతుర్తి రవి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో సుదర్శన్ రెడ్డి, నాగరాజు, సాయిరాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు





## సరస్వతీ శిశు మందిర్‌లో ఘనంగా బోనాలు – గోరింటాకు సంబరాలు

**ఆదిలాబాద్ జిల్లా, ఆగస్టు 7 ( విశాల భారతి న్యూస్):** ఇచ్చోడ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ఆషాఢ మాసం సందర్భంగా బోనాల పండుగ, గోరింటాకు సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు బోనాల కుండల్లో నైవేద్యం సిద్ధం చేసి అమ్మవారికి సమర్పించగా, అమ్మవారు-పోతురాజు వేషధారణలో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.ముఖ్య అతిథి విశ్రాంత ఉపాధ్యాయులు అంగ రాజేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతి, భారతీయ సంప్రదాయాలపై అవగాహన పెంపొందించడం శిశు మందిర్ పాఠశాలల ప్రత్యేకత అని పేర్కొన్నారు. ప్రధానాచార్యులు సంతోష్ కుమార్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే విద్యార్థులకు రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బోనాల పండుగ విశిష్టత, నైవేద్యాల తయారీ విధానం, అమ్మవారు-పోతురాజు పాత్రలతో పాటు గోరింటాకు వెనుక ఉన్న శాస్త్రీయ ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పోషకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తల్లి పాలే శిశువుకు తొలి రక్షణ

**సర్పంచ్ నీలాసైదులు**



**మరిపెడ, విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గిరిపురం అంగన్వాడీ కేంద్రంలో గురువారం తల్లి పాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు తల్లి పాల ప్రాధాన్యతను వివరించారు. పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. తొలి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాదావత్ నీలా సైదులు, పాఠశాల ఉపాధ్యాయులు లింగయ్య, కృష్ణవేణి, చైతన్య, అంగన్వాడీ టీచర్లు ఉమ రాధ, సుశీల, ఆశా వర్కర్లు వినోదం, కవిత, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు. తల్లిపాల వల్ల తల్లి, బిడ్డ ఇద్దరికీ కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించి, ప్రతి తల్లి శిశువుకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని పిలుపునిచ్చారు.

## బాధ్యతలు స్వీకరించిన ఇంచార్జి కలెక్టర్ భవేష్ మిశ్రా

**స్వాగతం పలికిన అదనపు కలెక్టర్, అధికారులు**



**నిజామాబాద్ జిల్లా విశాల భారతి:** నిజామాబాద్, ఆగస్టు 06 : నిజామాబాద్ జిల్లా ఇంచార్జి కలెక్టర్ గా భవేష్ మిశ్రా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయం 10.45 గంటల సమయంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్దకు చేరుకున్న ఇంచార్జి కలెక్టర్ ను అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత తదితరులు సాదరంగా స్వాగతం పలికారు. నేరుగా తన చాంబర్ కు చేరుకున్న కలెక్టర్ అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కలెక్టర్ ను వివిధ శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం అధికారులతో సమావేశమై వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు.

## పెద్దమడూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం



**దేవరుప్పుల విశాల భారతి :** మండలంలోని పెద్దమడూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం గర్భిణులు, బాలింతలు, తల్లులు, అత్తల కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పెద్దమడూర్ సర్పంచ్ పానుగంటి గిరి, ఉపసర్పంచ్ చంద్రగిరి సంపత్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు హాజరయ్యారు.ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, తల్లులు, అత్తలకు గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమతుల్య ఆహారం తీసుకోవడం, తల్లి-శిశు ఆరోగ్య సంరక్షణ, సమయానికి టీకాలు వేయించుకోవడం, పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గర్భిణులు, బాలింతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మొండిగౌరెల్లిలో భూముల రీసర్వే ప్రారంభం



**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** యాచారం మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో సర్వే నంబర్ 127, 19, 68 పరిధిలోని అసైన్డ్ భూములపై గురువారం రెవెన్యూ అధికారులు సమగ్ర రీసర్వేను ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ కోలన్ రమాదేవి, పాలకవర్గ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి, స్థానిక తహసీల్దార్ అయ్యప్పలతో కలిసి క్షేత్రస్థాయిలో సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, 1972 నుంచి ఇప్పటివరకు జరిగిన భూ కేటాయింపులు, ప్రస్తుత సాగు వివరాల రికార్డులను పారదర్శకంగా సరిపోల్చి చూస్తున్నామని తెలిపారు. నకిలీ పత్రాలు సృష్టించి భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అర్హులైన అసలైన పేద రైతులకు పూర్తి న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నర్కుడలో ఘనంగా బోనాల ఏర్పాట్లు – గ్రామంలో పండుగ సందడి



**రాజేంద్రనగర్, విశాల భారతి :** శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలో ఆషాడమాస బోనాల మహోత్సవాల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆదివారం జరగనున్న ఈ ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు జోరుగా కొనసాగుతున్నాయి. గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ నాయకత్వంలో గ్రామంలోని అమ్మవారి దేవాలయాలన్నింటిని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు విద్యుత్ దీపాలతో ప్రకాశవంతంగా తీర్చిదిద్దుతున్నారు. రహదారుల మరమ్మత్తులు, పరిశుభ్రత పనులు, దేవాలయ పరిసరాల సుందరీకరణ చేపట్టి గ్రామాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ స్థాయిలో బోనాల ఏర్పాట్లు జరగకపోవడంతో, ఈసారి ప్రత్యేక శ్రద్ధతో చేపట్టిన ఏర్పాట్లు గ్రామ ప్రజల్లో ఆనందాన్ని నింపుతున్నాయి. దేవాలయాల వద్ద భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంపై గ్రామస్తులు సర్పంచ్‌ను అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని పనులను సమయానికి పూర్తి చేయాలని అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# 20 రోజులుగా తాగునీరు బంద్

- మరమ్మతులకు గురైన పైప్ లైన్
- సిసి రోడ్డుకు సైడ్ బర్మ్ పోస్తున్న తరుణంలో పైప్ డ్యామేజ్

**అశ్వాపురం, విశాల భారతి :**



ఓ కాంట్రాక్టర్ నిర్లక్ష్య పనులకు సుమారు 70 నివాసాల వారు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తాగునీరుకి ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాల మీదుగా అంబేద్కర్ నగర్ గ్రామానికి భార జల కర్మాగారం వారు సుమారు రూ. 5 లక్షల వ్యాయంతో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు పైప్లైన్ ఏర్పాటు చేశారు. అయితే కళాశాలకు వెళ్లే దారికి సిసి రోడ్డు నిర్మాణం చేపట్టిన ఓ కాంట్రాక్టర్ రోడ్డు సైడ్ బర్మ్కు ఇతర ప్రాంతాల నుంచి నాణ్యమైన గ్రావెల్ను తీసుకొచ్చి పోయాల్సి ఉన్నప్పటికీ సిసి రోడ్డుకు తహసిల్దార్ కార్యాలయానికి మధ్యన ఉన్న రెండు మీటర్ల వెడల్పు భాగంలోనే జెసిబి యంత్రంతో భారీ కందకాన్ని పెట్టి మట్టి పోశాడు. సైడ్ బర్మ్కు కందకం తీస్తున్న తరుణంలో తహసిల్దార్ కార్యాలయానికి వెళుతున్న పైప్ లైన్ మరమ్మత్తులకు గురైంది. అయినప్పటికీ సదరు కాంట్రాక్టర్ పైప్లైన్ ను పట్టించుకోకుండా నిర్లక్ష్య ధోరణితో తన పనిని నామమాత్రంగా ముగించుకొని వెళ్ళిపోయాడు. దీంతో అంబేద్కర్ నగర్ గ్రామ ప్రజలతోపాటు పక్కనే ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నెల రోజుల నుండి తాగునీటి సమస్య తీవ్రతరమైంది. సీసీ రోడ్డుకు సైడ్ బర్మ్ కోసం తీసిన కందకం సుమారు మీటర్ లోతు, వెడల్పు ఉండడంతో పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలిచాయి. పైపులైనుకు మరమ్మత్తులు చేసేందుకు పెద్ద మొత్తంలో నీరు నిల్వ ఉండడంతో గౌతమీ నగర్ కాలనీ నుండి వస్తున్న తాగునీరు పైప్ లైన్ లీకేజీ అవడంతో అధికారులు నీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో గ్రామస్తులతో పాటు కళాశాల విద్యార్థులు తాగునీటికి తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఓ పక్కన విద్యార్థులు స్థానికులు తాగునీటికి అవస్థలు పడుతున్నప్పటికీ స్థానిక పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధం శాఖల అధికారులు మరమ్మత్తులు చేసి తాగునీటిని పునరుద్ధరించాలని విద్యార్థులు, అంబేద్కర్ నగర్ వాసులు కోరుతున్నారు.

## తెలంగాణ సిద్ధాంతకర్తకు ఘన నివాళి

**జయశంకర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న డా. వీరమల్ల రామ్ నరసింహ గౌడ్**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఎల్బీనగర్ లో మహనీయుల చౌరస్తాలో గురువారం ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకుడు, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ వీరమల్ల రామ్ నరసింహ గౌడ్ పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ నాయకులు సాల్వచారి, రాజు గౌడ్, శ్యామ్ సుందర్ రెడ్డి తదితరులతో కలిసి జయశంకర్ సార్ సేవలను స్మరించుకున్నారు.అనంతరం డాక్టర్ వీరమల్ల రామ్ నరసింహ గౌడ్ మాట్లాడుతూ..ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అందించిన సిద్ధాంతపరమైన బలం, ఉద్యమానికి చూపిన దిశ ఎప్పటికీ చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ కోసం ఆయన చేసిన త్యాగం, కృషి, నిబద్ధత భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.తెలంగాణ చరిత్ర ఉన్నంత కాలం ప్రొఫెసర్ జయశంకర్ సార్ పేరు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుందని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని డాక్టర్ వీరమల్ల రామ్ నరసింహ గౌడ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు తెలంగాణ ఉద్యమ నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయశంకర్ సార్కు ఘనంగా నివాళులర్పించారు.

## గ్యారల శ్రీనివాస్ గౌడ్కు ఏపూరి ఆహ్వానం

**ఏపూరి 25 ఏండ్ల పాటల ప్రవాహం పుస్తకావిష్కరణ సభకు హాజరుకావాలని ఆత్మీయ ఆహ్వానం**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రభుత్వ సాంస్కృతిక సలహా మండలి సభ్యులు, బహుజన యుద్ధనౌక డా. ఏపూరి సోమన్న బుధవారం కుంట్లూర్లోని తన క్యాంపు కార్యాలయంలో మాజీ కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్ గౌడ్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈ నెల 13న హైదరాబాద్లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్న "ఏపూరి 25 ఏండ్ల పాటల ప్రవాహం" పుస్తకావిష్కరణ సభకు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్యారల శ్రీనివాస్ గౌడ్కు డా. ఏపూరి సోమన్న ఆత్మీయంగా ఆహ్వానం అందజేశారు. సాహిత్యం, పాటల ద్వారా సామాజిక చైతన్యాన్ని విస్తృతంగా వ్యాప్తి చేసిన తన 25 ఏళ్ల ప్రయాణాన్ని ఆవిష్కరించే ఈ ప్రత్యేక కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, సాహితీవేత్తలు, కళాకారులు, సామాజిక కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డా. ఏపూరి సోమన్న కోరారు. ఈ భేటీ ఆత్మీయ వాతావరణంలో సాగగా, పుస్తకావిష్కరణ సభ విజయవంతం కావాలని గ్యారల శ్రీనివాస్ గౌడ్ ఆకాంక్షించారు.

## ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి సందర్భంగా ఘన నివాళులు



**రాజేంద్రనగర్, విశాల భారతి:** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆడిటోరియంలో లేట్ ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ గారి 92వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ , రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి గారితో కలిసి జయశంకర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి ప్రేరణగా నిలిచిన మహనీయుడైన ప్రొఫెసర్ జయశంకర్ సేవలను స్మరించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన అచంచలమైన అంకితభావం, విద్య, సామాజిక న్యాయం, ప్రజాసేవ పట్ల చూపిన నిబద్ధత ఎంతో గొప్పదని కొనియాడారు. ఆయన దార్శనికత మెరుగైన తెలంగాణ నిర్మాణానికి మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వై. శ్రీధర్ , కొమరయ్య , శేఖర్ ముదిరాజ్ గారు, వెంకటేష్, సంతు గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, బాబురావు, పవన్ సాయి, లంకల సాయి, వెంకటరెడ్డి, అమర్ రెడ్డి, వేణుగోపాల్, దయానంద రెడ్డి, రమేష్ తదితరులు, యూనివర్సిటీ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



**మొయినాబాద్ ఆగస్టు 6(విశాలభారతి):** ప్రొఫెసర్ ఆచార్య జయశంకర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. మొయినాబాద్ మండల విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జయంతి కార్యక్రమంలో ఆయన జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాధనలో జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాంపల్లి సంతోష్కుమార్ చారి, ఉపాధ్యక్షుడు దర్శన్ చారి కమ్మరి శ్రీనివాస్ చారి కొంపల్లి అనంతరెడ్డి తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## కుర్మిద్ద ఉన్నత పాఠశాలకు అమెజాన్ సంస్థ నుంచి ఐదు ల్యాప్ టాప్ లు అందజేత




**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** యాచారం మండలం పరిధిలోని కుర్మిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సామాజిక బాధ్యతలో భాగంగా అమెజాన్ సంస్థ ఐదు ల్యాప్టాప్లను అందజేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నీలం శ్రీవిద్య శ్రీరాములు పాల్గొని ల్యాప్టాప్లను పాఠశాలకు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అమెజాన్ సంస్థ అందించిన ల్యాప్టాప్ల ద్వారా విద్యార్థులు డిజిటల్ విద్యలో మరింత నైపుణ్యం సాధించి, పోటీ ప్రపంచానికి సిద్ధమవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్ నాయక్ పాల్గొని, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని విలువైన సహకారం అందించిన అమెజాన్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ల్యాప్టాప్లను విద్యార్థుల విద్యా అవసరాలు, కంప్యూటర్ విద్య డిజిటల్ లెర్నింగ్ కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు పాఠశాల బృందం వెల్లడించాయి.

## జయశంకర్ ఆశయసాధనే నిజమైన నివాళి

**డీసీ చాముండేశ్వరి ఆధ్వర్యంలో ఆల్విన్ కాలనీ సర్కిల్లో జయంతి వేడుకలు**

**సైబరాబాద్ విశాల భారతి :** తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ ప్రేరణ, ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ఆల్విన్ కాలనీ సర్కిల్ 51కార్యాలయంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది కలిసి జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా డీసీ చాముండేశ్వరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి జయశంకర్ అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.

## హక్కుల కోసం జైల్ భరో



- ఆగస్టు 10 ఉద్యమంలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని చంద్రమోహన్ పిలుపు

**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఐక్యంగా పోరాడి తమ హక్కులను కాపాడుకోవాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ పిలుపునిచ్చారు. ఈ నెల 10న నిర్వహించే జైల్ భరో ఉద్యమాన్ని క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో విజయవంతం చేయాలని ఆయన అన్నారు. అబ్దుల్లాపూర్మెట్ మండలంలోని వైఎస్ఆర్ గార్డెన్లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన చంద్రమోహన్ మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా జరుగుతున్న పోరాటాల్లో ప్రతి కార్మికుడు, రైతు, కూలీ భాగస్వామి కావాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని భావిస్తున్న నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల హక్కులను బలహీనపరిచేలా ఉన్నాయని, ఉద్యోగ భద్రత, వేతనాలు, సంక్షేమ చట్టాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించుకోవాలంటే ఐక్య పోరాటమే మార్గమని పేర్కొన్న ఆయన, క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమంలో కార్మికులు, రైతులు, కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు భాస్కర్ రెడ్డి, సీఐటీయూ నాయకులు గుండె శివకుమార్, బాలరాజు గౌడ్, ముత్యాలు, శ్రీశైలం, ఉషయ్య, మైసయ్య పాల్గొన్నారు.

## శ్రీ సంజీవని సహకార సంఘం డైరెక్టర్లు ఏకగ్రీవ ఎన్నిక



**సికింద్రాబాద్, విశాల భారతి :**

సికింద్రాబాద్ పార్సీగుట్ట లో శ్రీ సంజీవని పరస్పర సహాయక సహకార పొదుపు, పరపతి సంఘం లిమిటెడ్ నూతన డైరెక్టర్ల మండలి ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన నామినేషన్ల దాఖలు ముగిసింది. తొమ్మిది డైరెక్టర్ పదవులకు గాను మొత్తం తొమ్మిది మంది సభ్యులు మాత్రమే సాయంత్రం వరకు నామినేషన్ పత్రాలు దాఖలు చేయడంతో ఎన్నికల నిబంధనల ప్రకారం వారందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఏ.ఎస్. భాస్కర్ గిరి ప్రకటించారు. ఈ నామినేషన్ పత్రాలు, ప్రతిపాదకుల వివరాలను పరిశీలించిన అనంతరం ఎన్నికైన డైరెక్టర్లుగా సాయ దత్తానందం, కె. భాస్కర్ గౌడ్, జక్క శ్రీహరి బాబు, బిట్ల శ్రీనివాస్ రెడ్డి, హనుమండ్ల బాబురావు, ఎస్. రామ్కిషోర్, మెరోజు జ్యోతి, కె. సాగరిక, కె. శ్రావణి పేర్లను అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి ఏ.ఎస్. భాస్కర్ గిరి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. డైరెక్టర్లుగా తమ బాధ్యతలను నిబద్ధత, నిజాయితీ, పారదర్శకత, సేవాభావంతో నిర్వహిస్తూ సంఘ అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి విశేష కృషి చేయాలని సూచించారు. అలాగే నేడు నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు సంఘ అధ్యక్షుడితో పాటు ఎనిమిది మంది సభ్యులతో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన అడాక్ కమిటీ సభ్యులకు, హైదరాబాద్ జిల్లా డీసీఓ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల ప్రక్రియలో సంఘ వ్యవస్థాపక సభ్యుడు పీ. యాదగిరి, కె. నాగ సాయితో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## హైదర్షా కోట్ జెడ్పిహెచ్ఎస్లో హెచ్పీవీ టీకా శిబిరం విజయవంతం

**100 మంది విద్యార్థినులకు టీకాలు – గర్భాశయ క్యాన్సర్పై అవగాహన**

**రాజేంద్రనగర్, విశాల భారతి :**

డిప్యూటీ డీఎంహెచ్వో డా. రాకేష్ సూచనల మేరకు, యూపీహెచ్సీ నార్సింగి ఆధ్వర్యంలో హైదర్షాకోటలోని జెడ్పీ హెచ్ఎస్ మరియు శ్రీనిధి స్కూల్ల లో హెచ్పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 100 మంది విద్యార్థినులకు హెచ్పీవీ టీకాలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని వైద్యాధికారులు డా. శ్రీదేవి, డా. సంధ్య ఆధ్వర్యంలో నిర్వహించగా, డా. అనుష్, డా. గాయత్రి, సూపర్వైజర్ అమ్తుల్, ఏఎన్ఎంలు అమృత, స్వాతి, స్వప్న, ఆశా కార్యకర్త అరుణ పాల్గొన్నారు. విద్యార్థినులకు టీకాలు ఇవ్వడంతో పాటు, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో హెచ్పీవీ టీకా ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, హెచ్పీవీ టీకా తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో వచ్చే క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. బాలికలు సమయానికి ఈ టీకా తీసుకోవడం ఎంతో ముఖ్యమని సూచించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు జెడ్పీ హెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు బి. కవిత, ఉపాధ్యాయురాలు రాజితతో పాటు ఇతర ఉపాధ్యాయ సిబ్బంది, అలాగే శ్రీనిధి స్కూల్ ప్రిన్సిపాల్ అనిత సహకారం అందించారు.



## నార్సింగి పోలీస్ స్టేషన్ ఎదుట ఉద్రిక్తత

**రూపా రెడ్డిని అరెస్ట్ చేయాలంటూ బాధితుల భారీ ఆందోళన**




**రాజేంద్రనగర్, విశాల భారతి :** మణికొండకు చెందిన బీఆర్ఎస్ మహిళా నాయకురాలు రూపా రెడ్డిపై మోసం ఆరోపణలు చేస్తూ బాధితులు నార్సింగి పోలీస్ స్టేషన్ ఎదుట తీవ్ర ఆందోళనకు దిగారు. బాధితులు పెద్ద సంఖ్యలో నార్సింగి పోలీస్ స్టేషన్ ముందు చేరుకుని ధర్నా నిర్వహించారు. రూపా రెడ్డిని వెంటనే అరెస్ట్ చేసి తమకు న్యాయం చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. బాధితుల కథనం ప్రకారం, చిన్నచితక వ్యాపారులు, సాధారణ ప్రజల నుంచి పెట్టుబడుల పేరుతో కోట్ల రూపాయలు సేకరించారని ఆరోపించారు. అయితే నెలలు, సంవత్సరాలు గడిచినా తమ డబ్బులు తిరిగి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, కష్టపడి కూడబెట్టుకున్న తమ సొమ్మంతా రూపా రెడ్డికి ఇచ్చామని, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా తిరిగి అందలేదని వాపోయారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బాధితులలో పలువురు పోలీస్ స్టేషన్లో ఇప్పటికే ఫిర్యాదులు ఇచ్చినప్పటికీ సరైన చర్యలు తీసుకోవడంలో ఆలస్యం జరుగుతోందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని వారు కోరారు. వందల సంఖ్యలో బాధితులు ఉన్నారని, తమ ఫిర్యాదులపై పోలీసులు వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా, నార్సింగి పోలీస్ స్టేషన్ ఎదుట జరిగిన ఈ ఆందోళనతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు సంఘటన స్థలంలో బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులో ఉంచారు.

## తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్కు తెలంగాణ పోలీస్ అకాడమిలో ఘన నివాళి



**రాజేంద్రనగర్, విశాల భారతి :** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ఆర్.బి.వి.ఆర్.ఆర్. తెలంగాణ పోలీస్ అకాడమిలో ఘనంగా నివాళులర్పించారు. అకాడమీ ప్రాంగణంలోని ఏకశిల అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్లో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి గౌరవం తెలిపారు. ఈ సందర్భంగా అకాడమీ డిప్యూటీ డైరెక్టర్లు జి. కవిత, ఎన్. వెంకటేశ్వర్లు, కె. ఆర్. కె. ప్రసాద్ మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావానికి ఆయన అందించిన సిద్ధాంతపరమైన మార్గదర్శకత్వం, అంకితభావం, ఉద్యమ స్ఫూర్తి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో ఉద్యమకారులు ప్రజాస్వామ్య పద్ధతుల్లో క్రమబద్ధంగా పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహనీయుడు జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అకాడమీకి చెందిన ఎడీలు వేమా శ్రీనివాసరెడ్డి, యార్లగడ్డ రాంబాబు, నరహరి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి యాదమ్మ, డీఎస్పీలు సతీష్, భాస్కర్, తోట శ్రీనివాసులు, జగదీష్, తిరుపతి, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ సోమశేఖర్ తదితరులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్కు ఘన నివాళులర్పించారు.

## బోనాల వేడుకల్లో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు



**కూకట్ పల్లి విశాలభారతి:** ఆషాడ మాస బోనాల పండుగను పురస్కరించుకొని రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మూసాపేట్ డివిజన్ పరిధిలోని పలు గ్రామదేవతల ఆలయాలను ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు సందర్శించి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలు ఆలయాలలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, మొక్కులు సమర్పించి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బోనాల పండుగ ప్రతి ఒక్కరిలో భక్తి ఐకమత్య భావాలను పెంపొందిస్తుందని అన్నారు. గ్రామదేవతల ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.అలాగే రాష్ట్రంలో ప్రజలందరికీ సుభిక్షం చేకూరాలని, యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలని, రైతులు, కార్మికులు, మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమాలలో ఆలయ కమిటీ సభ్యులు, ముసపెట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్, బిజెపి సీనియర్ నాయకులు ఐలయ్య యాదవ్,మల్లేష్గౌడ్,తూమ్ శైలేష్,అత్తికారి మల్లేష్,సతీష్గౌడ్, శ్రీనివాస్ గౌడ్, శేఖర్ గుప్తా, జీవన్, నర్సింగ్,ఈ.సాయి,రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల భద్రతపై అవగాహన

**గ్రీన్ ఫార్మసిటీ పోలీస్ స్టేషన్ సీఐ సత్యనారాయణ ఎస్ఐ సైదులు**




**విశాలభారతి ఇబ్రహీంపట్నం:** సైబర్ జాగృతి దివస్లో భాగంగా యాచారం మండల పరిధిలోని హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో కుర్మిద్ద ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఎస్సై సైదులు సైబర్ నేరాల భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై సైదులు మాట్లాడుతూ విద్యార్థులకు ఆన్లైన్ మోసాలు, ఫిషింగ్ లింకులు, ఓటిపి మోసాలు, క్యూఆర్ కోడ్ మోసాలు, సోషల్ మీడియా భద్రత, పాస్వర్డ్ వినియోగత, వ్యక్తిగత సమాచారం, గోప్యత, డిజిటల్ అరెస్టు వంటి కొత్త తరహా మోసాల గురించి వివరించారు. అపరచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, ఇలాంటి లింకులను నమ్మవద్దని, ఏదైనా మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్ లైన్ ఫోన్ నెంబర్ కి, లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ లో ఫిర్యాదు చేయాలని, సూచించారు. దేశంలో ప్రతి నెలలో మొదటి బుధవారం సైబర్ జాగృతి దివస్ నిర్వహించడం ద్వారా విద్యార్థులు ఉపాధ్యాయులు, ప్రజలలో సైబర్ నేరాల భద్రతపై అవగాహన పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

విశాల భారతి





# 'రాకా' షూటింగ్‌కు ఇబ్బందులా..

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ప్రస్తుతం మాతృత్వాన్ని ఆస్వాదిస్తూ కుటుంబంతో సమయం గడుపుతున్నారు. అయితే ఆమె మెటర్నటీ బ్రేక్ కారణంగా అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'రాకా' షూటింగ్‌కు ఆటంకం ఏర్పడుతుందనే ప్రచారం జరుగుతున్న వేళ, చిత్రబృందం అందుకు పూర్తి భిన్నంగా ముందుకు సాగుతున్నట్లు సమాచారం. సినీ వర్గాల సమాచారం ప్రకారం, దీపికా మెటర్నటీ బ్రేక్‌ను ముందుగానే దృష్టిలో పెట్టుకుని చిత్రబృందం షూటింగ్ షెడ్యూల్‌ను ఎంతో కచ్చితంగా ప్లాన్ చేసింది. ఆమె అందుబాటులో ఉన్న సమయంలోనే ఎక్కువ భాగం సన్నివేశాలను పూర్తి చేయడంతో ప్రస్తుతం షూటింగ్ ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతోంది.దీపికా విరామంలో ఉన్న రోజుల్లో ఇతర ప్రధాన నటీనటులతో చిత్రీకరణ నిర్వహిస్తూ ఒక్క రోజు కూడా వృథా కాకుండా మేకర్స్ జాగ్రత్తలు తీసుకున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం దీపికా పదుకొణెకు సంబంధించిన షూటింగ్ దాదాపు పూర్తయినట్లు సమాచారం. చిన్న సన్నివేశాలు మాత్రమే ఉండగా, వాటిని తర్వాతి దశలో చిత్రీకరించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆమె వ్యక్తిగత జీవితానికి, సినిమా నిర్మాణానికి మధ్య ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మేకర్స్ పక్కా ప్లానింగ్ చేసినట్లు తెలుస్తోంది. 'రాకా' సినిమాలో దీపికా పదుకొణె పాత్ర కథకు అత్యంత కీలకమని సమాచారం. ఆమె పాత్ర చుట్టూనే కథలో ప్రధాన మలుపులు తిరుగుతాయని టాక్ వినిపిస్తోంది. అందుకే షూటింగ్ ప్రారంభ దశలోనే ఆమె సన్నివేశాలకు ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేసినట్లు తెలుస్తోంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.